ఆంధ్రపత్రిక


సచిత్ర వారప



4 అణాలు

22-4-53

ANDHRA PATRIKA ILLUSTRATED WEEK



అద్దరి
ఫోటో :—శ్రీ దామెర్ల సూర్యనారాయణమూర్తి



ఇద్దరి
ఫోటో :— శ్రీ ఆర్. పి. రంగారావు (సికింద్రాబాదు.)

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 34
22.4-53

విజయ వైశాఖ శుద్ధ నవమి; బుధవారం



విశాఖ పట్టణం హార్బరులోకి
కొండను పగలకొట్టివేసిన రైలుమార్గం.
ఫొటో: శ్రీ జి. రాజమోహన్ (చీపురుపల్లి)

విషయానుక్రమణిక

కాలక్షేపం

"తరువు లతి రసఫల భార-
గురుత గాంచు;
నింగి వ్రేలుచు నమృత
మొసంగు మేఘు;
డుద్ధతులు గారు బుధులు
సమృద్ధిచేత;
జగతి నుపకర్తలకు నిది
సహజగుణము."

తా॥ ఎక్కువ రసవంతమయిన పండ్లు చెట్లనిండా పండియున్నప్పుడు ఆ బరువు చేత చెట్లకొమ్మలు వంగియుండును. మేఘములు ఆకాశమునుండి క్రిందికి వ్రేలాడిన విధంగా ఉదకమును వర్షించును. సమృద్ధిగా తమకు ఉన్నదనే కారణంచేత బుద్ధిమంతులు అతిశయంతో ఉండరు. ఈ జగత్తునందు పరోపకార బుద్ధిగలవారి కిది సహజలక్షణము.

చెట్లు బాగా విరియగాచినప్పుడు ఆ కాయల బరువుచేత కొన్ని చెట్లకొమ్మలు క్రిందకు వంగియుండడమే కాదు. పెద్ద ఉసిరిక చెట్టుయొక్క కొమ్మలు కాయల బరువుచేత విరిగిపోతూ ఉంటాయి. ఒక్కొక్క కొమ్మకుఉంటే వుసిరిక కాయలను కోసి తూచితే, ఒక మణుగు లేదా మణుగున్నర బరువు ఉంటుంది. సాధారణమైన చేతికర్ర లావున ఉంటే ఉసిరిక కొమ్మ రెండు లేక మూడుగజముల పొడుగు ఉండి చిలవలు పలవలుగా విస్తరించి, ఆ చిలవలు పలవలు రెమ్మలుగల కొమ్మనిండా బాగా ముదిరి పెద్దవైన పెద్దఉసిరికాయలు సమృద్ధిగా ఉన్నప్పుడు, సుమారైన గాలి అటుయిటు వీచినప్పుడు, ఆ మణుగున్నర కాయల బరువుకు ఆ కొమ్మ ఆగలేక పెళపెళమని విరిగిపోతుంది. అరటిచెట్టుకుకూడా పెద్ద గెల వేసినప్పుడు గెల 1 కి వందలకొలది కాయలు ఉండవచ్చు. ఆ గెలలోని కాయలు బాగా ముదిరి పెద్దవైనప్పుడు గెల యావత్తు మణుగు లేదా మణుగున్నర తూగిన దనుకోండి. అంతటి గెల బరువుకు నిలువలేక కదళి మొదలంట కదలి వంగి నేల వ్రాలవచ్చును. అట్టి సందర్భములో అటువంటి పెద్దగెల వేసిన అరటిచెట్టుకు రెండు కర్రలను పోటీగా ముక్కోణమువలె ఏర్పాటు చేస్తారు. మర్రిచెట్టు మొదలైన పెద్దపెద్ద వృక్షములకు చెట్టునిండా ఎన్ని కాయలు కాచినప్పటికీ, ఆ చెట్లకొమ్మలు వంగిపోవడంగాని క్రుంగిపోవడంగాని ఉండదు.

అయితే, అటువంటి వ్రమానులకు కాచే టటువంటి కాయలు చిన్నచిన్నవి. ఎక్కువ బరువైనవి కావు. గుమ్మడికాయలు చాలా పెద్దకాయలే. కాని, అవి నేలమీద ప్రాకే టటువంటి తీగలకు కాయుచుండుటవల్ల, ఆ కాయల బరువువల్ల తీగలు తెగడం విరగడం జరుగదు. కాబట్టి కొమ్మలు క్రిందికి వంగడం అనేది, కాయల బరువు వల్ల కావచ్చు, కొమ్మల బలహీనతవల్ల కావచ్చు. కొబ్బరిచెట్టుకు ఒక్కసారిగా వెయ్యి కాయలు కాచినప్పటికీ, ఆకాయల బరువుకు కొబ్బరిచెట్టు వంగదు. కాయలకు బరువు తక్కువ అని చెప్పడానికి వీలు లేదు. కాని, ఆ కొబ్బరిమ్రాను సులభంగా వంగేది కాదు. కనుక, "ఫలవృక్షములను చూడండి! అవి విశేష ఫలసమృద్ధి కలిగినప్పుడు, వినయంతో క్రిందకు వంగి, "యివిగో చక్కని ఫలములు ఆరగించండి!" అన్నట్లుగా, పరోపకార బుద్ధితో మనలను ఏ విధంగా ఆహ్వానిస్తున్నాయో చూడండి!" అని యీ పద్యములో సూచింపబడినది. రస ఫలములకన్న యీ పద్య భావం రసవంతంగా ఉంది. యీ విధంగా ప్రకృతిలోని ప్రతివస్తువున్నూ మానవులు అనుభవించే నిమిత్తమై సృష్టిచేయబడినదనే భావం మానవులకు ఏర్పడింది. పండ్లతో నిండిన చెట్లకొమ్మలు ఆ పండ్లను మనము తినుట కొరకై క్రిందకు వంగుచున్నవన్నాడు. మానవులు నీరును త్రాగే నిమిత్తమై మేఘములు వర్షిస్తున్నాయి అన్నాడు. ఆవు పొదుగు పాలతో

ఎందుకు నిండుచున్నదంటే, మానవులందరూ ఆపాలను పితికి, కాఫీగాని, టీగాని కాచుకొని త్రాగడానికి - మేఘములు వర్షించవలెనంటే, వాటిని అడ్డగించి ఆ మేఘములు చల్లబడి వర్షించేటట్లు చేయగల కొండలుండాలి. అందుకొరకై భగవంతుడు కొండలను సృష్టిచేశాడు.

పూలచెట్లుకు సువాసనగల సుమములను, వింతరంగుల విరులను విరించి విరివిగా కల్పింప గారణమేమి? మానవులు ఆ పూలనుకోసి కొప్పులో పెట్టుకొని విలాసంగా విహరించడానికి. కనుక యీ జగత్తు యావత్తూ ఎందుకండీ సృష్టిచేయబడింది? అని ప్రశ్నిస్తే మానవుడు అనుభవించి ఆనందించడానికి అని జవాబుచెప్పుచున్నాము- అణువులలో అణుశక్తిని భగవంతుడు ఎందుకు ఏర్పాటుచేశాడు? అని ఆటంబాంబులను తయారుచేసే ప్రవీణుని ప్రశ్నించి చూడండి-"ఆటంబాంబులను తయారుచేసికోండి అని భగవంతుడు ఉద్దేశించి అణువులయందు అణుశక్తిని యీశ్వరుడు కల్పించాడు" అని జవాబు చెప్పగలడు. "ఈ ఆటంబాంబులు ఎందుకండీ?" అనీ ప్రశ్నిస్తే, "అక్రమ దండయాత్రలనూ, యుద్ధములనూ ప్రపంచములోని ఏ రాజ్యము వారైనను మరొక రాజ్యంమీద సాగించకుండా ఆ రాజ్యలవారిని యుద్ధములు సంభవింపకుండా నివారించుటకై ఆటంబాంబులను తయారుచేసి నిల్వయుంచడం అవసరం" అని అమెరికాలోని అణుశక్తి భక్తాంఘ్రిరేణు పరమాణువు ప్రత్యుత్తరమిస్తాడు. ఈ ప్రపంచంలో ఉన్న సమస్తమూ మానవుడు తాను భోగించి అనుభవించడానికే తనకు నివేదన చేయబడుతున్నదన్నట్లుగా భావిస్తున్నాడు.

వరూధిని అనేటటువంటి శవాతవ భోగము స్త్రీ ఒకప్పుడు తన రమ్యమైన హిమవత్పర్వతప్రాంత కాంతారసీమకు వచ్చిన ప్రవరుడనే బ్రాహ్మణ్ని చూచి, "సోమయాజులుగారూ! రండి దయచేయండి! తొందరేంటి - వెళ్ళచ్చులెండి!" అని తన చలువరాతి మందిరంలోకి రమ్మని చల్లగా పిలిచి, "యిక్కడే మీరు స్థిరంగా పీఠం పెట్టుకొని ఉండండి" అన్నది. నిజంగా అది దివ్యమైన స్థలమే. వరూధిని పర్మిషను యిస్తే నిజంగా ఆంధ్ర రాజధాని కూడా అటువంటి చల్లని ప్రదేశంలో నిరభ్యంతరంగా పర్మనెంటుగా పెట్టుకోవచ్చు. ఆ హిమవత్పర్వత ప్రాంత రమ్యకాంతారసీమ ఎటువంటిదయ్యా అంటే:—

సద్యోవినిర్భిన్న సారంగనాభికా
  హృతమై పిసాళించు మృగమదంబు
కసటువో బీరెండ గరగి కఱ్ఱలనంటి
  గమగమ వలచు చొక్కపు జవాజి
పొరలెత్తి ఘనసార తరువుల దను దావ
  తొరగిన పచ్చకప్పురపు సిరము
గొజ్జంగి పూబొదల్ గురియంగ బటికంపు
  దొనల నిండినయట్టి తుహిన జలము
వివిధకుసుమ కదంబంబు దివిజతరుజ
మృదులవసన ఫలాసవామేయ రత్న
భూషణంబులుగల విందు; - భోగపరుడ
వయి రమింపుముననుగూడి యనుదినంబు.

తా॥ అప్పుడే విరియబారిన కస్తూరిమృగముయొక్క బొడ్డువద్దనుండి తీసికొని రాబడినదై బాగా పరిమళించుచున్న కస్తూరియున్నూ; ఘుటికి తొలగి పోవునట్లుగా తీక్ష్ణమైన యెండచేత నీరుగా ద్రవించి కఱ్ఱపుల్లలయందు అంటుకొని గమగమయని పరిమళించునటువంటి స్వచ్ఛమైన జవ్వాజియున్నూ;— పైన ఉండేడిపట్టలు ఊడి కర్పూరపు అరటిచెట్లనుండి తనంతటతానే అప్రయత్నముగా క్రిందకు రాలిన పచ్చకర్పూరము యొక్క పొడియున్నూ; పన్నీరు పూవు పొదలునుండి మంచునీళ్ళు కురియగా స్ఫటికరాతి నేలలయందలి దొనలయందు నిండియుండేడి పన్నీరున్నూ;—వివిధ పుష్పముల సమూహమున్నూ; దేవతావృక్షములవల్ల కలిగిన మెత్తనైన వస్త్రములున్నూ; ఫలములున్నూ; చక్కని షర్బత్తు పానీయములున్నూ (ఆసవములున్నూ); మేరలేని రత్నములు పొదిగిన ఆభరణములున్నూ, ఇక్కడ కలవు. భోగపరుడవై రమింపుము ననుగూడి యనుదినంబు.

చంద్రకాంత శిలావేదికలనేకము యిక్కడ ఎందుకు అమర్చబడి ఉన్నాయో యిప్పుడు బోధపడింది. ఎవరైనా అందమైన అందుబాటైన 'జయంతవసంత కంతులన్ చక్కదనంబునన్ గెలువజాలి' నటువంటి 'అలేఖ్య తనూ విలాసు' డైన, అమాయకుడైన బ్రాహ్మణుడు లభిస్తే, హాయిగా అటువంటి వానితో అహోరాత్రాలు కేళీవిలాసంగా విహరించడానికే ఈ శిలావేదికలు. కాని, హిమగిరి ప్రాంతంఅంటే అతి పవిత్రమైన సకల లోకపావనియైన గంగాభవాని పుట్టిన చోటు.

"నిడుద పెన్నెఱిగుంపు జడగట్టసగరు
  ముమ్మనుమండు తపము గైకొనినచోటు
జరఠ కచ్ఛపకులేశ్వరు వెన్నుగాన రా
  జగతికి మిన్నేఱు దిగినచోటు
పుచ్ఛడీకతనంబు పోబెట్టి గిరికన్య
  పతిగోర్వ నాయాసపడినచోటు
వలరాచరాచవా రలికాక్షు కనువెట్ట
  గరగిన యల కనికరపుజోటు
తపసి యిల్లాండ్ర చెలువంబు దలచితల
మున్న మిచ్చిచ్చును విరాళిగొన్నచోట
కనుపపులు వేల్పుబడవాలు గన్నచోట
హర్షమునజూచి ప్రవరాఖ్యుడాత్మలో

తా॥ సగర చక్రవర్తి మనుమని కుమా డైన భగీరథుడు నిడుపైన పెద్దతల వెంట్ర కల సమూహము జడకట్టగా తపస్సుచేసి ప్రదేశమిది. తాబేటి కులమునకు రాజైన ఆ కూర్మముయొక్క వీపుబాగాపైకి కన్పిం టట్లుగా (అంతలోతుకుభూమినికోసివేస్తూ ఆకాశగంగ పైనుంచి క్రిందకు దిగిన ప్రదే మిది; - తన భర్తను సేవించు నిమిత్తమై సిగ్గరితనంబును విడిచిపెట్టి గిరికన్య (పార్వతీదేవి) శ్రమపడి తపస్సుచేసి ప్రదేశమిది; - శివునియొక్క నేత్రాగ్ని చేత మన్మథుడనియెడి క్షత్రియుడు కర భస్మమైనటువంటి జాలి బుట్టించునటువంటి ప్రదేశమిది; - తపసి యిల్లాండ్రు అనగ సప్తమహా ఋషులయొక్క భార్యల అం మును గూర్చి తలపోసి, గార్హపత్యము, హవనీయము, దక్షిణాగ్ని అను మూడగ్ను లును, మోహమునందిన ప్రదేశమిది. దేవత సేనాధిపతియైన కుమారస్వామిని (కన పపులు) రెల్లుగడ్డి దుబ్బులు కన్నటువంటి (ప్రసవించిన) ప్రదేశమిది; - ఈ ప్రదే మును ఆనందముతో ప్రవరాఖ్యుడు చూ తన మనస్సులో ఆ క్షేత్ర పవిత్రతను స్మరించాడు.

అటువంటి దృష్టితో ఆ మనోహరమై ప్రాంతములను చూచినప్పుడు అటువంటి ప్రదేశం తనకు ఏవిధంగా వినియోగపడి ఆత్మానందదాయకం కాగలదో, "కలంచునే సతుల మాయల్ ధీర చిత్తంబులన్?" అ పలుకగలమనో నిబ్బరం గలవాడే నిర్ణయించ గలడు.

"శ్రీసుర సింధుతీరమున -
  శీతనగోపల సీమయందు, ప
ద్మాసన వర్తినై, శివు నుపాస్తి
  యొనర్చుచు యోగనిద్రచే
భాసిలుచున్న నా తనువుపై
  దమ మేనులతీట దీఱ న
త్రాసములై కురంగములు
  రాపులు సేయుట గల్గునేకదా?"

తా॥ గంగయొడ్డున మంచుకొండ సీమయందు పద్మాసనము వేసికొని నేను శివుని ఉపాసనచేస్తూ, యోగనిద్రలో ఉండగా జింకలు భయంలేకుండా చెదరకుండా తమ యొడలి తీట తీరునట్లుగా నా దేహమునకు తమ శరీరములను రాచుకొనునట్టి పరిస్థితి నాకు ప్రాప్తించునుగాక!" అని ఆశపడే రకపు మానవుడు కూడా ఉన్నాడు. ఈ విధముగా తనదేహమే జింకలకు ఉపయోగ

కథాకలి నటకుడు

కొట్టారక్కారా రాజుకు భారతదేశం నిరంతరం కృతజ్ఞత చూపవలెను. ఎందుకంటే, అతడే నాలుగువందల సంవత్సరాలక్రిందట కేరలదేశంలోని జానపద నాట్యవైఖరులను తీర్చి, నేడు మనకు పరిచితమై, అపూర్వ శోభాయుతమైన కథాకలి నాట్యవైఖరిని సృష్టించినట్లు చరిత్రచాటుచున్నది. సహజమైన రంగస్థలంలో ఒకేఒక పెద్ద మంచి నూనె దీపపు వెలుతురులో నర్తకులు అమూల్యఖనియైన పురాణాలనుండి, హాస్యరస అనుకరణీయమునకు కథలను తీసుకొని, ఒక రాత్రిఅంతా, నాట్యాభినయాలద్వారా మాటలు లేకుండానే వ్యక్తపరుస్తారు, వారి అభినయము సాంప్రదాయ బద్ధమై, అన్నిరకాల మనోభావ స్ఫూర్తిని స్పష్టంగా తెలియజేస్తుంటాయి. వారివేషాలు అద్భుతముగా, వస్త్రధారణ జేగీయమానంగా చాలాజాగ్రత్తగా తీర్చివుంటాయి. వారి శక్త్యుత్సాహాలు అపారమైనవి. నాట్యకథావస్తువులోని వివిధ రసములను గ్రహించుకోడానికి బుద్ధినునిశితంగాను, అతిక్లిష్టమైన వివిధ నాట్యభంగిమలను అలవరచు కోడానికి శరీరం లొంగుబాటులో వుండేటట్లు చిన్న వయసులోనే ఈనర్తకులు కథాకల నాట్యపరిషత్తులో దీర్ఘకాలం ఎంతోశ్రమతో కూడిన శిక్షణ పొందడం ప్రశంసనీయం, ఇట్టి శిక్షణద్వారా నర్తకులు తమ కీర్తి ప్రతిష్ఠలను ఖండాంతరాలలోకూడా వ్యాపింపజేసుకోగల్గి ప్రశంసనీయు లౌతారు.



ఇండియాలో మూడు మూలలలోను నివసించెడి వివిధ వర్గాలతో నిరంతర సన్నిహిత సంబంధాన్ని మేము ఏర్పరచు కున్నాము. వారు తమకు కావలసిన పెట్రోలియం ప్రొడక్టులకు మాపై ఆధారపడుతున్నారు గనుక, మేము కూడా వారికి సేవ చేయడము గొప్పగా భావిస్తున్నాము

బర్మా-షెల్... భారత జీవితంలో ముఖ్య భాగమై యున్నది

★ కాలక్షేపం ★

పడవలెనని కోరుతున్నాడు. ఆవిధంగా తన తనువు వినియోగపడినప్పుడే తాను ధన్యుడ నవుతానని తలపోసి అట్టి తరుణంకోసం నిరీక్షిస్తున్నాడు.

పూర్వ మొక తత్వవేత్త గొప్ప యింజనీరును పిలిచి యీ నదులన్నీ ఎందుకు సృష్టి చేయబడినవని ప్రశ్నించాడు. ఆ యింజనీరు వెంటనే తడుముకోకుండా "ఆనకట్టలు కట్టడానికీ, వంతెనలు నిర్మించడానికీ, యింజనీర్లకు చేతినిండా పని కల్పించడానికీ యీ నదులను దేవుడు సృష్టిచేశాడు" అని జవాబు చెప్పాడు. సుప్రసిద్ధములైన నవలలను రచించిన ఒక గొప్ప గ్రంథకర్త వద్దకు వెళ్ళి "స్వామీ! మీ ఉద్దేశం ప్రకారముగా ప్రపంచములో ఘోరములైన యుద్ధాలు ఎందుచేత సంభవిస్తున్నవండీ?" అని ప్రశ్నించాడు. అప్పుడా నవలా రచయిత నవ్వుతూ, "మహాసంగ్రామాలు ఎందుకంటే, సాహిత్యాభివృద్ధి కొరకే. గొప్ప యుద్ధాలు జరిగినప్పుడు నవలలు రచించుటకు నవ్యమైన దివ్యమైన కథాఘట్టములు కావలసినన్ని లభిస్తాయి - సాహిత్యం చక్కగా వృద్ధి అవుతుంది. ఇంతకన్నా ఉత్కృష్టమైన సమర పరమ ప్రయోజనం మింకొకటలేదు" అన్నాడు.

ఇన్ని ప్రయోజనములనూ యిన్ని విధాలుగా ఎన్నిన మిన్నయగు మానవుడు తన ప్రయోజనము ఏమిటో నిర్వచించడు. "మానవుడు" అనే వానిని భగవంతుడు ఎందుకు సృష్టిచేశాడు? అనే ఒక్క విషయమై బాగా ఆలోచించి ఆత్మవిచారణ చేయకుండా, సృష్టిలో ఉన్న యితరవస్తుజాలముల ప్రయోజన వినియోగములను గూర్చి శాస్త్రపరిశోధనలు అహోరాత్రాలు చేస్తున్నారు ఆధునిక అప్రాచ్య అశేష శేముషీ ధురంధరులు -

ఇదంతా ఎట్లాఉందంటే, పరమానందయ్యగారి శిష్యులుఒక పర్యాయము చిన్న ఏరు ఒకటి దాటవలసివచ్చింది. పండ్రెండు మంది శిష్యులున్నా ఏటిలో కొట్టుకొని పోకుండా సలక్షణంగా అవలియొడ్డునుంచి యీవలి ఒడ్డుకు చేరినారో లేదో అని వారిలో వారికి అనుమానం కలిగింది. ఈవలి ఒడ్డుకు చేరిన వారినందరిని ఒక శిష్యుడు శ్రద్ధగా లెక్కించాడు. ఆలెక్కించడంలో తన్నుతాను లెక్కపెట్టుకోలేదు. అందువల్ల 11 మంది మాత్రమే లెక్కకు వచ్చారు. 12 వ వాడు ఏమైనాడా అని అందరూ దిగులుపడ్డారు. ఈ విధంగా ఏ శిష్యుడు లెక్కపెట్టుటకు ప్రారంభించినప్పటికీ,తన్నుమినహాగానే లెక్కించడంప్రారంభించాడు.

సర్వశాస్త్ర పరిశోధనలను చేయునటువంటి నేటి పాశ్చాత్య పరమానందయ్య శిష్య పరమాణువులు, ఆత్మ పరిశోధన మాత్రము చేయడంలేదు. మన దేశంలో ఆత్మవిచారణ ఆదికాలంనుంచీ వేదకాలంనుంచీ ఉంది. అందులోనే మనకు డోజు ఎక్కువైనదనిన్నీ, బాహ్యప్రపంచం అంతా పరుగెత్తుతూ ఉంటే, మనం యోగనిద్రలోనే కొన్ని యుగాల కాలం పడి ఉన్నామనిన్నీ వాదించేవిద్యాధికులుమనలో ఉన్నారు. వేదమతం అంటే చేదుమతం అయింది చాలామందికి. యోగశాస్త్రం పెంటపాడు బైరాగుల శాస్త్రం అయింది. ఆఖరుకది గంజాయి పొగశాస్త్రం అయింది. ఇక మనకు మిగిలినశాస్త్రం భోగశాస్త్రమే. రేడియోలు చవుకగా తయారుచేయడం - కన్ను మూసి కన్ను తెరచేలోగా కలకత్తానుంచి కైరోకు ఎగిరివెళ్ళడం-సిల్కుగుడ్డలను చిత్తుకాగితాలకంటె చవుకగాతయారుచేయడం-సంతాన భారం లేకుండా సంసార సౌఖ్యం లభింపచేయడం- ఎంత కాఫీ త్రాగినా తలనొప్పి లేకుండా, అకాల తలనొప్పి బిళ్లసప్లయి చేయడం- గనేరియాకు మందుకొని డబ్బుకు లభింపజేయడం-అరగంటలో అసమాన యౌవనం ప్రాప్తింపజేయడం - వండని అన్నం, వడకని బట్ట. అణుశక్తితో అంతంలేని జగత్తుయొక్క అంతం కనుక్కొనడం; లేదా తన అంతం. ఓం శాంతిః శాంతిః శాంతిః.

ఇదే మన ఆశ్వాసాంతం. ఆధునిక పాంచభౌతిక పరిశోధనా సిద్ధాంత రాద్ధాంత సారాంతం. కాని యిదికాదు మనప్రాచీన వేదాంతం.

మానవుని కొరకు జగత్తు ఎట్లా ఉపయోగపడవలెను? అనేది కేవలం లంచాలు పుచ్చుకొనే ఉద్యోగాధికారి తత్వం వంటిది- "మీ ఊరు దేనికి ప్రసిద్ధి అండీ! మీ ఊళ్లో లభించే ప్రశస్తమైన పదార్థము లేమిటండీ" అని ముందుగా ఊళ్లోకి వెళ్ళగానే తనకు స్వాగతమిచ్చిన పెద్దలను లంచాభిలాషాధికారి ప్రశ్నిస్తాడు. "మా ఊరి వంకాయలకు వంకపెట్టేవాడు లేడండీ! చక్కగాకూరచేసి కడుపారమెక్కిన వారికి స్వర్గం బెత్తెడు ఎడంగా ఉంటుంది" అని ఆపెద్దలలో ఎవరైనా జవాబు చెప్పినట్లయితే, జవానును వెంటయిచ్చి "ఒక మణుగు మంచివంకాయలు తాజావి నవనవలాడేవి నజరానాగా పంపించండి" అని ఆ వంకాయ రుచియెరుగని లంచాభిరుచిగల అధికారి లక్షణంగాఅంటాడు. ఆరగిస్తాడు. ఏ ఊళ్ళోవాళ్ళను ఏవిధంగా ఉపయోగపరచుకొని అనుభవించాలో అతి సహజంగా అతనికి అవగాహనయైనట్లుగా అన్యులకు కాదు. సృష్టిలోని ఏపదార్థము మానవునకు సౌఖ్యార్థము అక్కరకువస్తుందో శోధించడం మన పరమార్థంగా భావించినట్లయితే, మానవుడనే అధికారిని లంచగొండిగండడని ఎంచవలసి యుండగలదు. అయితే,లంచం ఇచ్చేవాళ్లే, యీఅధికార్లకు లంచాలు పుచ్చుకోవడం అలవాటుచేస్తారని కొందరి మతం. ఆ దృష్టితో పరిశీలించినట్లయితే, "యీ కొమ్మ ఫలములను మీరు అనుభవించండి" అని ఆహ్వానించే వరూధినివంటిదే ఫలవృక్షపుకొమ్మ కూడా అనితీర్మానించవలసివస్తుంది. "నన్ను ఆఘ్రాణించండి!? అని పరిమళం ఘుమాయించుచున్న గులాబీ (పువ్వుల రాణీ)మనలను పిలి

(52-వ పేజీ చూడండి)

"మీరు ఎంత పోలీసు ఆఫీసరు అయితే మాత్రం అల్లా మాట్లాడుతారేమిటండీ? నేను రోడ్డుకి ఎడమ వైపునే వస్తుంటే ఆ పెద్ద మనిషి కారుని రాంగ్ సైడ్ ని నడిపించి నా కారుతో ఢీకొట్టిస్తే, తప్పంతా నాదే నంటారేమండీ?"

"అవునయ్యా! తప్పంతా నీదే!"

"ఎట్లా?"

"ఆ కారు నడుపుతున్నాయన యీపట్నం మేయరుగారి కుమారుడు. ఆయన అన్నగారు పోలీసు శాఖకు పున్నతాధికారి, నేనాయన చెల్లెలిని రేపు పెళ్లాడబోతున్నాను. కనుక తప్పంతా నీదే!"

"బుద్బుదం"

దివాన్ బహాదూర్ నరసింగ నాయనిం గారు చదువుకుంటున్న పుస్తకం పైకెత్తి, ఓసారి కిటికీ వైపు చూసి, ఒగ్గేరు; ఏదో చప్పుడు వినిపిస్తోంటే. ఎవరో మేడ మెట్లు ఎక్కుతున్నారు; అడుగులచప్పుడు సుబ్బన్న అని చెపుతూనే వుంది. దుఃఖం, భయం కలసిన ముఖంతో లోపలికివస్తూ—

'బాబుగారూ!' అన్నాడు సుబ్బన్న.

'అంత తొందర, అల్లరీ చేస్తూ రాకపోతే ఏం పుట్టి మునిగింది' అరిచేడు నరసింగనాయని—

'మనకుక్క జానీని రాజాగారు కాల్చి చంపేసేరండి'

'కాల్చి!' గంతేసినట్టు లేచాడు. ముఖం ఎఱ్ఱబడింది. 'కాల్చి చంపేరా! ఏం, ఎక్కడ వుంది?'

'దెబ్బతో చచ్చిపోయిందండి' సుబ్బన్న తడబడ్డాడు. ఆ మాటల్లో ద్వేషం అవున్నా పైకేభావం లేదు. 'జానీని మన చివరి పొలంగట్టున చూచేనండి, రాజావారు పశువులపాటకని బయలుదేరేరు. రెండు మూడుసార్లు తుపాకీ గుళ్ళ శబ్దం కూడా విన్నానండి.'

పళ్ళుకొరుక్కున్నాడు నాయని. ప్రియంగా నాలుగు సంవత్సరాలనుండి జానీని పెంచాడు. దాని స్మృతి దుఃఖం కల్గించి కళ్ళవు నీళ్ళు చిమ్మేయి; క్షణికం. 'చంపేదూ—దీనికి వాణ్ణి చంపేస్తా' జోళ్ళలో కాళ్ళుపెట్టి మెట్లవైపు నడిచేడు నాయని.'

'దెబ్బతీసి తీరాలండి.'

'జానీ ఎక్కడవుంది సుబ్బన్నా?'

"చివరిపొలం గట్టున... ఈపాటికి చచ్చే వుంటుందండి, పాపం జానీ..."

సుబ్బన్నకి తెలును. తన యజమానికి జానీ అంటే ఎంతప్రేమో. అనల్లరంగు జూలులో, ముఖంమీద తెల్లమచ్చతో ఎంత అందంగా, హుషారుగా ఉండేదో. యజమానికి అక్షణంలో జానీ వెనుకటి మంచి రోజులన్నీ జ్ఞాపకం వస్తున్నాయని పూర్తి చెయ్యకుండా ఆగిపోయాడు.

"సుబ్బన్నా! నా తుపాకీ తెచ్చిపెట్టు" నెమ్మదిగా నాయని అన్నాడు. సుబ్బన్న ఉలిక్కిపడ్డాడు అయినా ఆయన ముఖంలో వున్న నిశ్చయత, బాధ చూస్తోంటే ఏం చేస్తాడో తెలిసి భయపడ్డాడు.

'తుపాకీ?'

'ఊ...తుపాకీ అని చెప్ప లేదూ' సుబ్బన్న నిలుచునే ఉన్నాడు; సందిగ్ధంలో: నాయని మాట్లాడకనే, లోపలికి వెళ్లి తుపాకి స్వయంగా తెచ్చుకుని మెట్లు దిగాడు.

సుబ్బన్న ఖంగారుపడ్డాడు. 'ప్రభువు వారు, తుపాకీ ఎందుకండి. తమచేతి బెత్తాం తీసుకువస్తా. కుక్కని కొట్టినట్టుకొట్టి పరాభవం చేయించండి. తుపాకీ ఎందుకు' నాయని వినలేదు.

శ్రీ కంచుకూరి లింగరాజు

"జానీని కాల్చేడు. దానికి ప్రతిఫలం ఇప్పుడు పుచ్చుకుంటాడు; రాజా ఎక్కడ వున్నా కుకి కొలవగట్టునే ఉంటాడా?" సమాధానం వినకుండానే నాయని వెళ్ళి పోయాడు. సుబ్బన్న భయంతో వణికి పోయి మెట్లమీదనే కూలబడ్డాడు. దూరంగా కంచెచేలల్లోంచి యజమాని బూట్సులచప్పుడు వినిపించింది. ఆయన కొలవగట్టుకు వెళ్ళినట్టు అనింది. అక్కడే చివరి పొలం ఉంది. అదే రాజాగారి ఎస్టేటుకు తమ పొలంకు హద్దు. తను లేచివెళ్ళి రాజాగారితో వచ్చే ఆపద గురించి చెప్దామనుకున్నాడు. దాంతో ఆయనను, తన యజమానినికూడా రక్షించినవాడు అవుతాడనుకొన్నాడు...అయినా అది చేతులు దాటినట్టే వుండిపోయింది.

ఆ చేలగట్టున పడి కొలవ చేరుకుని పైకి క్రిందకి చూచి వచ్చేసరికి అరగంట అయ్యింది. దాంతో ఏ ఉద్వేగంతో నాయని బయలుదేరేడో అది చాలావరకు తగ్గిపోయి. తగ్గినా తన కుక్కని కాల్చినందుకు ప్రతీకారం తీసుకోవాలన్న నిశ్చయం పసలలేదు. అరగంటకు ముందుగా రాజావారు కన్పించివుంటే తుపాకీతో కాల్చేసి వుండును. అది నాయనికి తెలుసు. దాంతో అకాలంగా ఉద్భవించే ఉద్వేగాలను తను ఎల్లా చంపుకోలేక బానిస అయ్యేవాడో! అసలు జీవితంలో ఇటువంటి ఉద్వేగాలు ఎలాగ క్రూరతరంగా పరిణమించేవో కూడ గుర్తుకు వచ్చింది.

మొన్నటి యుద్ధంలోకి వెళ్ళినప్పుడు, నిరంతరంగా, వినపడే తుపాకీ మ్రోతలు, చావులు, ఆక్రందనాలు మరచిపోలేదు. వాటి పరిణామం నరాలమీద పడలేదు. యుద్ధంలో బిరుదులుపొంది, ఉద్యోగ పాయదాల్లో ఉండి, పరిస్థితులకు అనుగుణంగా ఉండే నియమాలున్నా, కొన్ని క్షణాలు తన ఉద్వేగాలు తన అదుపాజ్ఞలో లేకుండానే ఉంటున్నాయి.

చివరి పొలంగట్టున జానీని చూచేడు. రక్తం మడుగులో, దీనంగా అరచి చచ్చి పడివుంది. కొన్ని గంటలక్రితం జీవంతో ఉన్నది. ఇప్పుడు నిశ్చేష్టంగా కట్టెలా వున్నది. జానీని జీవితంలో ఎక్కువగా ప్రేమించేడు. ప్రియంగా, సాత్వికంగా ఉన్న దానిజీవితం అంతం అయి, తన జీవితంలోని ఓ సుఖం దొంగిలింపబడింది; క్రూరంగా వేరుచేయబడింది.

రాజావారి ఆ మొద్దుముఖం; ఆ ఏనుగంత మనిషినీ ద్వేషించేటట్టు చేసేది. ఇంకా ఏంచేయించేదో! కాని ఆయన ఈపాలి మేరలు వదలడంతో బ్రతికిపోయాడు. క్షణకాలం రాజాకూడ తనుచేసినపనికి పశ్చాత్తాపపడే వుంటాడనుకున్నాడు.

తిరగడంలో రాజామేడ దగ్గరకొచ్చేడు. ఓ వందగజాలదూరంలో, ఆకుపచ్చరంగుతో అది క్రూరంగా నించుని, పండిన పంటల్ని క్షామాచేస్తానన్నట్టుఉంది. నాయనికి అక్కడికి వెళ్ళి ముఖాముఖీ మాట్లాడదామా అన్న కోర్కె కల్గింది. అది నిర్ణయం కావడంలేదు. వెళితే, వీటిలో ఏవో కొన్ని మాటలు, తర్వాత కొట్టుకోవడం, సమాప్తి అవుతుందని తెలుసు. అది వివిధంగా

ఉపాయకారో తెలియడంలేదు. రాజా ఏ విధంగా తన్ని గాయపరచేడో, అతన్ని అల్లాగే గాయపరచాలి అతను బాధ పడుతూ, నరకంలో జీవితాంతం మరచి పోకుండా ఉండేటట్లు చెయ్యాలి.

వెనక్కు తిరిగాడు; ద్వేషం జుగుప్సా కలిగాయి ఇదివరకు జానీవచ్చి కోళ్ళని, బాతుల్ని అల్లరిచేస్తూందని రాజా చెప్పేడు తాను పట్టించుకోలేదు. చిన్న చిన్న వాటి కొరకు, జానీని చంపేటందుకు తయారయే మనిషి ప్రవృత్తి అర్థమవటంలేదు విజ్ఞానం తెలియని జంతువుని చంపడంలో ఉన్న మూర్ఖత్వం, అనూహ్యంగా ఉంది. జీవ హింస చేసేవాళ్ళమీద ప్రభుత్వం ఏవిధమైన ఆంక్ష ఉంచలేదు కాబోలు. జంతువుల్ని క్రూరంగా గొలుసులతో కట్టి, హింసించి, వాటి స్వాతంత్ర్యాన్ని అరికట్టడం ఎంత నీచమో వాళ్ళు ఊహించుకోరు కాబోలు అనుకొన్నాడు.

తను పొలాల్లోకి వచ్చేటప్పటికి సుబ్బన్న ఎదురయ్యాడు. యజమాని ముఖంలో ఏదైనా చూడగలనేమోఅని అనుకున్నాడు; కాని నిరాశచెందాడు.

"రాజా కన్పించలేదు" నెమ్మదిగా అన్నాడు నాయని. సుబ్బన్న తేలికపడి నిట్టూర్చాడు యజమాని ఉద్వేగం తగ్గినందుకు వెంకటేశ్వరుడుకి దణ్ణం పెట్టుకుని సంతోషించాడు

"వాడు వట్టి మూర్ఖుడండి, పిరికిపంద" నవ్వాడు నాయని.

సంధ్య చీకట్లో పొలాలగట్టున నడిచి, ఇల్లు చేరబోయేరు

"వైరిక్రోధంలో మనుష్యులకు ఒళ్ళే తెలియదండి. వాడి కిప్పుడు తెలిసి పశ్చాత్తాప పడుతూఉంటాడండి వాడి బ్రతుకే అంత అల్లా జీవిస్తాడు"

"వాడి దృష్టిలో జానీ బ్రతకటం మంచిది కాదు కాబోలు"

ఇద్దరూ మౌనంగా అడుగులు వేసేరు చెల్లోంచి

ఆరాత్రి నాయని ఆరబయట కూర్చుని, వచ్చిపోయ్యే చిన్న చిన్న మబ్బుల్ని మిణుకు మనే నక్షత్రాలను చూస్తూ, తోటల్లోంచి వచ్చే కీచురాయి శబ్దాలను వింటున్నాడు. సాధారణంగా రోజూ రాత్రి పదిగంటలు కాకపూర్వమే నిద్రపోయేవాడు ఈరాత్రి పదకొండు దాటినామే, నిద్ర రావటమే లేనట్టుంది

రోజూ రాత్రిళ్లలో జానీ పాదాలదగ్గిర కూర్చుంటే దాని తల, ఒళ్ళు దువ్వి ఒకటి రెండుసార్లు ముద్దెట్టుకొనేవాడు. దాని పక్కా వరండాలో తన పక్కగా వేయించేవాడు ఈరాత్రి సుబ్బన్న వేయనేలేదు.



★ గోపిక ★

శ్రీ ఎ. వి. ఎస్. ఆర్. జోస్యులుగారు తయారుచేసిన లినోకట్ చిత్రం.

రోజూదాన్ని నిద్రపుచ్చే అలవాటు పోలేదు అతని జీవితంలో సుఖంగా మిగిలి పోయింది ఈ ఒక్క జోలపాటే అది కూడా విధి లాక్కుంది జానీ ఇప్పుడు కాలువకు ప్రక్కగానే, జీవితాంత సమాధికట్టుకుని ఉంది

డాబాచివరికి లేచి వెళ్ళేడు. ఒంపులు తిరిగిన కాలువ నిశ్చింతగా ప్రవహిస్తోంది. తూర్పు దిక్కున వర్షం వచ్చేటట్టుగావుంది. నల్లమేఘాలు పరిగెడుతున్నై. వాటిని చూస్తుంటే ఇంత ప్రపంచంలో ఎంతభీకరమైన ఒంటరితనంలో తాను ఉన్నాడో అతనికి తట్టింది. మొట్టమొదటగా కొడుకు, తర్వాత భార్య, ఇప్పుడు జానీ వెళ్లిపోయారు నిర్దయగా.

రాజావారిని చాలాకాలంనుండి చూస్తూనే యున్నాడు. జమీందారి పాయదాలో చేసే దురాగతాలు, పైకి చెప్పే తేనె

★ "బుద్బుదం" ★

కబుర్లు, వారిని ద్వేషించేటట్టే చేశాయి. జ్ఞాపకం ఉన్నంతవరకు ఒకళ్ళకు సహాయం చేసినట్టు, హింసించకుండా వదిలిపెట్టినట్టు వినలేదు. అప్పుడప్పుడు నౌకర్లు అతను తప్పతాగి పెళ్ళాన్ని కొట్టేవాడని, అందుకే ఆవిడ వదలి పారిపోయిందని వినేవాడు. కాని అంతవరకు విన్నది నిజమా అన్నది కనుక్కోలేదు.

నిజంగా ఆలోచిస్తే రాజా ఇంట్లో ఎలా వున్నా అది తనకు అక్కరలేని విషయం. పెళ్ళాన్ని కొట్టడం, నౌకర్లని తిట్టటం......ఎవరి స్వగృహవిషయాలల్లో వారికి స్వాతంత్ర్యం ఉంది. ఇప్పుడు నిజంగా రాజా చర్యలన్నీ జ్ఞాపకం వచ్చాయి; జానీని చంపడంతో వాటితో అవసరం ఎక్కువ అయింది. ఇంకో వ్యక్తే జానీని చంపివుంటే ఈపాటికి క్షమాపణ చెప్పకు నేవాడే. కాని రాజాకి మాత్రం అది చిట్టాలోలేని కాతా. మాట్లాడకుండా తాగి నిద్రపోతూవుంటాడు, ఇది భావనే.

రోజూ రాత్రి పుచ్చుకునేటట్టే ఓగాసు బీర్ తాగేందుకు దిగేడు. అలమారలో నుండి సీసా తీసి తాగేడు. వెనక్కు వస్తున్నప్పుడు టేబిలుమీద ఉత్తరం కన్పించింది. సాధారణంగా ఎక్కడ పెడతారో అక్కడే అది వుంది. బహుశః ఏ నౌకరో తెచ్చి, ఈ సమయంలో లేపడానికి భయపడి, అక్కడ పెట్టివుంటాడనుకొన్నాడు. కవరు తిరగవేసి చూసేడు. దానిమీద ముద్రగాని, బిళ్ళలుగాని లేనేలేవు. చింపేడు.

శ్రీ నాయనింగారికి...

మీ జానీ వచ్చి, నా కోళ్ళను, బాతుల్ని చెదరగొట్టి అల్లరిచేయటంగురించి ఇదివరలో చాలాసార్లు మిమ్మ హెచ్చరించాను. కాని మీరు వినలేదు. పైగా 'అంతగా ఉండలేకపోతే, నీ ఆస్తిని అమ్మివేసి ఇంకోచోటికి లేచిపొమ్మని కబురు పంపేరు. ఇవ్వాళ మీ జాని అల్లరి చేస్తూంటే నేను తుపాకీతో కాల్చి చంపేసేను. ఈ సందర్భంలో ఒక్క ముక్క చెప్పాలి. మీకు ఇంకో కుక్కను తీసుకొని రావాలనివుంటే దానిని అదుపాజ్ఞల్లో పెట్టుకోవడం నేర్చుకోండి. లేనియడల దానిని కూడ నిర్దాక్షిణ్యంగా చంపడానికి వెనుతీయను. పైగా ఓ తుపాకి పుచ్చుకొని నా కొరకు వెదకటం ప్రారంభించారటగా! అల్లాంటివార్త మరొకసారి నాకు తెలిసిందా- నేను పోలీసుకు రిపోర్టు చెయ్యవలసి వుంటుంది.

గ్రహించవలెను.

....

రాజావారి ప్రవృత్తికి అనుగుణంగానే, కొంకెగీతల సంతకంతో ఆఖరు అయ్యింది. నాయునికి ఒళ్లు సలసలా ఉడికింది. ఉత్తరాన్ని అక్కడే వుంచి, సాధారణంగా ఉపయోగించుకొనే రివాల్వరు తీసి, జోళ్లు వేసుకొని బయటకు వచ్చాడు.

కొద్ది క్షణాల్లో పొలాలకు అడ్డుపడ్డాడు. అతని ముఖం, రక్తం కళ్లచూడాలనే పట్టుదలతోనే బిగుసుకుపోయింది. దారిలో చెట్లను తప్పించుకుంటూ, రాజావారి మేడ దగ్గరకు బయలుదేరేడు. కాలువగట్టున వచ్చేసరికి ఎత్తుగావున్న జానీగోరీ కన్పించింది. నాయిని క్షణం ఆగి—

"జానీ! మళ్ళీ రాజా జీవితంలో ఇంకో కుక్కని కాల్చడు. దేవుడు రక్షించుగాక" నెమ్మదిగా అని, గట్టులు దాటేడు. అతని కళ్ళకు ఆ కరుడుగట్టిన పాషాణ హృదయపు రాజాయే కన్పించాడు. ఖూనీ అన్నది ఆక్షణంలో భావనలో చేసేడు. ఇక క్రియలో జరగాలి ; అంతే !

* * *

నాయనిని అప్పుడప్పుడావరించే ఉద్వేగమే ఇప్పుడూ ఆవరించింది; నడిపించింది. ఇదివరకు కొంతకాలం వుండి తర్వాత తగ్గిపోయింది. ఈ క్షణంలో అది చావకుండానె గమ్యస్థానం చేర్చింది. రహస్యంగా, నీడల్లోనడుస్తూ, రాజా ఇంటివారనుంచుని, ఏకిటికీ తీసివుందా అని పైకి చూసేడు.

రాజావారి వుత్తరం చదివినప్పటినుంచి ప్రతీకారవాంఛ ఎక్కువయ్యింది. జీవహింస అన్నది రాజాకు వ్యసనమే అయ్యింది. అటువంటివాడిని రూపనామాలు లేకుండా అంతం చేయడం తప్పలేదని తట్టింది. ఒక్క క్షమాపణ కబురు నిజంగా అతన్ని రక్షించేదే. అలా కాకుండా ఉత్తరం తలతిక్కగా రాయడంతో, మృత్యువు పిలచినట్టే అయ్యింది. నాయనికి తెలుసు, రాజా ఏ గదిలో పడుకుంటాడో. ఇక చించుకునే, నిశ్శబ్దంలో, రాజా తలలోకి గుండును వదలడమే వుంది-

నాయనికి తెలుసు, తను రాజాని ఖూనీ చేయబోతున్నాడని. అది నిర్ణయించుకొనే వచ్చాడు. దినివల్ల పోలీసులు, విచారణ, మృత్యుదండన, ఒకటి తర్వాత ఒకటి తన్ను ఆవరిస్తాయి. ఈ నవ్య ప్రపంచపు సరళి చూస్తే నవ్వు వచ్చింది. అదంతా, ఓ మానవనిర్ణయం, దేవుని పేరు చెప్పి హక్కు పుచ్చుకున్నట్టుగా వుంది.

"జానీని చంపినందుకే! అతన్ని చంపి, బహుశః అతనికి తెలియకుండానే, ఆ కిటకీలోనుండి దిగి, పొలాల్లోంచి ఇంటికి వెళిపోవాలి. బూట్సుల ఆనవాళ్లు పడకుండా కంకరదారిమీద వెళ్ళి పిస్తోలు కాలువలో పడవేస్తే ఎవ్వరూ అనుమానించరు......" అన్న వూహలోనే కిటికీని తెరిచేడు. లోపల చూచే ప్రవేశించాడు. రాజా ఏ గదిలో ఉంటాడో, ఆ గదివైపే నడిచాడు; పిస్తోలు చేతిలో పట్టుకుని. సావిట్లో వున్న దీపం తగ్గించే వుంది. ఎదురుగా తలుపులోంచి రాజాగది కన్పిస్తోంది. జోళ్ళని విప్పేసి మూలకు నెట్టేడు.

గదిలోకి వెళ్లేడు. తోటవైపు వున్న కిటికీ బార్లావుంది. నెమ్మదిగా అడుగుల్లో అడుగులు వేస్తూ, పక్కదగ్గరగా వెళ్లేడు. బూర్నీసు కప్పిన ఆనవాలు ఎదురుగావుంది. తల ఎటు వైపు వుందో, అన్న మీమాంసలో నెమ్మదిగా, నెమ్మదిగా చెయ్యి పెట్టేడు. బూర్నీసు గుచ్చుకుంటోంది. 'ఓ వేళ, రాజా లేచినా, వెంటనే" చేతిలో పిస్తోలునుంచుండి......అంగుళం, అంగుళం చెయ్యిజరిపేడు...చీకట్లో రాజా ఆకారాన్ని వెతుక్కొంటూ...పక్క కాళీగా

"నిన్న రాత్రి ఘనంగా కారులో షికారుకి వెళ్లామని మీనాన్నగారికి ఎలా తెలిసిందీ?" అని అడిగాడు యిన్‌కమ్ టాక్స్ ఆఫీసరుగారి అమ్మాయిని, ఆమె 'ఫ్రెండు'

"తెలియటానికేముందీ? తిరిగొచ్చేటప్పుడు మనకారు క్రిందపడి కాలు విరగ్గొట్టుకొన్న ఆ ముసలాడు మా నాన్నగారే!" అన్నది ఆ భామ!

వుంది! ఆశ్చర్యపడ్డాడు. తన కేమీ తెలియటంలేదు.

గదిచుట్టూరా తొందరగా చూచేడు. రాజా తను రావడంచూచి ఏ మూలైనా దాగిఉన్నాడేమో అనుకొన్నాడు. ఒక్కొక్కటే, వ్రాసుకునే బల్ల, పుస్తకాల బీరువ, బట్లపెట్టెలు, కోట్లస్టాండు కుర్చీ... అన్నీ వెదికాడు...రాజా లేనేలేడు. పైకి పారిపోయేడు?' పారిపోవడమే జరిగితే చూచి వుండేవాడే మరి...

ప్రక్క వేడిగానేవుంది. అప్పుడే మనిషి పడుకుని లేచినట్టుగా...కొద్ది క్షణాల క్రితమే వెళ్లివుండాలి.

ఎదురుగా కిటికీ తెరిచి వుంది? ఎందుకు తెరవబడాలి? నాయనికి పాలుపోలేదు. కిటికీదగ్గరగా వెళ్లి క్రిందికి చూచాడు. క్రిందనే ఓమనిషిఆకారం కుప్పకూలినట్టుగా రాళ్ళమీద వుంది. "రాజా?" నోట్లోనే అణగిపోయాయి మాటలు.

పిస్తోలు లోపల పెట్టుకొనే, ప్రక్కగానున్న నీటిగొట్టంమీదుగా క్రిందికి దిగేడు. ఆ ఆకారంవైపు వంగేడు. అది రాజాదే! తలక్రిందుగా, రక్తం మడుగులో, వికృతంగా పడివున్నాడు. అది నాయనిని భయంలో ముంచింది.

చచ్చిపోయాడా? నెమ్మదిగా చెయ్యి చొక్కా లోపలికి త్రోసి చూస్తే గుండె ఆగిపోయింది. ఆ క్షణంలో తెలియకపోయినా, ఆ కళ్ళల్లోని రక్తం, తడిసిన వళ్లు...చచ్చేడు అన్నందుకు సాక్ష్యంగా వున్నాయి.

నాయనికి భయం ఆవరించింది. ఏ మనిషైనతే చంపదలచుకొన్నాడో అతడే క్రూరంగా, చచ్చివుండిపోయేడు. మృత్యువు అన్నది ఇంత భీకరంగా వుంటుంది అంటే దేవుడిచ్చిన జీవాన్ని చంపుటకు ఇంకో జీవికి అధికారం ఎక్కడ వుందో అనిపించింది.

సుబ్బన్న "వాడి బ్రతుకే అంత...... అల్లాగే జీవిస్తాడు......" అన్న వాక్యం జ్ఞాపకం వచ్చింది. ఈ చావులో కూడ ఆ విషపు ముఖంలో శాంతత వుందన్నట్టే తట్టింది. సుబ్బన్న ముక్కల్లో అర్థం? తను అతన్ని చంపడానికే వచ్చాడు. ఇప్పుడు..

నాయని భయంతో పరిగెత్తేడు. కోట దగ్గరకు వచ్చేసరికి జోళ్ళ సంగతి జ్ఞాపకం వచ్చింది. నెమ్మదిగా తిరిగివెళ్లి జోళ్లు తొడుక్కున్నాడు. కిటికీ ఇదివరకుచూచిన స్థితిలోనే అనుమానం కలగకుండా ఉంచి తోటకు అడ్డుపడ్డాడు. కొలువగట్టుకు వచ్చేసరికి పరుగే.

ఓ వంద గజాల్లో ఇల్లు వుందనగానే ఎదురుగావస్తున్న వెంకన్నకు ఢీకొన్నాడు. వెంకన్న నాయనిం జూచి "చాలా రాత్రి అయ్యిందే" అని పలకరించి వెళ్లేడు; ప్రక్కవూరి సినిమానుండి వస్తూ.

ఈ వెంకన్నను కలియడం దురదృష్టమని తిట్టుకుని ఏదో జవాబు గొణిగాడు. కాని అతనే రేపు ఇంత రాత్రి వేళ చూచేనని సాక్ష్యం ఇస్తే, బుకాయించెయ్యగలనన్న ధైర్యంవుంది. నిజంగా వెంకన్న గుర్తించేడా? ఎప్పుడు పలకరించనైనా లేదే! ఈ అనుమానంలో గుమ్మం తలుపుకు తలకొట్టుకున్నాడు. ఖంగారుగా పడకగదికి వచ్చి, బ్రాందీ సీసా నోటికి ఎత్తేడు.

రాత్రంతా రాజా ఎల్లా చనిపోయాడు? తనే రాజాని కిటికీలోనుండి క్రిందికి తోసేనని అనుమానపడుతారా. ఆలోచనలు... వేగుచుక్క పొడిచేవరకు ఆలోచనలు.

* * *

రెండురాత్రులు గడిచాయి. అవి కాళరాత్రులే అయ్యాయి నాయనికి. మానసిక ఆందోళనలో ప్రతీ చిన్నవిషయం భయపెట్టింది. ఆ వలుబది ఎనిమిది గంటల్లో ముదుసలి చిహ్నలు అతన్ని ఆవరించాయి.

సుబ్బన్నని ప్రశ్నలు వెయ్యాలనుకొన్నాడు. ఏం జరిగింది? ఏమనుకొంటున్నారు? అని. సుబ్బన్న దగ్గరకి వచ్చేటప్పుడు చూచే చూపుల పదునుకు ఆగలేక పోతున్నాడు. హృదయంలోపలికి గుచ్చేటట్టు చూస్తాడు, సుబ్బన్న.

ఆ రెండోరోజు సాయంత్రమే, పక్కలు వేస్తూన్న సుబ్బన్నను, శ్రద్ధ లేనట్టుగా, యధాలాపంగా—

"రాజాగారి విషయం ఏమైంది? ఏమైనా విన్నావా?"

"వెంకన్న చెప్పేడండి" తెల్లబోయాడు నాయని. సుబ్బన్న తలవైపు చూడకుండా వుండాలని ప్రక్కకు తిరిగాడు.

"ఆ రాత్రివేళ మిమ్మల్ని కందిచేలదగ్గర చూచేనన్నాడండి."

"నన్నా! పొరపడ్డాడేమో! ఆ సాయంత్రం ఇల్లు వదలందే. నాలానే ఉండే ఇంకెవరినైనా చూచేడేమో!" ఆగేడు. తనలో వుండే ఖంగారు తనకి తలవంపు చేస్తోంది. ఎంత ఆదరాబాదరా పడుతున్నాడో తట్టింది.

"అనవసరమైన గాలి వార్తను పుట్టించవద్దని వెంకన్నతో చెప్పు. లేకపోతే నేనే వెంకన్నని..."

"అందరితోటీ చెప్పేసేడండి."

ఉద్వేగంను ఉక్కకోలేక బాధపడ్డాడు. జీవితంలో మొట్టమొదటిసారి యుద్ధంలోకి వెళ్ళవలసిన సమయం జ్ఞాపకం వచ్చింది. ఆ రోజు ఆరాటం చిమ్మింది ఇప్పుడూ.

"నూక్కలు చుట్టూరా వున్నవాళ్లు ఎరుగుదురు. హెడ్‌కానిస్టేబులు గురవయ్యకు తెలుసు. పైగా సర్కిలు, *D. S. P.* ఇవ్వాళ కారులో వస్తారుటండి."

"రాజా ఎల్లా చచ్చేడో వీళ్ళకు అనుమానం లేదా?"

"నేను వినలేదండి."

"అయితే జానీగురించి రాజాకి మనకి ఉండే దెబ్బలాట వీళ్ళకి తెలుసా?"

"నన్ను ఎవ్వరూ ఏమీ అడగలేదండి ఇంతవరకూ."

"అయితే నువ్వు అడిగినా చెప్పకేం. వింటే నన్ను కూడా అందులో కలుపుతారు" యధాలాపంగా అనాలంటే రాలేదు. తెల్లబోయేడు సుబ్బన్న. "ఇంతవరకు అబద్ధం చెప్పలేదండి. దేవుడు శిక్షిస్తాడండి. అడిగితే చెప్పకుండా ఎలా వుండగలను?"

కుర్చీలోనుండి లేచి, నాయని చిరాకుగా అటూ, ఇటూ పచారు చేశాడు. సుబ్బన్న తత్వం భీకరంగా ఉచ్చులు వేస్తూన్నట్టుంది.

"అయితే నేను రాజాని ఖూనీచేసినట్టు నువ్వు నమ్ముతున్నావా?" అచేతనంగా ఉండి, నెమ్మదిగా "మీరు ఏం చెప్పలేదే" అన్నాడు సుబ్బన్న.

"నేను చెయ్యలేదు. విన్నావా సుబ్బన్నా, నాకు తెలియదు. నేను నిజంగా చంపాలనుకొని అక్కడకు వెళ్లే; ఉత్తరం చూచిన తర్వాత. కాని చచ్చే అతను అక్కడ వున్నాడు కిటికీ క్రిందుగా."

"సుబ్బన్నా! నన్ను నమ్ముతావా?"

హృదయం తేలికపడినట్టయింది సుబ్బన్నకు. 'మీరు నాతో ఎప్పుడు అబద్ధం ఆడలేదు. నేను నమ్ముతా. మొట్టమొదట అనుకున్నా..."

తలూపేడు నాయని.

"చంపడం అన్నది ఎంత క్రూరంగా శిక్షిస్తుందో చూచేరా? మీ దుర్మార్గానికి శిక్ష అనుభవించేరుగా."

"శిక్షా!"

"మీ మనస్సు మిమ్మల్ని కాల్చేయలేదూ? అదే!"

"సుబ్బన్నా! ఎవరైనా ప్రశ్నిస్తే చెప్పకు...జానీసంగతీ, నేను వెళ్ళడం అదీని. ఇంతకంటె చిన్నచిన్న విషయాలకే ప్రభుత్వం మనుష్యుల్ని ఉరితీసింది. అయినా నేను ఖూనీ చేయలేదు."

సుబ్బన్న వెళ్ళడం నాయనికి కొంత తేలిక నిచ్చింది. అతను చెప్పిన శిక్ష సమంజసంగానే వుంది. తను ఓ విధంగా దోషి! మానసికంగా రాజాని ఖూనీ చేసేడు. అయినా అది క్రియలో లోపించింది. దీనికి ప్రభుత్వం తన్ను శిక్షిస్తుందా?

★ "బుద్బుదం" ★

వాళ్లు తను రాజా గదిలోకి వెళ్లేనని గుర్తిస్తారా? తనకి ఉరిశిక్ష విధిస్తారా? సుబ్బన్న చెప్పకుండా వుంటాడా? సందేహాలు పిచ్చివానిగా చేసేయి. ఆరాత్రి నిద్ర రానే రాలేదు. ఊహల్లో జరిగిన కాలంలో విన్న, శిక్షింపబడిన ఖూనీలు, వాటి పరిణామాలు జ్ఞాపకానికి వచ్చేయి.

తెల్లవారుజామునే కన్ను మూగన్ను అయ్యింది. ఉలిక్కిపడి క్రింద చప్పుడు విని లేచాడు. తనకి నల్లగుడ్డలు కట్టినట్టు, ఉరిత్రాడు తగిలించినట్టు కలలుగన్నాడు.

మేడమెట్లు ఎక్కుతున్నాడు. సుబ్బన్న తలుపు దగ్గరగావచ్చి, "బాబుగారూ! డి. యస్. పి. సుదర్శన్ వచ్చేరండి." అన్నాడు. జరగవలసిందే జరిగిందన్న మాట. లేచేడు ఉలిక్కిపడి. "సావిట్లో కూర్చోబెట్టు" హృదయ స్పందనం ఎక్కువై మాట తడబడింది. తను ఎంత క్రూరంగా ఇరుక్కున్నాడో!

చొక్కా తొడుక్కుని, మెట్లు దిగుతూ క్రిందికి చూచేడు. కాంపౌండులో పోలీసులు నించుని మాట్లాడుతున్నారు. శరీరం వణికింది. ఓసారి గదిఅంతా ఆఖరిసారి అన్నట్టు చూచుకొని దిగాడు.

నమస్కారాలు అయింతర్వాత, ఎఱ్ఱగా డ్రెస్సులో వున్న అధికారి సుదర్శన్ "నేను, మీ పొరుగు రాజాగారి మృతిసందర్భంలో వచ్చేను" అని ఉపక్రమించేడు.

తలూపేడు నాయని.

"మీరిద్దరు స్నేహితు లనుకుంటాను."

"అంత ఎక్కువగా కాదు. ఆయన తెలుసును."

"ఆఖరుసారిగా ఆయన్ని మీరు ఎప్పుడు చూసేరు."

"ఆయన్నా......ఓపక్షం దినాలక్రితం అనుకుంటా."

"అయితే మీ ఇద్దరి మధ్య ఎక్కువ జోస్తీ లేదా?"

నాయనికి అబద్ధాల్లో పెదిమ ఒణికింది. దాన్ని నొక్కిపెట్టినా కదులుతున్నట్టే వుంది. "ఆయనకు నేను ఎప్పుడూ స్నేహితుణ్ణి కాదండి. ఎప్పుడూ ఆయనతో స్నేహం కల్పుకోవాలని ఉండేది కాదు. ఒక్కటి—ఆయన నాకు పడోసీ. అంతే!"

సుదర్శన్ నవ్వేడు. నాయనికి గుండెలు జేజారయ్యేయి.

"అయితే ఆ చనిపోయిన రోజున రాజావారు మీకు ఉత్తరం వ్రాసేడు నిజమేనా"

ఉలిక్కిపడ్డాడు నాయని. ఎవరో వుత్తరం తీసుకువచ్చినవారు చెప్పేవుంటారనుకొన్నాడు.

"ఔను. అది, అదైనా చిన్న వుత్తరం. నిజం చెప్పాలంటే చాలా చిన్న వుత్తరం"

సుదర్శన్ తలూపుతూ "దాన్ని మీరు చింపేసేరా?"

"ఔను" ఈ ప్రశ్న వెయ్యడానికి ఎక్కడ చిల్లు పెడుతున్నాడో అర్థం కాలేదు నాయనికి. ఆశ్చర్యం కల్గింది.

"రాజావారు మీ కుక్కని చంపినట్టున్నారు. దానికి మీరు చాలా ద్వేషించినారు కాబోలు."

కళ్ళప్పగించే "ఊ" అన్నాడు. లోపలోపల సుబ్బన్న రహస్యం వెల్లడి చేయకుండా వున్నాడా? దేవుడు తనకు ఆ విషయంలో సహాయం చెయ్యాలని ప్రార్థించాడు.

జేబులోనుండి కాగితం ఒకటి తీస్తూ "చూచారా నాయనింగారూ! ఆవుత్తరానికి నకలు ఇది. అద్దుకాగితంమీద వుంది." చూపించేడు.

అది చూచి నాయని ఏదైనా చెప్పాలనుకొన్నాడు. ముఖంలో రక్తం తెల్లబడిపోయి మాట్లాడలేక భయంలో చిన్నశబ్దం మాత్రం చేసేడు. సుదర్శన్ నవ్వేడు. ఇది "ఇంకా ఈతనికి ఎంత తెలుసు" అన్న ఆందోళన కల్గించి నాయనిని అచేతనుణ్ణి చేసింది.

"నాయనింగారూ! మీరు ఒక్క ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ఒక్కటే నన్ను అర్థంకాని ఆశ్చర్యంలో ముంచుతోంది. దానికి మీరు చెప్పగలరనుకొంటున్నాను. అయితే మీరు ఆరాత్రి రాజావారి గదిలో ఏం చేసేరో చెప్తారా?" సుదర్శన్ కళ్లు నాయనికళ్ళని గ్రుచ్చినట్లు చూచేయి:

"అది పచ్చి అబద్ధం, క్రూరమైన అనుమానం, నేనెప్పుడూ రాజావారి ఇంటి-" నాయని నిలదొక్కుకోలేకపోయాడు.

"అయితే నాయనింగారూ! మీరు మర్చిపోయారేమో! ఆ సాయంత్రం మీ తుపాకీతో కాలువగట్టువరకు వెళ్లేరు. అది ఆయన వ్రాసినవుత్తరమే సాక్ష్యము చెప్తోంది. పైగా మీసుబ్బన్న రాజావారికి అపాయంగురించి చెప్పడానికి అక్కడకు వచ్చేడని వాళ్ళ నౌకరు చెప్పేడు."

నాయనిచేతులు అచేతనంగా పీకమీదికి వెళ్ళేయి. పచ్చి వెలక్కాయ గొంతున పడ్డట్టు అయ్యింది. ఊపిరితీసుకోటానికి భయం, ఒళ్లంతా చెమటలు పోసేయి.

"ఆ సాయంత్రం రాజావారి వుత్తరం మీకు వచ్చింది. తరువాత మీరు మీ ఇల్లు వదిలారు. పొలాలకు అడ్డుపడి, రాజావారి

(56-వ పేజీ చూడండి)

అదీ ఆవిడగారి ఆజ్ఞే!

అనంగనంగా ఒక ఊరిలో ఒక రాజున్నాడు. ఆరాజుకి ఒకనాడు "భార్యలమాట ప్రకారం భర్తలు నడుచుకొంటున్నారా; లేక భర్తల మాట ప్రకారం భార్యలు నడుచుకొంటున్నారా?" అనే గొప్ప సందేహం కలిగింది. వెంటనే మంత్రిని పిలిచి ఆమాట అడిగాడు. మంత్రి చేతులు జోడించి, "ప్రభూ! ఈ ప్రపంచంలో మగవాడై పుట్టినవాడు ప్రతివాడూ, భార్య చెప్పినట్లు నడుచుకో వలసిందే! వేరే గత్యంతరం లేదు." అన్నాడు.

రాజుగారికి కోపం వచ్చింది. "ఆడవాళ్ల మాటలువినే మగవాడు వాడేంతటి మగవాడు! ఛీఛీ!!...ఈవిషయం పరీక్ష చేయాలి" అన్నాడు "చిత్తం" అన్నాడు మంత్రి.

రాజుగారొకనాడు తన రాజ్యంలోనున్న పెండ్లిఅయిన మగవారినందరినీ పిలిపించి వరుసగా నిలబెట్టి "మీలో మీ భార్యలమాట ప్రకారం నడుచుకొనే వారంతా నాకుడిచేతి వైపుకువచ్చి నిలబడండి. లేనివారంతా నాయెడమచేతి వైపుకు వచ్చి నిలబడండి. మీరందరూ యేటో ఒకవైపు వచ్చి నిలబడాలి. ఎటూ కాకుండా నిలబడితే మాత్రం ఉరిశిక్ష తప్పదన్నాను."

అందరూ గొర్రెల మందల్లా, రాజుగారి కుడిచేతి వైపు నిలబడ్డారు. ఒక్కడు మాత్రం యెడమచేతి వైపు నిలబడ్డాడు. అతనిని చూచేసరికి రాజుగారికి అంతులేని ఆనందం కలిగింది— 'నారాజ్యంలో స్వంతబుద్ధిని ఉపయోగించే వాడొక్కడైనా వున్నాడుగదా' అని!

వెంటనే అతనినిపిలిచి, "ఏమోయ్! అంతా నాకుడిచేతి వైపున నిలబడితే, నీ వొక్కడివీ యెడమచేతి వైపున నిలబడ్డావేం? నీ భార్యమాటలు బొత్తిగా వినవా?" అని అడిగాడు.

"ఎందుకు విననుస్వామీ! ఇక్కడకు వచ్చేటప్పుడు నాభార్యే, గుంపుతో కలవక యెడంగా వుండమని చెప్పిందండీ! అది చెప్పినట్లు చెయ్యకపోతే మరి కూడెట్టదండీ!" అన్నాడు, ఆ దురదృష్టవంతుడు!

శ్రీమతి కా - లోపాముద్రమ్మ.

తారుమారయింది

"ఓహో...లక్ష్మీ?..."

....

ఆరునెలల చంటిపాపని చంకను అదిమి పట్టుకుని, మూడేళ్ళ అమ్మాయిని ముందు యెక్కించి—

వెనక చీరచెంగు పట్టుకుని, బండి యెక్కకుండా, వచ్చేపోయే జనాన్ని వింతగా చూస్తోన్న ఆరేళ్లవాణ్ణి- "త్వరగా ఎక్కరా!" అని గద్దిస్తూ—

రైల్వే కూలి ట్రంకుపెట్టె, తాటాకు బుట్టా లోపల పెట్టేడో లేదో చూసుకుంటూ,—

బండి ఎక్కడ కదిలిపోతుందోనని ఒకవేపు భయపడుతూ - అతిగాబరాపడిపోతున్న లక్ష్మికి - ఆ పిలుపు వినిపించనే వినిపించలేదు!

ఆ పిలిచిన ఆవిడే గబగబ వచ్చింది తలుపు దగ్గిరికి. ఒక చేత్తో పాపనితీసుకొని, మరో చేత్తో పిల్లాడ్ని లోపలకు లాక్కొని, లక్ష్మికి సాయంచేసింది ఎక్కడంలో.

"అబ్బ!...మాయదారి ప్రయాణాలని!" చేయూతనిచ్చిన ఆవిడెవరో చూడకుండానే, తన ప్రయాణాన్ని తనే తిట్టుకుంటూ విసుగ్గా వెళ్లి కూర్చుంది పక్క బెంచీమీద!

"ఏం...లక్ష్మీ?..." మరింత ఆత్రతగా పలకరించిందావిడ, ఎదటిబల్లమీద కూర్చుంటూ.

"ఎవరూ?.. "అన్నట్టుగా నిర్ఘాంతంగా చూస్తూ వుండిపోయిందీవిడ!

"డబ్బులండీ, అమ్మగారూ!" - రైల్వే కూలీ బయటనుంచి అదేసమయాన అడిగేసరికి, అది జ్ఞాపకంవొచ్చి, అటు తిరిగి, డబ్బులందించింది.

మళ్ళీ ఇటుతిరిగి, తన పాపను తీసుకుందామని ఆమె వేపు చూసింది.

ఆమె మటుకు ఇంకా తనవేపే చూస్తోంది. చటుక్కున జ్ఞాపకంవొచ్చి, మళ్ళీ ఆలోచనలో పడింది, "ఎవరు చెప్మా!" - అనుకుంటూ

"జ్ఞాపకం లేదూ?...కనుక్కో... చూద్దాం!" - చిరునవ్వుగా ప్రశ్నించిందామె.

మళ్ళీ ఒక్కక్షణం ఎగాదిగా చూసింది లక్ష్మి. వెంటనే అనేసింది: "ఓ...నువ్వా కాంతం?...అబ్బ! ఎంతకాలానికి కనిపించావ్!..." ఇక వెంటనే ఆమె బుజాలమీద చేతులేసింది, ఏదో సంతోషాన్ని ఆపుకోలేక!

"ఎంతసేపటికీ గుర్తుపట్టలేకపోగాను సుమా!" - యింకా అంది ఆ సంతోషంతోనే!

"నువ్వే నయం, వెంటనే గుర్తుపట్టావు, పైగా - మంచి సాయం చేశావు!...ఆఁ... ఏమిటీ సంగతులు? ఎక్కడికీ ప్రయాణం? ...పూర్తిగా మారిపోయావు సుమా!"— యింకా ప్రశ్నలమీద ప్రశ్నలు కురిపించేసింది లక్ష్మి.

ఈమె ఆనందంకొద్దీ అడిగేస్తూనే వుంది; ఆమె ఆనందంకొద్దీ అలాగే చూస్తోనే వుండిపోయింది, కొంతసేపటిదాకా!

ఇక ఇద్దరూ ప్రసంగాలు ప్రారంభించారు. ఒకరు అడిగే ప్రశ్నకు రెండోవారిచ్చే జవాబు పూర్తి అయీఅవడంతోనే, మరొక ప్రశ్న వచ్చిపడేది. కాగా, ఒకొక్కప్పుడు - ఇద్దరి నోళ్ళనుంచీ ఒకేసారి ప్రశ్నలు రావడంగూడా జరిగింది!

ఇద్దరూ అంత ఆరాటపడిపోయారు, అందిన ఆ ఆకస్మికానందానికి; అనుకోని ఆ కలయికకు!

కాంతమ్మ వొళ్లో పాపని ముద్దాడుతూ, "ఎన్నో నెలా పాపకి?" అని అడిగింది.

"మొన్న పున్నానికి ఆరోనెల వచ్చింది."

"ఈ ముగ్గురా సంతానం?..."

"అవును, ఈ ముగ్గురే!...నీకు?..."

"నాకా?...అయ్యో!..." - అంతవరకూ అనడంతోనే ఏదో అవమానం గలిగి, అదో బాధతో, తలవొంచుకుంది; వొళ్ళో వున్న పసిపాప ముంగురుల్ని సవరిస్తూ.

"నువ్వ అదృష్టవంతురాలివి, లక్ష్మీ!"- ఆఖరికి అనలేక అనలేక అంది, అదో గాద్గదికంగా!

"ఏమిటో, అలా అంటారుగానీ, పిల్లలుండడం అదృష్టంగాదు కాంతం! అంతకన్నా దురదృష్టం మరేదీ లేదనుకో!" అంది లక్ష్మి.

తనకు బిడ్డలులేరనే దుఃఖం కలగకుండా వుండేటందుకు గాబోలు లక్ష్మి అలా అంటూన్నదనుకుని మరింత దుఃఖపడింది—కాంతం!

"అబ్బ!...పిల్లలతో వల్లమాలిన యాతన పడుతున్నాను. చూశావా, యిప్పుడా? అమ్మకు వచ్చేప్రాణంగా పోయేప్రాణంగా వుందని టెలిగ్రాం వచ్చింది. ఆయనగారు తాసీల్దారుగారితో కలిసి క్యాంపు వెళ్లారు. ఏం...చేయనిక? అందర్నీ వెంటబెట్టుకుని పరుగెడుతున్నాను, ఆడదాన్నొక్కర్తినీ!" అంటూ ఏదో యాతనగా అనేసి, కిటికీలోనుంచి వొంగిచూస్తోన్న పెద్దాణ్ణి "ఒరేయ్, పడ్తావ్...వెధవా!..." అంటూ చేయి పట్టుకుని సరిగ్గా కూర్చోబెట్టింది.

అంతచెప్పినా, కాంతమ్మకిమటుకు పిల్లలంటే అయిష్టం కలగలేదు! మళ్ళీ ఒక్కసారి, లక్ష్మినీ, లక్ష్మిపిల్లల్నీ చూసి, రైలు బ్రిడ్జీమీదనుంచి పోతూన్నప్పుడయ్యే దడదడ ధ్వని తనలోనే అయినట్టు, చివ్వన బెదిరింది; బాధపడింది!

"ఏ...లా...గై...నా" అంటూ అదే బాధతో నసిగి, కొంతసేపు మౌనంగా పసిపాప వేపు చూసి, అంతలోనే ఏదో చటుక్కున స్ఫురణకు వచ్చినట్టుకాగా,నవ్వుగా ముఖమెత్తి,- "అవును గానీ, లక్ష్మీ!... చిన్నప్పుడు నువ్వూ నేనూ యీ పిల్లలవిషయంలోనే..."పూర్తిగా అనకుండానే ఫకున్న నవ్వేసింది కాంతం!

ఆమెవేపు ఆశ్చర్యంగా చూస్తూ, ఆఖరిమాటతో అంతా అవగతం చేసుకున్నదై-

"ఆఁ......అవునవును, జ్ఞాపకం వొచ్చింది!"— అంటూ తనూ ఫకాలున నవ్వింది లక్ష్మి!

అదేదో ఇద్దరికీ స్ఫురణకు వచ్చివుండడంచేత, అందుకువచ్చిన ఆనందాన్ని ఆపుకోలేక, ఉక్కిరిబిక్కిరిగా నవ్వుతూ అవస్థపడసాగారు.

* * *

కాంతం, లక్ష్మి - ఇద్దరూ చిన్ననాటి చెలికత్తెలు. ఆ పల్లెటూళ్ళో ఇద్దరూ వేరువేరు వీధుల్లో వుండినా, ప్రొద్దస్తమానం ఒకేచోట మసలుతూ, ఒకే క్లాసులో చదువుతూ, - మిక్కిలి స్నేహంతో చక్కగా కాలం వెళ్లబుచ్చవారు.

ఇద్దరూ బళ్ళో పంతులమ్మదగ్గిర నాలుగువాచకాలవరకూ చదువుకున్నారు. పదిపన్నెండు పాటలవరకూ - మంగళహారతిపాట మొదలుకొని అక్కా - బావా,

అన్నా-వొదినా పాటలు అన్నీ తుణ్ణంగా నేర్చుకున్నారు. చుప్పనాతి బుద్ధికొద్దీ, తోడివాళ్ళు యెన్ని గిల్లికజ్జాలు పెట్టాలను కున్నా, యిద్దరూ విడిపోయేవారు గాదు! ఒకేస్థాయిలో పాడుకుంటూ వుండేవారు; ఒకే బాటలో నడుస్తూపోయేవారు! ఇద్దర్లో ఒకరు ఫలానాపని మంచిదనుకుంటే, రెండో అమ్మాయిగూడా అదే మంచిపని అనేది!...అలాగ ఒకే మాటమీద ఇద్దరూ వుండేవారు!

అలాంటిది,...ఓసారి చిన్న తమాషా జరిగింది. ఎనిమిదీ తొమ్మిదీయేళ్ళ వయస్సు లున్నప్పుడే గాబోలు, ఒకనాడు - లక్ష్మి తాత బస్తీకి వెళ్ళివచ్చేటప్పుడు, లక్ష్మికోసమని ఒకరబ్బరుబొమ్మా,ఒక కుమారీశతకమూ-కొనుక్కొనివచ్చాడు. మురిసిపోతూ మనుమరాలికి యిచ్చాడు!.

"మరి,...మన కాంతానికేమి తెచ్చావ్, తాతా?" అని అడిగింది లక్ష్మి.

గతుక్కుమన్నాడు తాత. కాంతం పరాయిపిల్ల అయినా, లక్ష్మిలాంటిదే! ఆ ఇద్దరూ "తాతా, తాతా!" అంటూ వచ్చి, ఒకే విధమైన చనువుతో పేదరాసి పెద్దమ్మ కత లెన్నో చెప్పించుకుంటూంటారు. తను గూడా ఎంతో ఆప్యాయంగా కమ్మని కతలు చెప్తూ, వాళ్ళ ముద్దు ముద్దు ప్రశ్నలకు మురిసిపోతూ - సమాధానాలు యిస్తూంటాడు; అయినా, లౌక్యంలో పట్టభద్రుడైన ముసలితాతకు - బస్తీకెళ్ళినప్పుడు కాంతం సంగతే అక్కర్లేకపోయింది!

ఆ వాక్యాన్నే మళ్ళీ వుపయోగిస్తూ, "దానికెందుకులే, నువ్వు దాచుకో!" అన్నాడు తాత!

"అయితే, నాకక్కర్లేదు!" అంటూ అక్కడే పడేసి వెళ్ళిపోయింది లక్ష్మి.

కాని, ఆ బింకంతో చాలదూరం వెళ్లలేకపోయింది; చాలసేపు విడిచి వుండలేకపోయింది! బొమ్మ అంత ముద్దొస్తోంది! పుస్తకం అట్ట అంత ముచ్చటేస్తోంది!

"పోనీలే, చెరొకటి తీసుకుంటాం!" అనే నిర్ణయానికి వచ్చినట్టుగా చూస్తే, మళ్ళీవెనక్కి వచ్చి, రెంటినీ చేతబట్టుకుని గబగబా పరుగెత్తింది - కాంతం దగ్గరకి.

మధ్యలో గబుక్కున ఆగింది, చిన్న ప్రశ్న పుట్టి—"కాంతానికి ఏది యిద్దాం?" అని.

"దానికేది నచ్చితే అది!" అని జవాబు గూడా వెంటనే పుట్టడంచేత, ఆ వెంటనే పరుగుసాగించింది గబగబా!

రెంటినీ కాంతం దగ్గిర వుంచి,"ఇవిగో.. మన తాత కొనుక్కొచ్చాడు. నీకు నచ్చింది తీసుకో!..."అంది.

కాంతం ఆనందానికి హద్దులేదు. రివ్వున



"ఓ...నువ్వా కాంతం"...అబ్బ ఎంత కాలానికి కనిపించావ్!"

ఆకర్షించుకున్న ఆ ఆడ రబ్బరుబొమ్మమీదికి చెయ్యి పోనిచ్చింది. కాని, ఎవరో లాగినట్టయి, ఏదో ఆలోచన తట్టగా, చటుక్కున ఆ చేయిని వెనక్కి లాక్కుని, ఒక్క క్షణం ఆలోచించి, ఆ చేతినే దాని మీదికీ దీనిమీదికీ తమాషాగా పోనిస్తూ, లాక్కుంటూ - ఆఖరికి, "నాకు పుస్తకమే కావాలి!" అంటూ తీసుకుంది. నిజంగా, తెలివైన పిల్లకాంతం!

"అయితే, నీకు యీ అమ్మాయి బొమ్మ అక్కర్లేదన్నమాట!" నిరాశగా అడిగింది లక్ష్మి. నిజంగా నిరుత్సాహమే పొందింది లక్ష్మి. ఏమంటే, తన చెలికత్తె రెండింటిలోనూ మంచిదైన అందమైన అమ్మాయి బొమ్మనే తీసుకొని, తనకు మరింత సంబరం కలిగిస్తుం దనుకుంది; తనే పంచిఇవ్వకుండా

★ తారుమారయింది ★

యిలా వేసిన తన ప్లాను నెగ్గుతుందనుకుంది లక్ష్మి!

తనకంత ప్రేమగా చూపించి, అందులో ఒకటి వూరికే తీసుకోమన్నప్పుడు - చెలికత్తెమీద మరీ సంతోషం గలిగి, అందమైన ఆ అమ్మాయి బొమ్మనే ఆ చెలికత్తెకు వుంచివేద్దామని, - యీ ఎత్తు వేసింది కాంతం!

"నాకీ పుస్తకమే బాగుంది. చక్కగా చదువుకోవచ్చును." - పైగా కాంతం తను చేసిన పనిని చక్కగా సమర్థించుకుంది. కాని, లక్ష్మికి అర్థమయింది.

"ఈ రబ్బరుఅమ్మాయి అందంగా లేదూ?...తీసుకో. .కాంతం, ఏం ఫర్వాలేదులే,...నా యిష్టంగా నేను యిస్తున్నాను?" ప్రాధేయపడింది.

"నాకు వొద్దు...బాబూ; ... అమ్మాయిలూ, అబ్బాయిలూ అంటే నాకు పరమ అసహ్యం! ఏడుస్తారు, ఏరుగుతారు! అల్లరి చేస్తారు; అవస్థలు పెట్టుతారు! నాకు వొద్దే వొద్దు!...యాక్!..." అంది కాంతం!

"అయ్యొ, పిల్లలంటేనే యిష్టంలేదా? ఎంచక్కా లాలుబోసి, పాలిచ్చి, వుయ్యాల్లో పడుకోబెట్టి, జోలపాటలు పాడొచ్చు; ఎంచక్కా ఆడుకోవచ్చు!" అంది లక్ష్మి.

అలాగే పాపాయిల విషయంలో ఆ చెలికత్తెలిద్దరూ - నవ్వుగా వాదులాడుకున్నారు; అలాగే ఆ వాదాల బలాల్ని నిలబెట్టుకున్నారు. ఎంతోకాలం!

* * *

అలాంటి చిన్నప్పటి వాదం యీనాడు తలవని తలంపుగా యిద్దరూ కలుసుకున్నప్పుడు స్ఫురణకు వచ్చింది. అందులోనూ, ఆ ఇద్దరూ తారుమారు దశల్లో వుండగా!...అందుకే, ఇద్దరూ ఫకాలున నవ్వుకున్నారు!

ఇంకా, ఆ మధుర స్ఫురణతోనే వారిద్దరూ ప్రసంగిస్తూవుండగా, ఏదో స్టేషను వచ్చేసింది; బండి ఆగింది. కాంతం భర్త మగవాళ్ళ పెట్టెలోనించి దిగివచ్చి, "ఇక్కడ రైలు మారాలి, తొందరగా దిగు!" అన్నాడు. కాంతం మూటా పెట్టె భర్తకు అందించి, "ఇక వెళ్ళొస్తా... లక్ష్మి!" అంటూ దిగలేక దిగింది. లక్ష్మినీ లక్ష్మి పిల్లల్ని భర్తకు పరిచయంచేసి మరింత మురిసిపోయింది; మరింత దిగాలుపడింది!

★

సీరియల్ నవల

దత్తత

శ్రీ పినిశెట్టి

శ్రీ రామమూర్తి

4

వెంకమ్మ హోటలు ఎంత హఠాత్తుగా తెరవబడిందో, మూడు మాసాలు తిరక్కుండే అంత హఠాత్తుగానూ మూసివేయబడింది. వెంకమ్మకు మాత్రం యీ పని చాలా కష్టంగానే తోచింది. కాని తన అవసానకాలంలో వచ్చిన ఒక మంచి హృదయాన్ని మాటల ద్వారా బాధపెట్టదలచలేదు. ఒకవేళ ఏదన్నా మాటన్నా శాంతమ్మ తిరిగి తన బిడ్డలతో ఎక్కడకన్నా వెళ్ళిపోతుందేమోననే అదురుకూడా ఉంది. నా అని ఆదుకునేవాళ్ళు లేని ఈ కష్టసమయంలో తన రోగపు శరీరాన్ని జాగ్రత్తగా చూడగలది ఒక్క శాంతమ్మే అని వెంకమ్మ నమ్మకం.

ఈ కొద్దిరోజుల్లో రాముకి ఆ వీధి చాలా చిరపరిచితమైంది. తప్పటడుగులు వేసుకుంటూ వీధి అంతా పచారుచేయడం, ఆకలైనప్పుడు తిరిగి యింటికి రావడం జరుగుతూంది.

ఆ వీధిలో బళ్ళు ఎక్కువగా తిరక్కపోవడంవల్ల రాము కార్యక్రమానికి ఏమీ అడ్డు లేకుండా జరిగిపోతూంది. ఆ వీధిలోనే వెంకమ్మ యింటెదురుగా ఉన్న బహుదూర్ వారి మేడంటే రాముకి చాలా అభిమానం. అందుకే తరచు తప్పటడుగులు వేసుకుంటూ గేటుదాటి కాంపౌండులోకి వెళ్ళి ఆ పూలమొక్కల్లో తచ్చాడుతూ వుంటాడు.

ఒకరోజు అక్కడి పనివాడు రాముని బెదరించబోతే మేడపైనించి ఆ కుర్రవాణ్ణి చూస్తున్న బహుదూర్, ఆ పనివాణ్ణి మందలించి "ఆ కుర్రాడు ఎప్పుడొచ్చినా ఆటంకపర్చబోకు" అని ఆర్డరు కూడా చేశాడు. అది గమనించిన రాముకి పరిపూర్తి విశేషం గ్రాహ్యం కాకపోయినా, పనివాడు తన్ను బెదరించి తిట్లు తిన్నాడని మాత్రం తెలుసుకున్నాడు.

ఇక ఆరోజు మొదలు మరీ చనువుగా కాంపౌండులోనికి వెళ్ళి ఆరుబైటవేసిన కుర్చీలో దర్జాగా కూడా కూర్చొంటూ వుండేవాడు. పనివాడు ఒకవేళ కోపంగా చూసినా, కుర్చీలోంచి ఎదరకు ఒక్కసారి వంగి వేలుపెట్టి పై అంతస్తుకేసి చూపేవాడు. పనివాడికి కోపమల్లాపోయి నవ్వుకూడా వచ్చేది.

బహుదూరు తన చావిట్లో కూర్చొని జ్యోతిష పండితునితో ముచ్చటిస్తున్న సమయంలో రాము గేటుతీయడం గమనించాడు. వెంటనే పండితునికేసి చూసి "ఆ కుర్రవాణ్ని చూశారా?" పండితుడు అటు చూశాడు.

"బాబూ యిలారా" అని పిలచాడు బహుదూర్. ఈలాంటి అవకాశంకోసం ఆ చిన్నిమనస్సు ఏనాటినుంచి చూస్తూందో సంకోచం ఏమాత్రం లేకుండా దర్జాగా రాము దగ్గర చేరాడు.

"యీ కుర్రాడి చేయి చూడండి."

బహుదూరే ఆ చిన్ని చేతిని తిప్పి చూపించాడు. పండితుడు తీక్షణంగా చూసి "అదృష్టజాతకుడు...లక్షాధికారి బిడ్డ కావాలి" అని చెప్పాడు. వెంటనే బహుదూర్ నవ్వాడు.

పండితుడు ఆశ్చర్యంగా చూసి "ఏం" అని ప్రశ్నించాడు.

"జాతకుడు కావచ్చుగానీ లక్షాధికారి బిడ్డమాత్రం కాదు" అన్నాడు.

"జాతకమే లక్షాధికార్ని చేస్తుందనే ఉద్దేశంకూడా నాకుంది" అని సమయస్ఫూర్తిగా సమర్థించాడు పండితుడు.

గేటులో ఒక కారువచ్చి ఆగింది. పనివాడు గేటు తెరచాడు. కారు లోపలకు వచ్చింది.

బహుదూర్ పైకి లేచి ఆనందాన్ని వ్యక్తంచేస్తూ "దయచేయండి" అని ఆహ్వానించాడు.

గంగాధర్ జమిందారు కారులోనించి దిగి చిరునవ్వుగా ఆహ్వానాన్నందుకొని, బహుదూర్ ప్రక్కగా ఉన్న కుర్చీమీద కూర్చున్నాడు.

"మరచారా!" పండితుడు పలుకరించాడు. గంగాధరం తీక్షణంగా చూసి, హఠాత్తుగా లేచి చేతులు జోడించి "క్షమాభిక్ష" అని నమ్రతగా తలప్రక్కకు పెట్టాడు.

"ఫరవాలేదు. ఆమాత్రం జ్ఞాపకముంటే చాలు" అని సగర్వంగా "నేనులోగడమీకు చెప్పిన విషయాలు ఎంతవరకూ..."

ఇంకా మాట పూర్తిగాకుండానే "అక్షరాలా జరిగాయి" అని సమాధానమిచ్చి, బహుదూరుకేసి చూస్తూ "పండితులవారి ప్రతిభ మీరు విన్నారా?" అని ప్రశ్నించాడు గంగాధరం.

బహుదూర్ నవ్వాడు "నేను ఒక్కడినే మిటి ఈ గుంటూరుజిల్లా అంతా ఎరుగుదురు" అని సమాధానమిచ్చాడు.

కారు హారన్ వినిపించి అంతా అటు చూశారు. రాము ఎప్పుడు మెల్లగా బహుదూరు దగ్గర్నుంచి జారుకున్నాడో, గాని యిప్పుడు కారు మొదటసీటులో కూర్చొని, స్టీరింగుపట్టుకొని అటుయిటూ త్రిప్పుతూ మధ్య మధ్య హారన్ కొడుతున్నాడు.

"నేను చెప్పింది ఆచరణలో చూస్తు

★ దత్తత ★

న్నారుగా, అది కౌరులు ఎక్కితిరిగే జాతకం" అంటూ సంతృప్తిగా నవ్వాడు పండితుడు.

"ఎవరా కుర్రాడు" గంగాధరం కుతూహలంగా అడిగాడు.

"పాటి కులస్తుడే కాని పేదవాడు" అని సమాధాన మిచ్చాడు బహదూర్.

గంగాధరం మెల్లగా లేచి కౌరు దగ్గరకు వెళ్ళి కుర్రవాణ్ని పరిశీలించాడు. రాము దేన్నీ లక్ష్యపెట్టే దృష్టిలో లేడు. అసలు పెద్దవాళ్ళ చేతిలో చెప్పినట్లు వినే కౌరు, తాను ఎందుకు నడిపించలేకపోతున్నానా? అనే పట్టుదలలో మునిగి ఉన్నాడు.

"ఇదిగో!"

గంగాధరం మాట విని ప్రక్కకు చూశాడు. మొదట్లో కొంచెం జంకాడు. కాని గంగాధరం చిరునవ్వు రాము నిర్లక్ష్యానికి తోహద మిచ్చింది. మళ్ళీ తన పనిలో నిమగ్నుడయ్యాడు.

"నీపేరు?"

"లాము."

తిరిగి చూడకుండానే స్టీరింగుతిప్పే ప్రయత్నంలో ఉండి సమాధాన మిచ్చాడు.

ఈ వినోదం చూస్తూ గంగాధరం వెనుక బహదూర్, పండితుడు కూడా నిలబడ్డారు.

"కుర్రవాడికి తెలీదండీ."

ఈ స్త్రీ కంఠధ్వని ఎక్కడనుంచి వచ్చిందో అందరూ అటు చూశారు. స్తంభం వెనుక శాంతమ్మ నిలబడి "రామూ దిగిరా!" కంపితస్వరంతో పిలచింది.

"నేను లాను."

తల్లి పిలుపు అని తెలుసకొని కూడా, రాము ఈ విధంగా సమాధానం యివ్వడంలో, అక్కడున్న ముగ్గురూ బిగ్గరగా నవ్వారు.

ఈ నవ్వుల్లో భావం శాంతమ్మ గుర్తించలేదు. పైగా ఇకొక హేళనగా ఆమె బాధపడింది. కోపంగా కౌరుదగ్గరకు వచ్చింది.

"కౌరు దిగు."

ఈమాటు రాము చూసి, తనివితీరా నవ్వాడు. శాంతమ్మ రెండు చేతులూ కౌరు లోనికి పోనిచ్చి రాముని ఎత్తుకోబోయింది.

"నేను లానూ—" అంటూ ఏడవటం ప్రారంభించాడు. స్టీరింగు మాత్రం వదల్లేదు.

"ఫరవాలేదమ్మా! సరదా తీరనియ్యి, వెనకాల పంపిస్తాం."

ఈ మాటలు గంగాధరమే అన్నాడు. అతనికేసి శాంతమ్మ చూసింది. అతని మొగంలో అవహేళన లేదనీ పిల్లవానిపట్ల ఉండే దయ మాత్రం అందర్నీ అలా నవ్వించిందని వెంటనే గ్రహించింది. అక్కడ నించి వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

శాంతమ్మ యింటికి చేరుకున్న మరి రెండు గంటల్లో చేతిలో నేతి లడ్డూల పొట్లంతో రాము కూడా వచ్చాడు. ఏదో యుద్ధంలో గొప్పవిజయంపొందిన వీరుడులా మొగం పెట్టి "అమ్మా" అని పిలచాడు.

దొడ్డివైపున సాయంత్ర సమయపు పని పాటల్లో ఉన్న శాంతమ్మ పిలుపు విని లోపలకు వచ్చింది.

"ఏం నాన్నా."

"మలి...సారు" చిరుచేతులో పొట్లం చూపించాడు.

ఆ సమయంలో రాము మొగం చూసిన శాంతమ్మ ఒకసారి ఎత్తుకొనీ తనివితీరా ముద్దు పెట్టుకొనేవరకూ ఊరుకోలేకపోయింది.

అప్పుడే లేస్తూ పడిబోతూ గుమ్మం దగ్గరగా అవస్థపడుతున్న రవి, రాము చేతిలో పొట్లం చూసి ఏడ్చాడు. ఎందు కేడుస్తున్నాడో గ్రహించిన శాంతమ్మ నిలబడ్డ రాముదగ్గర కూర్చొని "ఆ పొట్లం ఏది బాబూ" అని అడిగింది.

"నేనివ్వను" మొగం బుంగగా పెట్టి మరీ సమాధానమిచ్చాడు.

ఈ తిరస్కారభావంతో ఆశగా దూరంగా ఏడుస్తూ కూర్చున్న రవి మరీ గుక్కపెట్టి ఏడుస్తూన్నాడు.

శాంతమ్మ రాము చేతిలో పొట్లం ఉండగానే, విప్పి ఒక ఉండ తీయడానికి ప్రయత్నించింది.

రాము యీ దౌర్జన్యాన్ని, సహించలేక చేతిలో పొట్లం విసిరికొట్టి, క్రిందపడి గోల చేయడం ప్రారంభించాడు.

ఆపిల్లలగోలతో యిల్లంతా 'రింగ్' మంటూ మ్రోగింది. గదిలో కూర్చున్న వెంకమ్మ చేతికర్ర ఆధారంతో, చావిట్లోకి వచ్చింది.

విరక్తిగా వుదాసీనభావంతో చూస్తున్న శాంతమ్మను చూసి "ఏమిటమ్మాశాంతా" అని అడిగింది.

"పీడి మొహం" అని విసుగ్గా గిరాటు వేసిన పొట్లాన్ని తీసుకవచ్చి రాము చేతిలో కుక్కి "ఏడు...పోరుకు పచ్చ ఓర్వలేదు...పట్టి తిండిపోతు" అని గడప దగ్గర కూర్చున్న రవిని ఎత్తుకుని "నేను నీకు అప్పచ్చులుకొని పెడతాలే బాబూ" అని సముదాయించింది.

తన పంతం నెగ్గడంతో రాము కిక్కురు మనలేదు. కాని రవి మాత్రం ఏడుపు మొగంతో మధ్య మధ్య వేలుపెట్టి మిఠాయి పొట్లం చూపడం మాననూలేదు.

వెంకమ్మ శాంతమ్మనుండి సమాధానం అందుకోకపోయినా దృశ్యరూపంలోఅంతా చూడ్డంవల్ల "లోకంలో యీ లాంటి అదృష్టం పొందడం మాత్రం మాటలా?... రామలక్ష్మణులు" అంటూ లోలోన సంతోషపూర్వకంగా గొణుక్కుంటూ తన గదిలోనికి వెళ్ళిపోయింది. కాని రాముడు తమ్ముడికి తిండిపెట్టనన్నంత స్వార్థపరుడు కాడని మాత్రం వెంకమ్మ ఆలోచించలేదు.

అప్పుడే భోజనాలు చేసి కూర్చున్న శాంతమ్మ వెంకమ్మలకు, బహుదూరు వారి

దగ్గర్నుంచి తమ్ము రమ్మన్నట్లుగా వచ్చిన కబురు అత్యాశ్చర్యాన్ని కలగచేసింది.

"ఎందుకు బాబూ" వణుకుతోన్న కంఠంతో వచ్చిన నౌకర్ని అడిగింది వెంకమ్మ.

"మీ అదృష్టం పండిందండీ - తొందరగా రండి" అసలు సంగతి వివరించకుండా ఆనందంగా సమాధానం చెప్పాడు.

ఇదేమో చాలా అగమ్యంగావుంది. కాస్సేపు కళ్ళు వప్ప చెప్పి చూసింది వెంకమ్మ.

"నేను కూడా ఎందుకూ?" బిక్కుబిక్కుమంటూ అడిగింది శాంతమ్మ.

"మీరిద్దరూ కూడా రావాలి...అంతా మీకోసంకూర్చున్నారు. ఆలశ్యం చేయొద్దు" అంటూ హడావిడిగా హెచ్చరించాడు.

"అసలు సంగతి ఏమిటో చెబుదూ -" కొస్త విసుగ్గా ధ్వనించింది వెంకమ్మ స్వరం.

"నాతో మిమ్మల్ని తీసుకరమ్మని మాత్రమే చెప్పారు. అదే చెప్పాను మిగతా విషయాలంటే మీకు వారే చెబుతారు" అని నిక్కచ్చిగా సమాధాన మిచ్చాడు నౌకరు.

బహదూర్ మాటంటే, విలువగా తీసుకోని వాళ్ళు ఆ తెనాలిలో లేరు. ఆ విలువ పొందడానికి తగిన అతని ఆ స్తిపాస్తులు - గౌరవపు హోదాలు వెంకమ్మ దృష్టిలో ఒకసారి మెరిశాయి.

"శాంతా లేమ్మా."

"నే నెందుకూ?"

"పెద్దవారు కబురు పెట్టారు. వెళ్ళకపోతే బావుంటుందా - పైగా ఏదో మంచి గురించేగా, సంకోచం ఎందుకూ..." అంటూ కర్ర ఆధారంగా వెంకమ్మే ముందు లేచింది.

పదిమైళ్ళు నడచినంత ప్రయాస పడుతూ రొప్పుతూ రొజుకుంటూ బహదూరు కచేరి చావిడిలోకి, శాంతమ్మతో వచ్చిన వెంకమ్మనుచూసి,

"రండి వెంకమ్మగారూ...ఇద్దరూ అలా కుర్చీమీద కూర్చోండి" అన్నాడు బహదూరు.

ఈ అనాయాసమైన మర్యాదకు వెంకమ్మ మనస్సు సంతోషంతో నిండిపోయింది.

"ఆడముండలం మాకో మర్యాద ఎందుకు బాబూ" అంటూ వెంకమ్మ కర్ర విడిచి గుమ్మం పక్కగా చతికిల పడబోయే ప్రయత్నంలో ఉండగానే హఠాత్తుగా బహదూర్ లేచి "అరెరె! అదేమిటమ్మా! అదుగో ఆ ప్రక్క బెంచీమీదైనా కూర్చోండి" అన్నాడు.

"మర్యాదగల కుటుంబం" అని మెల్లగా కర్ర తీసుకుని లేచేటప్పటికి కొస్త దగ్గు ఆరంభించింది.

అసలే శాంతమ్మకు సిగ్గుతో అక్కడ ఉండటం చచ్చినంతపని అవుతోంది. అందులో వెంకమ్మ దగ్గుకి మరీ సిగ్గుపడి కచ్చేరి ప్రక్కగా ఉన్న తలుపువెనక్కి వెళ్లి నిలబడింది.

వెంకమ్మ దగ్గు తగ్గింది. ఆ స్థూల శరీరాన్ని మెల్లగా బల్లమీదకు చేర్చింది.

"వారు లోపలకు వెళ్ళేరేం?" గంగాధరం శాంతమ్మ వెళ్ళినవేపు చూస్తూ అడిగాడు.

"దాన్ని అక్కడే వుండనివ్వండి బాబూ! అయినింటి పిల్ల. అందులో మగాళ్ల ఎదుటగా నిలబడ్డం అసలే అలవాటు లేదు" అని సమాధానమిచ్చింది వెంకమ్మ.

"ఆమె మీకు మేనగోడలా?"

ఈ ప్రశ్న ఎవరు వేశారో గమనించే స్థితిలో వెంకమ్మ లేదు. రాబోయే దగ్గును బలవంతంగా ఆపుచేసే ప్రయత్నంలో వంచిన తలతో ఔనన్నట్లు సంజ్ఞచేసింది. తలుపు వెనక ఉన్న శాంతమ్మ, "ఏమిటీ సమాధానం యివ్వదు? యివ్వకపోవడమే మంచిదేమో" అనుకుంది.

"భర్త పేరు?"

ఈసారి తలెత్తింది వెంకమ్మ. ఈప్రశ్న అపరిచయ వ్యక్తి వేసింది.

"వైద్యుడు రామయ్యచౌదరి" మెల్లగా చెప్పింది.

"ఆఁ" అంటూ ఒక్కసారి ఆశ్చర్యాన్ని వెళ్ళడిచేసి "అయితే...మా..." యింకో మాట పూర్తిచేయని క్రితమే వెంకమ్మ పురస్కరించుకొని "మీ యింటి పేరు బాబూ" అని అడిగింది.

"సిరిమల్లె గంగాధరజమీందారువారు... పేరు వినలేదూ?" ప్రక్కనున్న పండితుడు గంభీర కంఠధ్వనితో సమాధానమిచ్చారు.

హఠాత్తుగా పరిసరప్రదేశంలో పిడుగు పడే ధ్వనికి పొందే భయాన్ని ఆ ముగ్గురూ ఆమె మొగంలో చూడగలిగారు.

"అయ్యో! అయ్యో! మాయదారిముండను సిగ్గు లేకుండా ఎదురుగా కూర్చున్నానే!" అంటూ కంగారుగా కర్ర తడుముకొని లేవబోయేటప్పటికి గంగాధరమే లేచి "తల్లితో సమానం మీరు; బిడ్డలదగ్గర సిగ్గెందుకమ్మా కూర్చోండి పరవాలేదు" అని వినయంగా సమాధానం చెప్పాడు.

వెంకమ్మ హడావిడినంతా చూడకపోయినా ఆ ధ్వని విన్న శాంతమ్మ గంగాధరమంటే ఎవరో గొప్ప వ్యక్తి కాబోలు ననుకుంది.

"మీరు మాకు దగ్గర బంధువులే బాబూ! కాని మీరు..." వెంకమ్మ కళ్ళు తుడుచుకుంది. ఆ ఏడుపు నకు కారణం గంగాధరం జమిందారయ్యాడనే దురుద్దేశం లేకపోయినా, మా బ్రతుకు లిలాకాలేయి అనే భావం మాత్రం ఉంది.

"ధనం శాశ్వతం కాదమ్మా - కావలసింది పరువు ప్రతిష్ఠను... ఈవేళ లక్షాధికారి రేపు భిక్షాధికారి కావచ్చు" ఈమాటలన్నీ జమిందారు గంగాధరంనోటినించే వెలువడ్డాయి. ఆ రెండుమాటలతో ఆయన నిగర్వి, నిరాడంబరజీవి, స్వార్థరహితుడు అని అంచనా వేయలేదు వెంకమ్మ. కాని ఏదో తనతో అవసరమైనపని వుందని గట్టిగా నమ్మింది.

"మీరు కబురుచేసిన కారణమేమిటో.."

★ దత్తత ★

"మీవల్లనయ్యేదే"

"చెప్పండి! చెయ్యగలపనే అయితే, వెంకమ్మ ఏనాడూ వెనక్కి తిరగదని మీకు తెలుసుగా" తన మీద తనే ఒక సుభాషితాన్ని విసురుకుంది వెంకమ్మ.

"వెంకమ్మా!"

ఈధ్వనిలో ఒక ప్రత్యేకత ఉంది. అటు చూసింది. పండితుడు చెప్పడ మారంభించాడు.

"గంగాధరంగారి విషయం నేను చెప్ప నక్కరలేకుండా నే మీకు తెలిసినా - మీకు తెలీని విషయాలు కొన్ని నాకు తెలుసు" అంటూ ఆ పేము కుర్చీ వెంకమ్మ వైపునకు కొంత లాగి "రెండు గ్రామాలకధికారి, లక్ష్మీపుత్రులు, గుంటూరుజిల్లాలో పేరుమోసిన పెద్దమనిషి... కాని వీరి ఆస్తిపాస్తులకు అధికారికాగల యోగ్యత—ఎవరికుంటుందంటారు?" మెడ ఎదుటకు వంచి వెంకమ్మను ప్రశ్నించాడు.

"ఇంకెవరికీ, పుట్టిన బిడ్డలకే"

లోకానుభవం ఉన్న వెంకమ్మకు ఈ సమాధానం మంచినీళ్ల ప్రాయమైంది. పండితుడు బిగ్గరగా నవ్వాడు. వెంకమ్మ ఆశ్చర్యంగా చూసింది.

"అదే - అదే - కొరత, ఆ యోగ్యత అదృష్టజాతకుడైన మీ రాముడికు వస్తుందంటే; మీరేమంటారు" మళ్ళీ ప్రశ్నార్థకంగా చూశాడు.

వెంకమ్మ ముడితలుపడిన ముఖకవళికలన్నీ భయాశ్చర్యాలతో నిండిపోయినవి. సమాధానం యివ్వలేని ఆనందం ఆమె హృదయాన్ని తాకింది.

కాని తలుపు వెనక ఉన్న శాంతమ్మ మాతృహృదయం ఆ పరిస్థితిలో బిడ్డను పరుల చేతిలో పెట్టడానికి ఎందుకో వెనకాడుతోంది.

"అంతకన్నానా బాబూ! రాము జమిందారు అవుతున్నాడంటే; తల్లికీనాకూ కూడా ఆనందమే" అనే వెంకమ్మమాట వినిపించింది.

కన్నతల్లి తనుండగా - ఈ భరోసా వెంకమ్మ యివ్వడం శాంతమ్మకు కష్టమనిపించింది. కష్టాన్ని యిష్టంగా భరించే అలవాటుపడ్డ శాంతమ్మ యీ సమయంలో కూడా ఏమనాలో అర్థంగాని పరిస్థితిలో పడింది.

"అమ్మాయీ! నీ ఉద్దేశం!"

ఇది శాంతమ్మను వేసిన పండితుని ప్రశ్న. క్షోభపడుతోన్న ఆ వ్యథిత హృదయం నుండి, ఒక్కమాట కూడా సమాధానం రాలేదు.


"దాని మొగం దానికేం తెలుసు... దాని అడ్డేమీ ఉండదు."

ఈమాట కూడా వెంకమ్మే అంది. శాంతమ్మ మొగంలో కోపం ప్రజ్వరిల్లుతోంది. ఒక్కసారి తలుపు ఎదుటకువచ్చి "నా కష్టంలేదండీ" అని చెప్పి కంగారుగా యింటికి దారితీసింది.

ఈ సమాధానంతో అంతా స్థంభించిపోయి, ఆమె నడిచేదారి చూస్తూ అలాగే ఉండిపోయారు.

5

ఏలాగైతేనేం; శాంతమ్మ అభిప్రాయం నెరవేరలేదు. వెంకమ్మ పైపెత్తనం



దూర్ వారింట్లో ఏలాంటి మంత్రాన్ని విసిరారోగాని, కేవలం రాముఅభివృద్ధి కోసం రాముని గంగాధరం చేతులో పెట్టాలనే భావంతో శాంతమ్మ చెవిని యిల్లు కట్టిపోరింది. ఏవో ఊహలు కల్పించింది. నువ్వు జమీందారు తల్లివౌతావంది.

శాంతమ్మకు బిడ్డపై ఎంత మమకారం ఉన్నా, మాటకారైన వెంకమ్మమాటలు శాంతమ్మమనస్సు కొంతవరకూ మార్చకుండా విడిచిపెట్టలేదు. మమకారం ఎంత అడ్డుపడినా, మనస్సు ఎంత క్షోభపడుతున్నా శాంతమ్మ "సరే" అని మాట యిచ్చింది.

శాస్త్రోక్తంగా రాముని జమీందారు దత్తతచేసుకున్నాడు. త్రయోదశీ సోమవారం సూర్యోదయాన పదిగంటలకల్లా గంగాధరంగారి కారు వెంకమ్మ యింటి ముందు ఆగింది.

రాముకి తెల్లటి బట్టలు కట్టి, శాంతమ్మ వెలుపలకు తీసుకవచ్చింది.

రాము కారు చూడ్డంతోనే ఉత్సాహంగా చేతులు చరిచాడు. కిలకిలా నవ్వాడు. రాము ఆనందాన్ని చూసిన శాంతమ్మకళ్ళు చెమ్మగిల్లాయి

గంగాధరం కారులోంచి దిగి చేతులు చాచాడు. రాము ఒకగెంతులో గంగాధరం చేతుల్లో వాలాడు.

కర్ర ఆధారంతో గుమ్మంప్రక్కగా నిలబడ్డ వెంకమ్మ బొంగురుగా నవ్వింది ఓ ప్రక్క కళ్లల్లో నీళ్లు మెదులుతున్నా శాంతమ్మ కూడా నవ్వింది. బిడ్డపట్ల తీరని ప్రేమభావం మళ్ళీ చేతులు చాచేటట్లు చేసింది.

"నేను లాను" అని కారులో కూర్చున్నాడు రాము.

గడపపట్టుక కారుకేసి చూస్తున్న రవి "అన్న" అని నవ్వుతూ పిలచాడు. రాము

(54-వ పేజీ చూడండి)




"భిక్షువర్షీయసి" ఫొటో: శ్రీ వీరవసేవి కుటుంబరావు.

వేళ్ళు ముడిచి కేళ్ళు కదిలి
బతుకంటే కోర్కె సడలి
పక్కనున్న బండరాతి
పగిదిగనే పడిఉన్నది.

"ఆ ఆత్మే పరకాశిస్తే
ఆ పాపం ఎవ్వరి"దని
పైరగాలి ప్రశ్నిస్తూ
వెళిపోయింది. —శ్రీశ్రీ.

ఆశ



రచన:
కొవ్వూరి వేణుగోపాలరావు

కార్నర్ సీట్‌లో వెనక్కి జారగిలబడి కూర్చున్న విశాలరావును అతని కెదురుగా వయ్యారంగా కూచుని అంతకంటే వయ్యారంగా ముఖ భంగిమలు మారుస్తున్న ఆ యిరవయ్యేళ్ళ అందయిన అమ్మాయి యిందాకటినుంచీ ఆకర్షిస్తూనే వుంది.

ఆ అమ్మాయి విశాలరావుకు పూర్తిగా అపరిచిత. రెండుస్టేషన్లకుముందే ఆకంపార్టుమెంటులో ఎక్కింది. ఎక్కినప్పటినుంచీ విశాలరావు దృష్టిని ఆకర్షించింది. స్త్రీఅయి వుండి పురుషులపెట్లో ఎందుకు ఎక్కవల్సివచ్చిందో విశాలరావుకు అర్థంకాని విషయం.

విశాలరావు ప్రక్కన అతనుగాక ఇంకా ముగ్గురు కూచున్నారు. ఆ ముగ్గురిలో ఒకాయన న్యూస్ పేపరు చదవటంలో నిమగ్నుడయిపోయి యీలోకాన్ని పూర్తిగా మరిచిపోయాడనే చెప్పవచ్చు. ఇటు చివర కూర్చున్న ఆయన బహుశా సంగీతకళనారాధిస్తున్న వాడై వుండాలి. తనలో తనే పాడుకుంటూ తన్మయత్వం చెందుతున్నాడు. ఇక మధ్య కూర్చున్న ఆ నల్లద్దాల కళ్ళజోడు ఆయనదే ఎటూ తేలని విషయం.

ఆయనకు కళ్ళజోడువుండటంమూలంగా ఎటు చూస్తున్నాడో వూహించటం కష్టం. ఆలోచిస్తున్నాడో లేదో ఆయనకే తెలియాలి. పోతే ఎదుటిసీట్లో ఆ అందమైన అమ్మాయి ప్రక్కన కొంచం దూరంగానే కూర్చున్న యిద్దరు తల నెరిసినవారూ తమ గొడవలో తము పడి వున్నారు.

రైలు మామూలు వేగంతో పోతూంది. విశాలరావు దాటిపోతున్న టెలీఫోన్ పోల్సుని మధ్యమధ్య చూస్తూ ప్రక్కవాటుగా ఆ అమ్మాయిని చూస్తూనే వున్నాడు.

ఆ అమ్మాయి కొంచంసేపు ఏవో పత్రిక తిరగవేసింది. మరో కొంతసేపు అందరి ముఖాల్ని పరిశీలించింది. ఒకసారి వయ్యారంగా వళ్ళు విరుచుకుంది. ఆ తరువాత ఏమనుకుందో ఏమో తన కుడిచేత్తో పట్టుకునివున్న హాండ్ బ్యాగ్ తెరిచి అందులోంచి చిన్న అద్దం బయటకు తీసి తన ముఖంచూసుకుంది. కిటికీపక్క నేకూచోటం వల్ల గాలికి ఆమెముంగురులు రేగుతున్నాయి. వాటిని ఒకచేత్తో అణగ దీసుకునేందుకు ప్రయత్నిస్తూ అద్దం లోపల పెట్టేసింది. తరువాత అందులోంచే ఒక నోట్లదొంతరను బయటకు తీసింది. వాటిని తాపీగా ప్రక్కన పెట్టుకుని లెక్క పెట్టుకో సాగింది.

విశాలరావుకు ఒక్కసారిగా కళ్ళు జిగేలుమన్నై. ఆమె ధనవంతురాలు అయి వుండాలి. ఆ డబ్బంతా తన దయిపోతే! ఒక నెలరోజులు కాలుమీద కాలేసుకుని, హాయిగా, దర్జాగా...

విశాలరావు ఒక్కసారిగా ఉలుక్కిపడ్డాడు. ఆమె లెక్క పెట్టుకోవటం పూర్తి చేసింతర్వాత, ఆ నోట్లను తిరిగి హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకునేలోపలే కిటికీలోంచి దూసుకువచ్చిన గాలికి ఒక పదిరూపాయల నోటుపోయి మూల నక్కింది. ఆ అమ్మాయి దాన్ని గమనించినట్లు లేదు. మిగిలినవాటిని భద్రంచేసుకుని, చేతిసంచీ మూసివేసి తిరిగి పత్రిక తిరగవేయసాగింది.

విశాలరావు కొంచం భయంగా ఒకసారి అందరి ముఖాలవంకా చూశాడు. ఒక్క నల్లద్దాల కళ్ళజోడువాడు తప్ప మిగిలిన వారందరి విషయం సంతృప్తికరంగానే వుంది. ఆ ఒక్కడే ఎటు చూస్తున్నాడో, ఏంచేస్తున్నాడో తేలకుండా వుంది.

విశాలరావు ఆలోచనలో పడ్డాడు. పరిస్థితిచూస్తే ఎవ్వరూ చూసినట్టు లేదు. ఆ ఒక్క కళ్ళజోడువాడిదే తన కనుమానం. ఇప్పుడేంచేసే టట్లయితే? ఆ పదిరూపాయల నోటు అక్కడ వుందని ఆమెకు చెప్తే?...

ఏమంటుంది? ఒక థ్యాంక్సు పారేస్తుంది. చాలదూ? తన జీవితంలో ఏ స్త్రీ అయినా యింతవరకూ, ఒక్కసారి...... ఒక్క థ్యాంక్సు...

"ఛఛ. ఏమిటి ఆలోచన్లు? అనుకున్నాడు విశాలరావు. ఆ స్త్రీ ఒకసారి తన్ను ఏదో అన్నంతమాత్రాన తను మంచయి కరిగిపోవాలా? కాలేజిలో చదివేటప్పుడు కిష్టిగాడు అంటుండేవాడు "ఐస్" అని. అలాంటిది. ఆ అమ్మాయి అలా అని ఆ నోటు తీసుకుని చక్కా తనదారిని తను పోతుంది. అప్పుడు తనకేం ఒరిగినట్లు?

ఊహు. తనకు థ్యాంక్సు అక్కర్లేదు. డబ్బు కావాలి. ఆ పది రూపాయల నోటు తనదయిపోతే చాలు. తనకు డబ్బు లేదని కాదు, డబ్బుకోసం మొహం వాచి వున్నాడని కాదు. చులాగ్గా పది రూపాయలు వస్తుంటే వదులుకోవట మెందుకూ అని.

అయితే ఆ నోటు తన పరం కావట మెట్లాగా అని? తను యిప్పుడప్పుడే దిగడు. అరవైమైళ్ళపైమాట. ఆ అమ్మాయి యీలోపున ఎక్కడయినా దిగిపోతే? అంతకన్నా ఏంకావాలి తన కింకా?

తను ఆ నోటువంకే చూస్తుంటే, అయితే గియితే తన దృష్టి నెవరయినా కనిబెడితే తన అదృష్టం చేజారుతుందని విశాలరావుకి తెలుసు. అందుకని తల వంచుకున్నట్లే వంచుకుని, బయటకు చూస్తున్నట్లేచూస్తూ, ఏదో ఆలోచిస్తున్నట్లేఆలోచిస్తూ, ఎలాగో సందు చూసుకుని ఆ పదిరూపాయల కాగితమ్ముక్కవంక అప్పుడప్పుడూ చూస్తూనే వున్నాడు.

తను నిద్రలేచీ లేవంగానే ఎవరిమొహం చూశాడో? బాగా గుర్తు వచ్చింది. చాకలి రాముడు మొహమేగా. చాకలాడ్ని చూస్తే కీడు కలుగుతుందంటారే యీ పెద్దలని పిలవబడేవాళ్ళు. పెద్దలమాటల్ని నమ్మకూడదని నమ్మాడు విశాలరావు.

రైలు ఆగుతూంది. నెల్లూరు గావును. కాస్త టీ తీసుకుంటే బావుండును ... విశాలరావు తన ఆలోచనను సరిదిద్దుకున్నాడు. ఎట్లాగా? తను లేచి వెళ్తే ఆ డబ్బుని విడిచి దూరంగా వుంటే, తనది కాకుండా పోతుందేమో.

రైలు ఆగటంతోనే ఆ అమ్మాయి పత్రిక మూసి ప్లాటుఫారంవంక చూడ సాగింది. ఒక నిమిషం గడిచింతర్వాత ఆమె దృష్టిని ఎవరాకర్షించారో ఏమో. "రాధా" అని కేక వేసింది ఉత్సాహంగా. దాంతో రాధ అని పిలువబడిన అమ్మాయి ఎకాయెకిని కిటికీ



"ఇది దొంగసొమ్ము. వీళ్ళిద్దరిలో ఒకరు దొంగయుండాలి."

ముందుకొచ్చేసి "హల్లో సునీథా. ఇక్కడ కూర్చున్నావేమిటి?" అనడిగింది.

"లేడీస్ కంపార్టు మెంటులో చోటు లేకపోతే?..."

"ఇప్పుడుందిలే పద. తర్వాత మాట్లాడుకుందాం" అని ఆ రెండో లేడికళ్ళ పిల్ల అనటంతోటే అయితే వస్తున్నా వుండు, అని లేచి పైన బర్తుమీద వున్న సూట్ కేస్ తీసుకుని హ్యాండ్ బ్యాగ్ తోసహా అక్కడి నుంచి దిగి వెళ్ళిపోయింది మొదటమ్మాయి - లేకపోతే సునీథ.

పదిరూపాయలనోటు అక్కడే వుంది కదలకుండా. సంగీతపుటాయన టీ తాగుదామని కొంకోలు దిగాడు. విశాలరావు కూర్చున్నది యింటర్ క్లాస్ కంపార్టుమెంటులో మధ్యది. ప్రక్కదాంట్లోంచి ఒక్కసారిగ మిన్ను విరిగి మీదపడినట్లుగా వినిపించింది ఒక సవ్వో విరుపో తెలీని గార్దభస్వరం.

"ఇంకెవ్వరూ ఎక్కకపోతే బాగుండును" అనుకున్నాడు విశాలరావు. అనుకోవటం పూర్తి కాకుండానే ఒక పోలీసు కానిస్టేబులు బూట్లు చప్పుడు చేసుకుంటూ లోపలకి వచ్చి ఒకసారి నలువయిపులా చూశాడు. ఆ ఖాళీగావున్న సీట్లో కూర్చుంటాడేమోనని భయపడ్డాడు విశాలరావు. కాని ఆ కానిస్టేబుల్ అలా చేయలేదు. కొంతమందికి నించోటం సరదా. అతను అటువైపుకీ పోకుండా యిటు వైపుకీ రాకుండా మధ్యస్థలంలో నిల్చుని, వంగుని కిటికీలోంచి బయటకి చూడసాగాడు.

విశాలరావు విసుక్కున్నాడు. "చప్పున రైలు కదిలితే బాగుండును" అనుకున్నాడు. ఆ పదిరూపాయలనోటు ఆ మూలపడివుండి యింతవరకూ ఎవ్వరికళ్లా పడకుండా వుండటమే అతనికి ఆశ్చర్యం కలిగించింది. ఆ నోటును తన స్వంతం ఎప్పుడు చేసుకుందామా అని అతని ఆదుర్దా.

రైలు కదిలింది. సంగీతపుటాయన ఒక్క విసురున లోపలకు వచ్చి తన సీటులో కూర్చున్నాడు. టీ తాగితే మెలకువగా వుండటంకంటే నిద్రే ఎక్కువ అవహిస్తుందేమో. మరుక్షణంలో అతను కునికిపాట్లు పడసాగాడు.

విశాలరావు జాగర్తగా ఒకసారి నలువయిపులా చూశాడు. ఎవరిధోరణిలో వాళ్ళున్నారు. కళ్ళజోడాయన యిందాకటిమాదిరే వున్నాడు. విశాలరావు గుండె వేగంగా కొట్టుకుంది. ఆ నోటు తన స్వాధీనం చేసుకోవాలి. అంటే దాన్ని తీసుకుని తన జేబులో తోసివేయాలన్న మాట. అతనికి కొంచంగా వొణుకుపుట్టింది "వద్దులే" అనుకున్నాడు ఒకసారి. "ప... రూపాయలు ... అకారణంగా ... అన లోచితంగా ..." విశాలరావు ధైర్య... చేశాడు. భయంతో యింకొకసారి అంద... వంకా చూడటం కూడా మరిచిపోయాడు ఆనోటు ఒకటే అతని కళ్ళకు కన్పిస్తోంది దాన్ని తీసుకుని...జేబులో వేసుకుని.. హాయిగా..

ముందుకు వంగాడు జాగ్రత్తగా. కు... చెయ్యి ముందుకుపోయి నోటుమీదవ్రాలింది చటుక్కున మడిచి వెనక్కి లాక్కో... పోయాడు. మరుక్షణంలో అతని చేతినిం... బలమైన మరో చెయ్యి పడింది.

విశాలరావు నిశ్చేష్టుడయిపోయాడు అతనికి ముచ్చెమటలు పోశాయి. భయం... భయంగా తల ప్రక్కకు తిప్పి చూశాడు. నల్లద్దాల కళ్ళజోడు.

"ఇది నాది" అన్నాడు వికృత మొహం పెట్టి విశాలరావు.

"నాది" అన్నాడు కళ్ళజోడాయన. అతను నిల్చుని వున్నాడు. అని ఆ నోటు

★ ఆశ ★

కోసం విశాలరావు చేత్తో పెనుగులాడాడు.

"నాదయితే?"

"నాదంటుంటే"

విశాలరావు పూర్తిగా చప్పబడిపోయాడు. బిక్కచచ్చిపోయి ఒకసారి పెట్టెలోని అందరివంకా చూశాడు. అంతా తనవంకే చూస్తున్నారు పోలీసువాడితో సహా.

"నీ దెలాగయింది?"

"నీ దెలాగయిందీ?"

"అది నాదే అంటుంటే"

"అదే నేనూ అంటూంటే"

పోలీసువాడు ముందుకు వచ్చాడు. "ఏయ్. అలా పెనుగులాడుకోకండి. అది కాస్తా చిరిగిపోతుంది. ముందిటివ్వండి. ఇచ్చి విషయమేమిటో చెప్పండి" అన్నాడు చెయ్యి జాబుతూ. ఆ మాట విని యిద్దరూ ఒకేసారి ఆనోటు వదిలేశారు. పోలీసు కానిస్టేబులు అదితీసుకుని చేతిలోపట్టుకున్నాడు.

"ఇప్పుడు చెప్పండి"

"ఆ నోటు నాది. పర్సులో డబ్బు తీసి లెక్కబెట్టుకుంటూంటే ఎగిరి అక్కడ పడిపోయింది" అన్నాడు విశాలరావు. తను కొత్తగా తెచ్చి పెట్టుకున్న ఆలోచన నుపయోగించి.

"మీరేమిటంటూరు?" అన్నాడు కానిస్టేబులు కళ్ళజోడాయనవంక తిరిగి.

"అది నా జేబులోది. దువ్వెన్న తీసుకుందామని తీసుకుంటుంటే ఎగిరి అక్కడకుపోయి పడింది" అన్నాడతను.

పోలీసువాడు విశాలరావువంక తిరిగి అడిగాడు. "మీ పర్సేది!"

విశాలరావు పర్సు తీసి చూపించాడు. "అసలు మీదగ్గర మొత్తం ఎంతవుండాలి?" అనడిగాడు పోలీసు.

విశాలరావు అంత తెలివితక్కువ వాడేం కాదు. "పదిహేనూ ఆరణాలు." తన పర్సులో అంతకు ముందు వున్నదానికి యీ పది రూపాయలు కలిపి చెప్పాడు.

కళ్ళజోడాయన్ని కూడా అలాగే అడిగాడు పోలీసువాడు. "పదిహేడూ ఏడణాల ముక్కాలనీ" అని చెప్పాడాయన నిశ్చలంగా. ఆయనదగ్గర చూస్తే ఏడు రూపాయల ఏడణాల మూడు కాన్లు వున్నాయి నిజంగా.

పోలీసువాడు యిలా పరిష్కరించలేననుకున్నట్టున్నాడు. తన బుద్ధిబలాన్నుపయోగించి ఒక ఉపాయాన్నాలోచించాడు. ఆ పదిరూపాయల నోటు గుప్పెట్లో మూసి "దీని నెంబరెంత?" అనడిగాడు. ఇద్దరూ తెల్ల మొహాలు వేయాల్సి వచ్చింది.

"నాకు గుర్తు లేదు" అన్నాడు విశాలరావు.

"నాకు నెంబర్లుచూసే అలవాటు లేదు" అన్నాడు కళ్ళజోడాయన.

"అయితే ఎలాగ పరిష్కరించటం? ఇద్దరికీ సగం సగం చించి యిచ్చేదా?" అన్నాడు పోలీసు కానిస్టేబులు. పెట్టెలో మిగిలినవాళ్ళంతా నవ్వారు. తన జోక్కి యింతమంది నవ్వినందుకు అందరివంకా ఒకసారి గర్వంగా చూశాడు కానిస్టేబులు.

విశాలరావు ధైర్యం తెచ్చుకున్నాడు. "ఇది హాస్యంకాదు" అన్నాడు.

"అదే నేనూ అంటూంట" కళ్ళజోడాయన తనవాదన వొదిలిపెట్టలేదు. ఈ సమస్య యిలాగయితే తెగేటట్టు లేదు. పోలీసువాడికి విసుగొచ్చినట్టుంది. "మరయితే ఎలాగయ్యా యిది తేల్చటం?" అన్నాడు కొంచం చిరాగ్గా.

"ఏమో మరి"

"ఏమో"

పోలీసువాడు వీళ్ళిద్దరి ముఖాలవంకా ఒకసారి తీక్ష్ణంగా చూశాడు. ఆ తర్వాత చేతిలోవున్న నోటువంక చూశాడు. ఒక నిమిషం అలాచేసి "ఆఁ తెలిసింది" అన్నాడు గట్టిగా అందరూ హడిలి చచ్చేటట్లు.

అంతా అతని ముఖం వంక చూశారు.

"ఇది దొంగ సొమ్ము"

విశాలరావు గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి.

"వీళ్ళిద్దర్లో ఒకరు దొంగయి వుండాలి" సంగీతపుటాయన యీసారి కల్పించుకున్నాడు. "అంటే అది ఎట్లా?" అని అడిగాడు.

"వారం రోజుల క్రితం సేట్ హీరాలాల్ కొట్లో వెయ్యి రూపాయల విలువగల నోట్లు దొంగిలించబడ్డాయి. ఇదిగో, ఆ నోట్ల నెంబర్లలో దీని నెంబరుంది" అన్నాడు పోలీసు తన నోటుబుక్ తెరిచి అందులో చూస్తూ.

విశాలరావు హతాశుడయిపోయాడు. కళ్ళజోడాయన నిల్చోలేక పోయాడు కాబోలు, కూలబడ్డాడు.

"ఇది నాది కాదు, నిజంగా. యిందాక ఒకావిడ యిక్కడ కూర్చుని వెళ్ళింది. ఆమెవద్దనుంచి జారిపోయి వుంటుంది. ఊరికినే ఆశపడి నేనలాగన్నాను" అన్నాడు విశాలరావు వొణుకుతున్న గొంతుతో.

కళ్ళజోడాయన మాట పొడిగించటానికి అశక్తుడయాడేమో. "నేనూ అంతే" అన్నాడు అపస్వరాలు పలుకుతూ.

"మరి యిందాక మీదే నన్నారు?"

"ఆశపడి"

"బుద్ధి గడ్డితిని"

"ఎలా నమ్మటం? ఇంతలా అలాగని యిప్పుడిలా అంటుంటే?" పోలీసువాడి కంఠంలో అంతకంతకీ కరుకుతనం జాస్తి అవుతూంది.

"నిజంగా ఆమె యీ ట్రెయిన్లోనే యింకో కంపార్టుమెంటులో ఎక్కింది" అన్నాడు విశాలరావు.

"అయితే మిమ్మల్ని నమ్మమంటారు?"

"ఊఁ"

"మిమ్మల్ని వదిలేయమంటారు!"

"ఊఁ"

"ఇంకెప్పుడూ యిలా అబద్ధాలు పలకరుగా"

"ఊహు"

పోలీసువాడు ఆనోటు తీసుకుని జేబులో పెట్టుకున్నాడు. "ఆమె యింకో కంపార్టుమెంట్లో ఎక్కిందా?" అనడిగాడు.

"అవును. ఎవరో స్నేహితురాలు కనిపిస్తే లేడీస్ కంపార్టుమెంటులో ఎక్కుతానని వెళ్ళిపోయింది" అన్నాడు విశాలరావు.

రైలు స్టేషన్ సమీపించింది.

"నేను ఆమెను నీతో పట్టుకుని అరెస్టు చేసేస్తాను" అన్నాడు పోలీసువాడు. రైలు ఆగిన తర్వాత దిగి గబగబ వెళ్ళిపోయాడు.

నిమిషాలు గడిచిపోతున్నాయి. పోలీసువాడు కనిపించలేదు...రైలు కూత వేసి కదిలింది. అంతలో ఎక్కడినుంచో వచ్చాడు పోలీసువాడు. అతని పెదవులమీద చిరునవ్వు తాండవిస్తూంది.

"అచ్ఛా. అచ్ఛా భాయిమో. ఆమె వచ్చి డబ్బు విషయం అడిగితే ఎర్రబుట్ట ఎగరేసు కెళ్లిందని చెప్పండి. ఉంటా" అన్నాడు చేతులూపుతూ.

ఇద్దరూ తెల్లమొహాలేశారు. రైలు ప్లాట్‌ఫారం విడిచి సాగిపోతూంది. ★

తప్పెవరిది

"మహేన్"

సావిత్రికీ ప్రకాశానికీ మామూలు విషయాలలో చిన్న చిన్న పేచీలు వచ్చినా రాకపోయినా, ఒక్క విషయంలో మాత్రం వీళ్లి పోట్లాటలు హద్దు మీరి పోయేవి.

నిజానికి ప్రకాశం చక్కని కథలు రాయగల్గినా, అతనికున్న డిఫెక్టల్లా ఏమిటంటే, రాసినకథను మళ్ళీ ఓమారు చదువుకొని తప్పులేవైనా వుంటే దిద్ది సరిచేసుకోరటమన్నా, రఫ్ కాపీని ఫేర్ చేయటమన్నా అతనికి మహాచెడ్డ తలనొప్పి.

అంచేత ఒకొక్కరోజు, తాటి కాయలంతేసి అక్షరాలతో తను గజిబిజిగా రాసి పారేసిన కాగితాల కట్టలనంతా చేతబట్టి వంటగదిలోకెళ్ళి, భార్య ఎదుట వినమ్రుడై నిలచి "భామామణీ!" అనిసంబోధించేవాడు.

తలపైకెత్తి, భర్త చేతిలోని కాగితాలను చూస్తూనే సర్వమూ ఊహించి "భామా లేదూ - గీమాలేదు......నాకిది బొత్తిగా ఇష్టంలేదు" అని విసుక్కునేది సావిత్రి.

"ఏదీ?...నేను భామామణీ యని పిలవటమా?"

"మీకూ మీ మాటలకే చెల్లు. వీటిని కూడా మీ కథల్లోకి ఎక్కించండి. నలుగురూ నేర్చుకొని మీలాగే వాళ్ళ పెళ్ళాలను వేపుకు తింటారు."

"పోనీ...దానికైనా నువ్వు ఫేర్ కాపీ చేసివ్వండే...అదికాదే - ఇలా చూడూ! ఈ కథను ఇలా చిత్తుగా పంపిస్తే ఆ పత్రికలవాళ్ళు దీని మొహమైనా చూస్తారుటే? ఇంతవరకూ నేనెన్ని కథలు రాసివుంటాను. అన్నీ చూడూ - అటకమీదపడి మూలుగుతున్నాయ్. ఒక్కటైనా నువ్వు ఫేర్ చేసిచ్చి పుణ్యం కట్టుకున్నావా! ఇదో సావిత్రీ! ఈ కథను గనుక నువ్వు శుభ్రంగా కాపీ చేసిచ్చావంటే, ఈకథవల్ల వచ్చిన పారితోషికంతో నీకే ఏమైనా తీసిస్తాను."

"మీరు తీసివ్వక పోయినా మానె. మీరు ఇంకేపని చెప్పినా తలతో చేసి పెట్టుతా కానీ - ఇది మాత్రం నావల్ల అయ్యేపని కాదండీ."

"అలాగంటే ఎలాగే?"—మరి చదువుకున్న నిన్ను పెళ్ళిచేసుకుంది ఎందుకు?-ఏడ్వటానికా?" అని కాస్త ఎర్రమొహం చేసుకునేవాడు ప్రకాశం.

"మీరు ఏమైనా అనండి. ఇరవైనాల్గు గంటలూ ఇంటిపనితోనే చచ్చి సగమై పోతూంటే, ఉండేపని చాలక ఇదొకటా? మొన్న మా మేనకోడలు ఇటొచ్చి వెళ్లినప్పుడు నన్ను చూసి ఏమనందో తెలుసా? ముక్కుమీద వేలేసుకుని 'ఇదేవిటే-ఇలా చిక్కి శల్యమై పోయినావూ' అంది. కావలిస్తే మీరే చూడండి. మొన్ననగా తీసిచ్చారు కదా ఈగాజుల్ని. చూసుకోండి అప్పుడే ఎంత వదులైపోయాయో" అని ముక్కు తెగరవేసేది సావిత్రి.

ఆమె మొండిపట్టుదలకు, ఆమాంతంగా మీదపడి నమలకుండా మింగేద్దామా అన్నంత కోపం వచ్చేసేది ప్రకాశానికి. కానీ ఆ కోపంలో ఏమనటానికీ సమయానికి తోచక "హుఁ, నువ్వింతే లేవే...ఇంతకీ నాఖర్మ" అని చప్పగా అనేసి జారుకునేవాడు. అతను వంటగదిదాటి హాలులోకి అడుగెట్టేలోగా, కొన్ని గ్లాసులు విరిగిన చప్పుళ్లూ, పాత్రలను బలంగా నేలకు గుద్దిన సద్దులూ వినిపించేవి.

* * *

భార్య కాన్పుకు పుట్టింటికి వెళ్లి అరు నెలలైంది. ప్రసవించింది కూడానూ. ఆడబిడ్డ.

ఇక్కడ ప్రకాశానికి పొద్దుపోవటం లేదు. ఆవేళ ఆదివారం. ఆఫీసులేదు. ఏం చేయటానికీ తోచక, అటకమీద పడి మూల్గుతూన్న కొన్ని కాగితాలకట్టలను తీసి ముందు వడేసుకొని కూర్చుని దుమ్ము దులిపాడు అతనికళ్లు చెదిరిపోయినై. దాదాపు చెమ్మగిల్లేంత పనయింది. 'ఒకటా రెండా...ఎన్ని కథలు! ఎన్ని కథలు!! ఇవన్నీ ఈపాటికి అచ్చయివుంటే ఎంత బావుండేదిప్పు'అని నిట్టూర్చాడు ప్రకాశం.

కడుపునిండా గాలి పీల్చుకొని, వాటిల్లోంచి ఓకథను చేతికెత్తుకొని చూశాడు. "తప్పెవరిది"అన్న కథానిక అది. నవ్వుకున్నాడు ప్రకాశం. తనకు అలాంటిస్థితిలో ఆపేరుగల కథ దొరకటం ఓ తమాషాకదూ!

"తప్పెవరిది" నోట ఓమారు ఉచ్చరించి తన్మయుడయ్యాడు ప్రకాశం. ఆ కథను ఇప్పటికి తాను మరిచిపోయినా, దానిని మాత్రం ఎన్నడో చాలా బాగా రాశానని అతనికి పూర్తిగా నమ్మకముంది. ఆరుడియలోనే ఆకథను ఓనాలు గయిదుసార్లు చదువుకొని తెగమురిసిపోవటమే అందుకుసాక్షి.

నోరుతెరిచి పెద్దగా ఆ పులించాడు ప్రకాశం. తను రాసిన రఫ్ నించి ఫేర్ చేయటం తన జీవితంలో ఇదే ప్రప్రథమం.

కాగితం మీద నించి కలాన్ని ఎత్తకుండా ఒకే పట్టులో రాసుకుపోతూన్నాడు ప్రకాశం. ఆ కథానికను ఫేర్ చేయటానికి ఏ సుముహూర్తాన ఉపక్రమించాడో ఏమోకానీ, ఆపని ముగించి, ఆ కథను పోస్టుచేసి వచ్చేంతవరకూ ఇంకో పని జోలికిపోలేదు ప్రకాశం.

* * *

ఓ రోజున ఆఫీసునించి వచ్చి, వీధి తలుపు తెరిచేసరికి "జ్యోతిప్రభ" పత్రిక నేలమీదపడి వుండింది. ఆత్రంతో ఆ పత్రికను చేతికెత్తుకొని తిరిగేశాడు ప్రకాశం. తన కథ ప్రచురింపబడివుంది! విలువున్న వళంగానే ఆ కథను చదువసాగాడు ప్రకాశం. కథ బాగా సాగి, ?, కచ్చే మాంచి రసవత్తర ఘట్టంలో హఠాత్తుగా ఆగిపోయివుంది. 'సశేషం - తరువాయి వచ్చే సంచికలో' అని చివరన సూచింపబడివుంది.

మరుక్షణంనించీ తర్వాతి సంచిక ఎప్పుడెప్పుడు వస్తుందా, అందులో తన కథయొక్క తర్వాత భాగం ఎప్పుడెప్పుడు ప్రచురింపబడుతుందా, అని ఇప్పట్నించే ఎదురు చూడటానికి మొదలెట్టాడు.

వారమయింది...పదిరోజులైంది. ప్రకాశానికి తదుపరి "జ్యోతి ప్రభ" సంచిక రానేలేదు. పోస్టులో ఆలస్యమేమైనా జరిగి వుంటుందేమోనని బజారుకు వెళ్ళి

అక్కడ బుక్‌స్టాల్ వద్ద చూస్తే, "జ్యోతి ప్రభ" సంచికలు బారులు తీరిన కొంగల్లా తాడుకు వ్రేలాడుతూన్నాయ్. ఓ కాపీ కొనుక్కొని గబగబా పేజీలు తిరగేశాడు ప్రకాశం. అతనికథ ఎక్కడాకనిపించలేదు.

స్తంభితుడై, మళ్ళీ మొదటినుంచి ఒక్కొక్క పేజీగా తిరగవేస్తూ చూశాడు. చివరికి ఆఖరిపేజీలో ఈ ప్రకటన కనిపించింది.

"పోయిన సంచికలో, మాకు శ్రీ వి. పి. ప్రకాశంగారు పంపించిన 'తప్పెవరిది' అన్న కథానికను ప్రచురించితిమి. అదే కథ, ఆ పేరుతోనే, పోయినవారం 'సాహితీ' పత్రికలో "రేవతి" అను పెన్ నేమ్ పేరిట ప్రచురింప బడినట్లుగా మాకు తెలియవచ్చినది. అంచేత ఆ కథ, సశేషాన్ని ఈ సంచికలో మేము ప్రచురించుటలేదు. ఇందులకు మేము అమిత విచారిస్తూన్నాము. ఇహ నెప్పుడూ శ్రీ వి. పి. ప్రకాశంగారు ఇలాటి గ్రంథచౌర్యానికి పూనుకోనరని ఆశిస్తూన్నాం—సం||

దాదాపు గుండె ఆగినంత పనైంది ప్రకాశానికి. ఆ ప్రకటన చదువుతూన్నంత సేపూ అతని కాళ్ళక్రింద భూమి దద్దరిల్లి పోయినట్లయింది. నిలువునా కంపించి పోయాడు.

నిజానికి తాను స్వయంగా రాసిన కథే అది. కాని ఈ ప్రకటన చూడబోతే విచిత్రంగావుంది. ప్రకాశం, ఇదేదో మిస్టరీనో మోసమో జరిగుంటుందను కొని, కోపంతో నేరుగా చకచకా నడిచివెళ్ళి పోయాడు ఇంటికి.

ఆ 'సాహితీ' పత్రికా సంపాదకుడికి జాబురాసి, "రేవతి" విలాసం తెలుసుకొని ఈగూడు పుఠాణీ ఎలా జరిగిందో ఆచోకీ తీయాలని సంకల్పించుకొన్నాడు.

కాగితం కలం అలా చేతి కెత్తుకున్నాడో లేదో, పోస్టుమాన్ వచ్చి ఒక కవరని ఇచ్చేసి పోయాడు. ప్రకాశం ఉత్తరాన్ని చేతి కెత్తుకున్నాడు.

బెంగుళూరు
28-1-1953.

సావిత్రి చేయు అనేక నమస్కారములు.

ఇక్కడ అందరూ క్షేమం. మీ క్షేమ సమాచారాలకు బదులు రాసేది. మీవద్ద నుంచి ఉత్తరాలువచ్చి చాలారోజులైంది. కారణం తెలియటంలేదు. అమ్మాయి ఆరోగ్యంగా వుంది. అచ్చం మీ పోలికే.

దాదాపు ఇరవైరోజుల క్రితం, మీకు ఒక కార్డురాసి, దానిని పోస్టులో పడేసి రమ్మని మా తమ్ముడు రాము చేతి కిచ్చి పంపితే, ఆ వెధవ పోస్టుచేయలేదు. నిన్ననే ఎందుకో పాడి పెట్టె తెరిచిచూస్తే అందులో ఆకార్డు కనిపించింది ఆ కార్డులో మన అమ్మాయికి, ఈనెల 6వ తేదీనాడు 'రేవతి' అని నామకరణం చేసితిని. ఈపేరు మీకు నచ్చినదనుకుంటాను.

ఎన్నడో అక్కడున్నప్పుడు మీరు రాసివుంచిన, 'తప్పెవరిది' అన్న కథను నీట్‌గా రాసివుంచాను. ఆ కథ ఎలాగో పొరబాటున నా సామానులతో పాటు ఇక్కడికి వచ్చి పడివుండింది. మన అమ్మాయికి నామకరణం చేసినరోజే ఆ కథ నాకు కనిపించింది - అంచేత మన అమ్మాయి 'రేవతి' పేరిట, ఈ ఊరిలోవుండే 'సాహితీ' పత్రికకు పంపమని మా అన్నయ్యను కోరాను. వెంటనే ఆ సాహితీపత్రికలో ప్రకటింపబడింది. వాళ్ళు ఇక్కడ మాకొక కా... పంపించారు. మీరు కూడా ఎక్కడై... ఆ సంచికను సంపాదించిపెట్టుకోం...

"అంతే తర్వాత చదవలేకపోయా... ప్రకాశం. అతని చేతిలోని ఉత్తరం అ... తెలియకుండానే గాలికి అలా ... పోయింది. అతను అలాగే కొయ్యబ... శూన్యం వంక చూస్తూ వుండిపోయాడు.





విజ్ఞానవీధులు

"డాక్టర్"



111. మంట యేమిటి?

అగ్గిపుల్ల పెట్టె పక్కని గరుకు కాగితానికి రాస్తే అంటుకుని మండుతుంది. ఈ మంట పసుపూ ఎరుపూరంగులు చేరిన రంగులో వుంటుంది. ఇది యేమిటి? ఆ రంగుతో ఎందు కలాగ మంటలాగ - మండే వస్తువునుంచి పైకివచ్చి, కొంత పైకి వ్యాపించి ఆగిపోయినట్లుగా - కనపడుతుందీ? చీపురుపుల్ల ఒక కొసని వెలిగించి, మండే కొసని కిందికి పెట్టినా, పైకిపెట్టినా మంట పైవైపుకే వ్యాపిస్తుందేమీ? ఊదగా ఊదగా నిప్పునించి మంట వస్తుందిగదా, అగ్గిపుల్ల మంట ఊదితే ఆరిపోతుందేమీ?

మండినప్పుడు ఏం జరుగుతుందో తెలుసుకుంటే ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానము వస్తుంది. కణకణలాడే బొగ్గుల్ని ఆర్పివెయ్యాలంటే గిన్నెని వాటిమీద బోర్లించితే సరి. నిప్పు ఊపిరిసలపక ఆరిపోతుంది. 'ఊపిరి సలపక' అన్నది సరియైన మాటే. మన బ్రతుకుకి అవసరమైన ప్రాణవాయువే నిప్పు నుండడానికి కూడా అవసరము. ఏ పదార్థమేనా గాలిలోని ప్రాణవాయువుతో సంయోగించడమే 'మండుట.' కర్రలో హైడ్రోకార్బనులుంటాయి. (ఉదజనీ, కర్బనమూ చేరినవి హైడ్రోకార్బనులు) కర్ర మండుతూన్నప్పుడు ఉదజనీ, కర్బనమూ కూడా ప్రాణవాయువుతో రాసాయనిక సంయోగము పొంది, నీటివాయువూ అంగారామ్ల వాయువూగా మారుతాయి. ఉదజనీ కర్బనముల సంయోగములో, కర్బనమూ ప్రాణవాయువుల సంయోగములో కంటె శక్తి ఎక్కువ. గనక హైడ్రోకార్బనులు అంగారామ్ల వాయువైనప్పుడు ఈ అదనపు శక్తి ఉష్ణరూపమున లభ్యమౌతుంది మనకి.

ఇక అగ్గిపుల్లనుండి మంటరూపంలో పైకి ప్రసరించేవి, ఆమ్లజనితో—అంటే ప్రాణవాయువుతో—సంయోగించే కర్బన కణాలు. పసుపూ ఎరుపూ కలిసినట్టు కనపడే మంట అంతా, గాలిలోని ఆమ్లజనితో సంయోగిస్తూన్న బొగ్గుకణాలనుంచి బయల్దేరే దీప్తి. దీనికిపైన కాలలేకపోయిన బొగ్గుకణాలు పొగలాగు కనపడుతూ పైకిపోతాయి. 'మండుట'వల్ల పుట్టిన వాయువులు వెచ్చని వౌటవల్ల గాలికంటె తేలిక. అందుచేత 'మంట'- అనగా వెచ్చని వాయువులలో తేలిపోతూ ఆమ్లజనితో సంయోగిస్తూన్న కర్బన కణాలు - నిప్పుపుల్ల ఎటు వంచినా పైవైపుకే పోతుంది.

నిప్పును ఊదినప్పుడు మన ఊపిరిగాలితో పాటు గాలిలోని ప్రాణవాయువు కూడా ఆ నిప్పుకు సోకి, 'మండుట'ను హెచ్చిస్తుంది. ఈ సంరంభములో, కాలీకాలని బొగ్గుకణాలు, తక్కిన వాయువులతోపాటు పైకిపోతూ పూర్తిగా మండడములో ఎర్రని దీప్తిని ప్రసరిస్తాయి. ఇదే 'మంట'.

ఇక చీపురుపుల్లని వెలిగించినప్పుడు మంట పెద్దదిగా, పుల్లని పూర్తిగా కప్పేస్తుంది. 'మంట'లో జరిగే ఆమ్లజని సంయోగపు వేడిమి 'మంట'కి పక్కనున్న పుల్లకి కూడా తగిలి, దాన్ని కూడా రగులుస్తుంది. మంట అన్నదే లేకపోతే పుల్లకి చివ్వరగల నిప్పురవ్వ, ఆమ్లజని సప్లై జోరుగా లేక, పుల్లని నెమ్మదిగా, నీరసంగా, కాలుస్తుంది. 'ఉఫ్'ని ఊదినప్పుడు, మంటలో పూర్తిగా కాలుతూన్న బొగ్గుకణాలూ, ఉష్ణవాయువులూ పుల్లకి దూరంగా పోతాయి. మంట మండుతూంటే కిందివైపునుంచి పైకి ప్రసరిస్తూ మండే పుల్లకి అందుతూన్న ప్రాణవాయువు కూడా గతి తప్పుతుంది. దూరంగాపోయిన 'మంట' కర్బన కణాల సరఫరా లేక ఆరిపోతుందీ, పుల్ల ఆమ్లజని సరఫరా జోరుగా సాగక (మంట) ఆరిపోతుంది.

112. భూమి ఆకర్షణ శక్తి ఎంతదూరం ప్రసరించును?

అని చిలకలూరిపేటనుంచి ఐ. వి. ఆర్. శాస్త్రి గారడుగుతున్నారు. మంచి ప్రశ్న. ఒక సూదంటురాయిని తీసుకోండి. దానిని ఇసకలో కదిపినట్లయితే సన్నని ఇనుపపొడి దానికి అంటుకుంటుంది. ఈ పొడిని గుప్పెడు తీసుకుని ఒక అట్టమీద పలచగా చల్లండి. ఇప్పుడు సూదంటురాయి ఒక కొసని ఆ అట్టమీద మధ్యన ఆనించండి. ఇనపపొడి అన్ని వేపులనుంచీ జరిగి సూదంటురాయికి అంటుకుంటుంది. సూదంటురాయికి చుట్టూ కొంతమేర ఖాళీగా కనపడి, తర్వాత మేర అంతా పొడి కనపడుతుంది. ఖాళీగా కనపడే మేరని 'అయస్కాంత క్షేత్రము' అంటాము శాస్త్రభాషలో. అంటె సూదంటురాయి ఆకర్షణశక్తి ఆ మేర అంచువరకూ ప్రసరిస్తుందని ఉద్దేశము. అయితే నిజానికి సూదంటురాయి ఆకర్షణ శక్తి ఇంకా దూరానికి ప్రసరిస్తుంది. కాని ఈశక్తి, దూరము హెచ్చైనకొద్దీ క్రమంగా తగ్గిపోతూ ఉంటుంది. అట్టమీద, పైన చెప్పిన అయస్కాంత క్షేత్రమునకు వెలుపల ఉన్న ఇనుపపొడిమీద కూడా సూదంటురాయి ఆకర్షణశక్తి ప్రసరించి కేంద్రమువైపు లాగుతూన్నప్పటికీ, పొడికీ కాగితానికీ నడుమగల రాపిడి నిరోధించడము వల్లనే ఈ పొడి సూదంటురాయివైపు జరిగిపోలేక పోయినది. అట్టకంటె నున్నగా ఉండే తలముమీద ఇనపపొడి జల్లి పైన చెప్పిన ప్రయోగము చేస్తే, "అయస్కాంత క్షేత్రము" ఇంకా విశాలమౌతుంది. అంటే ఏమని తేలిందీ, సూదంటురాయి యొక్క ఆకర్షణశక్తి ఎంతదూరము ప్రసరించినా, దూరము హెచ్చినకొద్దీ ఈ శక్తి తగ్గిపోతుంది గనక, అయస్కాంత క్షేత్రమనే మేర 'ఇంతమాత్రమే' అని నిర్ణయించడము మనకి గల సాధనాల సున్నితత్వముమీదే ఆధారపడుతుందనీ. ఇప్పుడు అసలు ప్రశ్నకి వద్దాము. "భూమి ఆకర్షణశక్తి ఎంతదూరము ప్రసరిస్తుందీ?" ఎంత దూరమేనా ప్రసరిస్తుంది. భూమియొక్క ద్రవ్యరాశి (అనగా మొత్తపు వస్తువు) 'భూ' అని అనుకుంటే 'వ' అనే వస్తురాశి (ద్రవ్యరాశి) గల వస్తువు భూమికి 'దూ' అనే దూర

ములో వుంటే, ఆ వస్తువుమీద భూమి యొక్క ఆకర్షణశక్తి $\frac{\text{భూ} \times \text{వ}}{\text{దూ}^2}$ కి సమానము.

భూమి చంద్రుణ్ణి ఆకర్షిస్తోంది. చంద్రుడి వస్తువు ఏదో కారణమువల్ల పెరిగిపోయిందనుకుందాము. అప్పుడు చంద్రుడిమీద భూమియొక్క ఆకర్షణశక్తి ఎక్కువౌతుంది. 'వస్తువు' ఎక్కువ అవక 'దూరము' తగ్గినా ఈ ఆకర్షణశక్తి ఎక్కువౌతుంది. అయితే చంద్రుడు భూమిమీద పడిపోడేమో ! అని అడుగుతారేమో. చంద్రుడు భూమిచుట్టూ-తాడుకట్టి మనము త్రిప్పే రాయిలాగ - గిర గిరా తిరుగుతున్నాడు నెలకొకసారి. తాడు బలములేనిదయితే, తెగిపోయి, రాయి విసరినట్టు దూసుకుపోయేటట్లే, భూమి చంద్రుణ్ణి ఆకర్షించకే పోయినట్లయితే, చంద్రుడు ఆకాశాంతరాళాలలోకి ఎగిరిపోయి వుండును. సూర్యుడు ఆకర్షిస్తూండకపోతే భూమీ, శుక్రుడూ మొదలైన గ్రహాలపనీ అంతే.

నక్షత్రాలనుంచి ఏదో కారణమువల్ల తెగిపోయి విడిపోయిన వస్తువు ఉల్కల రూపాన్ని ఒకొక్కప్పుడు వెలుగుతూ భూమిమీద పడడము కనబడుతుంది. అవి "భూమి ఆకర్షణ క్షేత్రములో ప్రవేశించినప్పుడు" అనగా, భూమి ఆకర్షణ బలమై, వాటిని భూమివైపు లాక్కొగలంత చేరువకి అవి వచ్చినప్పుడు, అవి ఉల్కలుగా భూమిమీద పడిపోతాయి.

చంద్రగోళము ఆకర్షించడమువల్ల కొంచెము చంద్రుడివేపు 'జరిగి' సముద్రమునీరు కుప్పపడినట్టు అవడమే పోటు అంటే. చంద్రుడి ఆకర్షకశక్తి భూమిదాకా వ్యాపించిన దన్నమాటే కాదూ !

చిట్టిప్రశ్నలు - జవాబులు

—సముద్రము లోపలికి తీసిపోవుట తుపానునకు కారణము కాదు. తీరమునకు కొంతదూరమున సముద్రములో విజృంభించే తుపానే, తుపాను కలిగినచోట తాడి ఎత్తు కెరటాలరూపంగా నీరుచేరడానికీ, కాబట్టే అక్కడికి చేరువగా ఉన్న తీరము వెంబడిని నీరు తీసిపోవడానికీ కారణము. తుపానంటూ చేరువగా వున్నప్పుడు నేడో, రేపో ఆ సముద్ర తీరానికి రాదా, తుపానుతోపాటు సముద్రముకూడా విజృంభించి చెలియలికట్ట దాటదా?

—మేఘసందేశమునుబట్టి మేఘాలు నీళ్ళుతాగుతాయని అనుకుంటున్నారా? అలాగ అనుకోకండి. మేఘ సందేశంలోనే 'ధూమజ్యోతి స్సలిల మరుతాం' అన్న శ్లోకము ఉంది. అది చదవండి. పొగ, వేడి, నీరు, గాలి చేరి మబ్బు అవుతుంది. ఇవన్నీ చేరి నీళ్ళు త్రాగుతాయంటారా? ఇక ఆ నాలుగింటినీ చేర్చి 'జున్ను' వండుకోడము అనగా యేమిటీ?

—ఈమారు కుంభపోత వర్షముతో పడే చేపల్ని (కాళీపళ్ళెము వానలోపెట్టి) పట్టి మాకొకటి పంపించండి. కాళీపళ్లెము ఆరు బయట అరుగులాంటిదానిమీద పెట్టి వానలో చేపల్ని మీరు నిజంగా పట్టగలిగిన నాడు నా నమ్మకంతో మీకు నిమిత్తం వుండదు.

—మంచు బిందువుల్ని ఆకులూ, నునుపైన పెంకులూ, గడ్డిమొక్కా పీల్చుకోవు. మట్టి పీల్చేసుకుంటుంది. అందువల్ల మట్టి నేలలమీద మంచుబిందువులు కనబడవు. గ్రామాలలో మనుష్యులూ మృగాలు తిరుగుతూండడమువల్లా, చల్లనిగాలి ప్రసరించడానికి ఇళ్ళు అడ్డుఉండడమువల్లా, వీధులు పొలాలంత చల్లబడవు. అందుచేత పొలాల్లోనూ, బహిరంగ మైదానములలోనూ 'పడి'నట్లుగా గ్రామవీథులలో మంచు పడదు.

—యోగాభ్యాసమువల్ల గరిమ, లఘిమ అనే సిద్ధులు—అనగా బరువెక్కిపోవడమూ, తేలికైపోడమూ—సాదించవచ్చునంటారు. ఎవరేనా చేసి నిరూపిస్తే గాని, అణిమ, మహిమ, గరిమ, లఘిమ, పరకాయ ప్రవేశము, ఖేచరగమనము, అదృశ్యతా, (ఇంకొకటి వుండాలి) అనే అష్టసిద్ధులు సాధ్యమేనని ఎలాగ నమ్మడము చెప్పండి?

—పుట్టంధుడికి లోకమంతా స్పర్శ, శబ్దము, వాసన, రుచులనుబట్టిమాత్రమే తెలుస్తుంది; అంటే అనుభవమౌతుంది. స్వప్నాలలో అనుభవాలూ ఆలోచనలూ చిత్ర విచిత్రంగా రంగరించుకుపోయి వస్తాయి. పుట్టంధులకు స్వప్నాలు వారి అనుభవాల రంగరింపులుగానే వుంటాయి.

—వికిరణము (*Radiation*) లేక దీప్తిగుణమువల్ల శూన్యప్రదేశము గుండా వ్యాపించగలిగినది ఉష్ణము మాత్రమే కాదు. వెలుతురూ, రేడియో తరంగాలూ, ఎక్స్- కిరణాలూ, గామా కిరణాలు కూడాను.

—రాత్రిపూట రైలు పెట్టెలలో గల లైట్లవద్దమండే రెక్కలపురుగు పెట్టె కప్పుమీద వాలినప్పుడు దానికి రైలువేగము సంక్రమించడములేదూ మరీ? ఇక మనము పెట్టెలో గెంతినట్టే అవీ గెంతిన వనుకోడములో చిక్కేమిటి? ఇక ఆ పురుగు కిటికీలోంచి బయటికి వస్తే బయటిగాలి రాపిడికి దానివేగము తగ్గి అది వెనక్కి వెళ్ళిపోయినట్లు కనబడుతుంది రైల్లోవారికి. పెట్టెలో గాలికికూడా రైలువేగమే వుండడమువల్ల ఆ పురుగుకి పెట్టెలో ఎగరడము కష్టము కాదు. దానికీ వుందిగా రైలువేగమూ? ఇక ఎగరడానికి కావలసినంత శ్రమే అది పడాలి.

—కడుపునొప్పి వచ్చినప్పుడు ఆవలింతలు అందరికీ రావు.

—బిడ్డల శీర్షోదయ కాలము గుర్తించి జాతకాలు రాయించే అలవాటు చాలా దేశాల్లో వుంది. జరగవలసినవన్నీ జరిగి తీరేటట్లయితే, జాతకము రాయించడమెందుకుగ. ఎప్పుడో రాబోయే ఆపద తలచుకు ఏడవడానికీ, పురుష ప్రయత్నము చెయ్యక గ్రహాలు బాగాలేవని గప్పాలు కొట్టడానికీ మాత్రమే జాతకాలు పనికివస్తాయి. ఇక రాబొయ్యేదానిని నివారించడానికి అవకాశము వున్నదంటే ఇహ జాతకము అసమగ్రమన్నమాటే కదా? శాస్త్రకారులు దృశాదృశ్యం అన్నారు. అయితే కావచ్చుట, లేకపోతే తప్పవచ్చుట. అయితే మరి జాతకాలు రాయసె మెందుకుటా?

—ఊళ్ళో నీరు ఉప్పనా, పొలములో నీరు తియ్యనా అన్న మాట నిజముకాదు మంచీనీరు పడేచోట ఊరు పెరుగుతుందన్న మాటే నిజమేమో?

—సీనారేకు పడవలాగ చేసి నీట్లో వెయ్యండి. తేలుతుంది. ఆ పడవే ముద్దలాగ కొట్టి నీట్లో వెయ్యండి, మునుగుతుంది. పడవ ఆకారంలో ఉన్నప్పుడు పడవ నీటిలో దిగుతూండగా తొలిగిపోయిననీరు ఎక్కువ. ఏ వస్తువేనా ఎంతనీటిని తొలగించ గలదో అంతనీటి బరువుతో ఆవస్తువుని పైకి తేల్చేస్తుంది నీరు. ఇనపముక్క తొలిగించగల నీరు తక్కువ. కనక దాన్ని తేల్చే శక్తి తక్కువే. ఇనప పడవ మునగాలంటే తొలిగిపోవలసిన నీరు ఎక్కువ. కనక దాన్ని తేల్చే శక్తీ ఎక్కువే అయి పడవని తేల్చేస్తుంది. మానవ శరీరం తొలగించగల నీరు తక్కువ. అదే శరీరం నీటిలో నాని ఉబ్బితే, అది తొలిగించగలనీరు ఎక్కువై దాన్ని తేల్చేశక్తి ఎక్కువై తేల్చేస్తుంది.

—నూతులలోని ఊటనీరు భూగర్భములోని అతి మందమైన నీటి ప్రవాహాలవల్ల ఊరుతుంది. నూతిలోనిమట్టి మొదట్లో వున్నట్టే వుండిపోతే ఆ మట్టిలోంచి నెమ్మదిగా నీరు పారుతూనే వుంటుంది. మట్టితీసి గోడ కట్టేస్తే, నీరే మిగులుతుంది. ఇది చేరగా చేరగా, నూతి అడుగుమీద నీటి ఒత్తిడి ఎక్కువై, ఆ నూతి అడుగుకంటె పల్లపులోతులకి నీరు దిగిపోతుంది. నూతిలోనికి వచ్చే నీరు వస్తూ పోయే నీరు పోతూవుండి, ఈ రెండూ సరిసమానమైపోయిన పరిస్థితిలో వుంటుంది ఏనూతిలో నీరైనా, అందుకే నిండిపోదు నుయ్యి.




'దాగుడు మూతలు —శ్రీ జనాబ్





పఠాన్ —శ్రీ వి. యస్. సంజీవ



న్యాఎలీఖాన్.

తెలంగాణా చిత్రకారుల చిత్రాలు

ఇటీవల అలంపురంలో ఆంధ్రసారస్వత పరిషత్
సభల సందర్భంలో బహుమతులు పొందిన
కొన్ని చిత్రాలు



'త్యాగ బ్రహ్మ'

—శ్రీ గడుతూరి సూర్యం.

బొమ్మరిల్లు

పేరుగొప్ప

శ్రీ కవిరావు

పల్లెలో నొక పేద
తల్లి నివసించెనా
యిల్లాలి కొక గడుసు
పిల్లవాడున్నాడు.

ఆతల్లి యొకనాడు
అన్నంబు తినుమన్న
'కాదు పెరు గన్నంబు
కావాలె' నన్నాడు.

'పేదవారికి మనకు
పెరుగెట్లు వచ్చు' నన
'ఆఁ...ఆఁ' లుసాగించి
ఆగడము చేశాడు.

"తోటివారితో మనకు
సాటి యెల్లాగురా!
కల దానితో తృప్తి
గాంచరా నాతండ్రి!"


కుఱ్ఱవాఁడు:
"దొడ్డిలో వుందిలే
తెలియదనుకొన్నావు"

తల్లి:
"చూచుకో, నీకుంటె
దాచుకొంటానటర?"

అనగానే బాలుండు
అధిక సంతోషాన
దొడ్డిలోపలి 'పెరుగు
తోట' మొక్కలు తెచ్చి,
"పెరుగున్న దిందులో
పిండిపోయు" మటంచు
గారాల అబ్బాయి
మారాము చేశాడు.
పసివాని మాటలకు
పరవశమ్మయి తల్లి
అక్కునను జేర్చుకొని
ఒక్క ముద్దెట్టుకొని,

"పేరులో ఏముంది
పిచ్చితండ్రి! వట్టి
బూటకమురా జగ
న్నాటక మ్మంతయును;
పై పటారమ్ము లో
పల లొటారము గాన
పేర్ల ఘనతకు మోస
పోవద్దు నీ వెపుడు"

అని తల్లి చెప్పగా
ఆశ్చర్యమును జెంది
అలుకమాని అతండు
అన్నంబు తిన్నాడు.



జంతుకోటిలో మానవలక్షణాలు

జంతువుల జీవితాల్లో ప్రేమ కలాపాలు ఏతీరున నడుస్తాయో యీవారం తెలుసుకొందాం.

పెళ్లి చూపులకు వెళ్లే ప్రతి పడుచుకుర్రాడూ తన వేష భాషాదులను గూర్చి ఎక్కడలేని శ్రద్ధ తీసుకొంటాడు. పెళ్లి అయిన మీదట పైపటాటోపాల విషయం అంతగా పట్టించుకోడు కానీ, వీలైనంత మటుకు తను చేపట్టిన వనితకు అండగా వుండి సంతృప్తి పరుస్తాడు. మిగిలిన జంతువులలో కూడా యించుమించు యిదే మనస్తత్వం కనిపిస్తుంది.

జంతుకోటిలో ప్రేమ కలాపాలను వర్ణిస్తూ ప్రపంచ వాఙ్మయంలో ఎందరెందరో కావ్యాలు వ్రాశారు. కానీ ఆ కావ్యాలన్నిటిలోనూ ఆ జంతువులు మనుష్యులు పోయే పోకడలే పోతాయి. మనుష్యుల దాంపత్య జీవితంలో వుండే దానికంటే, జంతువుల జీవితాల్లో ఎక్కువ హింస, ఎక్కువ వుద్రేకం యిమిడి వుంటుంది. అంతే కాదు—మనుష్యులలో ప్రేమ కలాపాలకి సమయాసమయాలు, ఋతు వ్యత్యాసాలు ఏమీ లేవు. జంతువుల్లో అల్లాకాదు.

పక్షుల్లో అయితే ప్రేమ పిలుపులు ప్రేమ పాటలతోనే ఆగిపోతాయి కానీ, చిరుత పులులు అల్లాంటి వాటి విషయంలో వాటికి ప్రేమ పుట్టుకొచ్చిందీ అంటే, ఆడ చిరుతపులీ, మొగ చిరుతపులీ కలిసి అడివి అడివి అంతటినీ దద్దరిల్లి చేస్తాయి. ఈ రెండు పులులూ సమావేశమైన చోటికి చుట్టూ నూరు నూటయాభై అడుగులలోపు వుండే చెట్లు, కొమ్మలు, పుట్టలూ అన్నీ ఇవి చేసే అల్లరికి నామరూపాలు లేకుండా పోతాయి.

అడవుల్లో బ్రతికే జంతువులు సంవత్సరం పొడుగునా వేటికది విడిగానే బ్రతుకుతూ వుంటాయి కానీ ఎప్పుడో ఏడాది కొకసారో రెండుసార్లో దాని దేహావయవాలలో ఏవో కొన్ని మార్పులు వస్తాయి. ఆ మార్పులు మూలంగానే వాటికి 'ఋతువు' వచ్చినట్లు తెలుస్తుంది. ఆ ఋతువు వచ్చేసరికి ఆడ జంతువు మొగ జంతువునీ, మొగ జంతువు ఆడ జంతువునీ వెదుక్కుంటూ పోయి, సమాగమైన మీదట మాత్రం ఏ జంతువుకా జంతువు విడిపోయి బ్రతుకుతాయి. నిజానికి ప్రకృతిలో పురుషుడు, స్త్రీ, ఎక్కువ భాగం ఒకరినొకరు అసహ్యించుకోవటమే సహజమైనట్లు కనిపిస్తుంది.

★ జంతుకోటిలో మానవలక్షణాలు ★

అడవుల్లో మొగ జంతువులు ఒకదానితో ఒకటి, ఆడజంతువు కోసం ఘోరంగా పోట్లాడుకొంటాయి. ఈపోట్లాటల్లో చాలాభాగం ఏదో ఒక మొగజంతువు చచ్చి పోవటంతో కానీ అంతం కాదు. ఋతువు దగ్గిరపడే సరికి అంతవరకు ఒంటరిగానే తిరుగుతూ యితరుల జోలికి పోని జంతువులు వున్నట్లుండి భయంకర రూపాలు దాల్చి అడ్డమొచ్చిన మృగాన్నల్లా హతమార్చేస్తాయి.

ఉత్తర అమెరికా ప్రాంతంలో నీటిలోనూ నేలమీద కూడా బ్రతికే 'మిన్క్' అనే ఒక రకం జంతువు వుంటుంది. ఇది మామూలుగా మెతకనైన మృగమే కానీ 'ఋతువు' వచ్చేసరికి దానికి ఎక్కడలేని చికాకూ పుట్టుకొస్తుంది. ఆడజంతువు కోసం వేటకు బయలుదేరుతుంది. దారిలో గనక మరొక మొగ 'మిన్క్' ఎదురైందంటే, రెండూ ఒకదాని దవడ ఒకటికరిచి పట్టుకొని గంటల తరబడి పెనుగులాడుతాయి. ఈ పెనుగులాటలో ఏ 'మిన్క్' అయితే ముందుగా దవడపట్టు వదిలితుందో అదిఅంతటితో నెత్తురుకక్కి చచ్చిందన్నమాటే! వాటి పోట్లాట అంత భయంకరంగా వుంటుంది.

మామూలుగా ఏడాది పొడుగునా మెతకగా బ్రతికే దుప్పి, దానితలమీది కొమ్ములు అతి వేగంగా ఎదగటం ఆరంభించేసరికి, ఎక్కడిలేని పౌరుషమూ తెచ్చుకొంటుంది.

పక్షుల్లో ఒక చిత్రమైన లక్షణం వుంటుంది. మొగపక్షులు ఆడ పక్షులని ఏటా ఒకేచోట కలుసుకొంటాయి. ఋతువు రాగానే ముందుగా మొగపక్షి బయలుదేరి గూడు కట్టటానికి ఏది అనువైన చోటో నిర్ణయిస్తుంది. ఆనిర్ణయం జరిగాక, మొగపక్షి ఒక చెట్టు కొమ్మమీద ఎక్కి కూర్చొని దిగంతాల వరకూ వినిపించేలాగా ప్రేమ గీతాలు ఆలపిస్తుంది. ఈప్రేమ పిలుపు మూలంగా ఆడపక్షి ఏదిశగాపోతే తనకు తగిన వరుడు లభిస్తాడో తెలుసుకోవటమే కాక, యితర మొగపక్షులకిది ఒక హెచ్చరికగా కూడా పని చేస్తుంది. ఈ హెచ్చరికను లెక్కచేయని మరొక పొగరుబోతు మొగపక్షి ఏదైనా మొదటి పక్షి ఏర్పరచుకొన్న ప్రేమరాజ్యంలో కాలు పెట్టితే, మొదటిపక్షి దాని పిలక పూడేదాకా తన్నుతుంది.

ప్రేమ పిలుపు నందుకొని ఆడపిట్ట ఏదైనా తన సీమలోకి తొంగి చూస్తే, మొగపక్షి, ఆప్రేమ మత్తులో పడి వుత్త వెర్రి వెధవలా వెకిలి వేషాలు వేస్తూ, తన ప్రజ్ఞ కనపరుచుకోవటం కోసమని లేని పోని శత్రువు లెవరో తనను ఒంటరిగా చూసి పట్టుకో వచ్చినట్లూ, తానక్కడికి మహా వీరుడై వారందరి పీచ మడించినట్లు ప్రగల్భంగా రెక్కలు ఆడించుకొంటూ యీ మూలనుంచీ ఆమూలకీ, ఆమూల నుంచీ యీమూలకీ ఎగురుతుంది.

దక్షిణ అమెరికాలో గొడుగు పక్షి అని ఒకరకం పక్షి వుంటుంది. దీనికి నెత్తిమీద గొడుగు లాంటి కుచ్చు వుండటంచేత దానికాపేరు వచ్చింది. దీనికి ఋతువు వచ్చేసరికి, అంతవరకూ గొంతు క్రింద నల్లని యీకల చాటున దాచి పెట్టుకొన్న రంగు రంగుల తిత్తి నొకదాన్ని బయటకు తీసి, సిల్కు నెక్టైపై తగిలించుకొని హుషారుగా పోతూ తిరిగే దొరగారిలాగా, ఆడపక్షుల ఆట పట్టుల వెంట తిరుగుతుంది అంతేకాదు-ఇది ఆలపించే ప్రేమ గీతం ఆమడ దూరం వినిపిస్తుందట!

కూనిరాగాలు తీసే పిట్టలని కొన్నిరకాల పిట్టలు వుంటాయి. వీటికి పొడుగాటి ముక్కు, పీలిక ల్లాంటి రెక్కలు వుంటాయి. ఈ రెక్కలను యివిఅమితమైన వేగంతో పైకి క్రిందికీ ఆడిస్తూ వుండటంచేత, అదొక రకమైన కూనిరాగం తీస్తున్నట్లు వినిపిస్తుంది. వీటిలో మొగ పక్షులు ఆడపక్షులని ఆకర్షించుకోవటం కోసం గంటకి 600 మైళ్ళ వేగంతో ఎగిరి, ఆకాశంలో పల్టీలు పిల్లి మంత్రాలు కొట్టుతూ వుంటాయి. ఆవిధంగా చేసి చేసి, ఆడపక్షి తనని మెచ్చుకొంటున్న దని తోచినమీదట దాని దగ్గరకు చేరుతుంది.

కొంగల సరసం యింకా బాగుంటుంది. రెండు కొంగలూ ఒకదాని కొకటి ఎదురు బొదురుగా నిలబడి ఒకదాని ముక్కుపుటంతో రెండో దాని ముక్కుపుటాన్ని రాపాడుతాయి. కొంగల వుద్రేకాలు పెరిగినకొద్దీ యీ ముక్కుల రాపిడి శృతి పెరిగి పోతుంది.

పావురాలుజంట చేసే ప్రణయ కలాపంలో ఒకదాని మెడ ఒకటి కౌగలించుకోవటం, హత్తుకోవటం, ఒకదాని ముక్కుపుటాలను యింకొకటి తనముక్కుపుటాల బలవంతంగా తెరవటం యిలాం ఎన్నో ఘట్టాలు వుంటాయి.

(ఇంకా

అల్లరి మాన్పించిన పెట్టె



శ్రీ జి. వి. జి. కృష్ణ

సూళ్లూరు పేట బోర్డు హైస్కూల్‌లో శివరామయ్యగారనే మేస్టారు పనిచేస్తూండే వారు. ఆయనకు లేక లేక కల్గిన కొడుకు వేణు.

వేణూకి ఏడేనిమి దేళ్లుంటాయ్. ఇంట్లో ఎప్పుడూ ఏదో ఒక అల్లరి చేస్తూంటాడు. వాడి చేతులూ కాళ్లూ ఒక్క క్షణమైనా వూరికే వుండవు.

సైకిల్ ట్యూబ్లలోనించి వాళ్ల నాన్న గాలి తీసెయ్యడం ఎన్నడో చూశాడు వేణు. ఒకనాడు వాళ్ల నాన్న ఏదో అర్జంటు పనిమీద బయటికి వెళ్లటానికి సైకిల్‌ను చూసుకుంటే, రెండు ట్యూబ్లలోనూ గాలి ఖాళీ! ఇక అంతే- వేణూ గాడి వీపు విమానంమోత మోగిపోయింది.

ఎన్ని దెబ్బలు తగిలినా, వేణూ మాత్రం వాడి చిలిపిచేష్టలు మానలేదు! ఇంకోరోజు వాళ్లనాన్న ఎవరో స్నేహితుడి ఇంటికి వేణూని పిల్చుకుని వెళ్లి, ఆ స్నేహితుడితో మాట్లాడుతూ కూర్చొనివుంటే, వేణూ ఎప్పుడు వెళ్లాడో ఏమో కానీ- అక్కడ మేజామీద ఓ గడియారం వుంటే దాన్ని కాస్తా తిప్పి తిప్పి చెడగొట్టేశాడు ఆ వేళ వేణూని కొట్టినట్లు, వాళ్లనాన్న ఏస్కూలులోనూ ఏ విద్యార్థిని కొట్టలేదు.

ఏదయినా కొత్తవస్తువు వేణూ కళ్ల పడిందంటే చాలు, అదేమిటో, లోపల ఏముందో పరీక్ష చేసి, దాన్ని ఏదో ఒహాటి చేసేంత వరకూ నిద్రపట్టేది కాదు వేణూకి.

ఎండాకాలం శెలవల్లో వేణూ వాళ్లనాన్న సంసార సమేతంగా మద్రాసుకు బయలుదేరి వచ్చారు. పనిలో పనిగా ఒకరోజు సినిమా షూటింగు చూడటానికి, ఏదో ఓ స్టూడియోకు భార్యనూ కొడుకునూ పిలుచుకొని వెళ్లారు, శివరామయ్యగారు.

ఆరోజు ఆ సెట్‌లో ఎవరో ఒక మంత్రగాడి సీను షూట్ చేయబోతూన్నారు. ఆ మంత్రగాడు చక్కగా ముస్తాబై, నిలువుటద్దం ముందు నిలుచొని మీసమూ గడ్డమూ ఓమారు సవరించుకొని, మూలనున్న "ఓ పెద్ద పెట్టెవద్దకు వెళ్ళి రాజకుమారీ!...ఇప్పటికైనా నన్ను పెళ్లాడటానికి ఒప్పుకో. తక్షణమే నిన్ను బందిఖానా నించి విడుదల చేయిస్తా. నన్ను పెళ్ళాడి సుఖంగా వుండొచ్చు ఏమంటావు, బుల్ బుల్?" అని అడుగుతాడు. ఆ పెట్టె నించి ఏ జవాబూ రాదు.

జవాబు ఎందుకు రాదంటే, ఆ క్రితం రాత్రే కథానాయకుడు మాయపల్లకిలో దొంగతనంగా అక్కడికి మారువేషంలో వచ్చి, రాజకుమారిని ఆ పెట్టెలోనించి విడిపించి, తనతో కూడా తీసుకొని వెళ్ళిపోతాడు. ఆ సంగతి యీ మంత్రగాడికి యింతవరకూ తెలియదు.

ఇప్పుడు, ఎంతసేపటికీ పెట్టె నించి జవాబు రాకపోయేసరికి, ఆ మంత్రగాడు విసుగెత్తి కోపంతో "ఏయ్ ధగిడీ!...బదు లివ్వవేమే?" నని దిఢీలున ఆ పెట్టె తెరుస్తాడు. అందులో రాజకుమారి వుండదు. మంత్రగాడు తెల్లబోయి కోపంతో పళ్లు పటపటా కొరుకుతాడు. అంతే- అంతటితో ఆ షాట్ ఐపోతుంది. అదే వాళ్లు ఆ వేళ షూట్ చేయబోతున్న దృశ్యం.

షాటుకు అంతా సిద్ధం చేసుకుంటున్నారు. ఓ వైపున డైరెక్టరు గారు ఆ మంత్రగాడి పాత్రధారి చేత డైలాగులు రిహార్సు చేయిస్తూంటే, మరోవైపున కామెరా



మెన్ ఆమంత్రగాడి డ్రస్సింగ్ టేబిల్ మీద లైటింగ్ అరేంజి చేస్తున్నాడు.

కంటిమీద రెప్ప వాల్చకుండా అందరూ ఆ సెట్ వంక గుడ్లప్పగించి చూస్తూంటే, మన వేణుమాత్రం తాను రిపేర్ చేయటానికి, కొత్త వస్తువులు అక్కడ ఏమైనా వున్నాయేమోనని అటూ ఇటూ గాలిస్తున్నాడు. కొద్ది దూరంలో ఓమూల ఓ పెద్ద పెట్టె కనిపించింది.

అందరూ షూటింగులో మునిగిపోయి వుండటం చూసి, వేణూ, యిదే మంచి సమయమని మెల్ల మెల్లగా అడుగులు వేస్కూంటూ ఆ పెట్టె దగ్గరికి ఖెళ్ళి, అలా చూశాడు. ఆ పెట్టెమీద అంతటా సిగరెట్ పెట్టెలలో వుండే, కాకి బంగారపు కాగితాలతో తమాషాగా అంటించి పెట్టారు.

ఎవరైనా చూస్తున్నారేమోనని ఓమారు ఇటూ అటూ చూసి, తర్వాత మెల్లగా పెట్టె తెరిచాడు అందులోనూ ఏమీలేదు. వేణూ నిరాశతో పెద్దగా నిట్టూర్చాడు.

ఏం చేయటానికీ తోచక, ఆలోచనలో పడిపోయాడు. ఏదో ఒహ చిలిపిచేష్ట చేయనిదే, అక్కడ్నించి కదలటానికి మన సొప్పదు. అంచేత నోరు పెద్దగా తెరిచి ఆవులిస్తూ, వెనక్కి తిరిగి అమ్మానాయనకేసి చూశాడు. వాళ్లు తదేక దృష్టితో సెట్టువంక చూస్తున్నారు.

ఉన్నట్లుండి వేణూ బుల్లిబుర్రలో చప్పున ఒక ఆలోచన మెరిసింది- తనకోసం అమ్మా నాన్నా వెతుక్కునేటట్లు చేసి, వాళ్లను కాసేపు ఎందుకు ఏడ్పించకూడదూ అని!

అనుకోవటమే తరువాయిగా, చెంగున ఆ పెట్టిలో కెగిరి కూర్చుని, రపీమని తలుపు మూసుకున్నాడు. ఆ అదురుకు ఆ పెట్టెమీది గొళ్లెం కాస్తా పడిపోయింది.

పావుగంటయింది ... అర్థగంటయింది... వేణు కాళ్లు ముడుచుకొని ఆ పెట్టిలో ఆలాగే కూర్చొనున్నాడు. లోపలంతా చీకటి. గాలి ఆడక ఉక్కిరి బిక్కిరైపోతున్నాడు. ఆ పెట్టెవద్దకు ఎంతసేపటికీ, ఎవ్వరూ రాకపొయ్యేసరికి వేణూకు విసుగుపుట్టి, తనకోసం వాళ్లక్కడ వెదుక్కుంటున్నారో లేదో తమాషా చూడటానికి పెట్టె తెరవబోయాడు. కానీ తలుపు వస్తే

(41-వ పేజీ చూడండి)



సుందరి

అనగనగనగా కాంచనపురంలో ధనగుప్తుడనే వర్తకుడొకడుండేవాడు. అతనికి కలిగిన సంతానం ఆరుగురు. వారిలో మొదటి ముగ్గురు కొడుకులు. మిగిలిన ముగ్గురు కుమార్తెలు.

ధనగుప్తుడు కాంచనపురంలో ఉన్న వర్తకులందరిలోను గొప్ప ఐశ్వర్యవంతుడని పేరు పొందాడు. అంతేకాక చిన్నప్పటి నించీ చాలా కష్టపడి చదువుకున్నవాడు. అందుచేత తన పిల్లలందరికీ మొదటి నించీ చాలా జాగ్రత్తగా చదువు చెప్పించాడు.

ఆడపిల్లలందరు చక్కని చుక్కలే. అందులోను ఆఖరిపిల్ల సాక్షాత్తూ అప్సరసే. చూసిన వాళ్లంతా ఆ అమ్మాయిని 'సుందరీ!' అని పిలిచేవారు. వయస్సు వచ్చిన కొద్దీ ఆ సుందరిని చూసిన జనం అంతా కాంచనపురంలో ఇహ ఇంతటి అందగత్తె లేదని అనుకుని ఆశ్చర్యపోతూండేవారు. చివరికి కొంత కాలానికి ఆమె పేరే 'సుందరి'గా మారిపోయింది. సుందరి అందరికీ అల్లారు ముద్దుగా పెరిగి పెద్దదైంది. క్రమంగా ఆమె పేరు ఆ దేశంలో నాలుగు మూలలా వ్యాపించింది. ఆమె గొప్ప అందగత్తె అని పేరు మోసిన కొద్దీ అక్కలిద్దరికీ సుందరి మీద అసూయ పెరగడం ప్రారంభించింది.

అందంలోనే కాక గుణాల్లో కూడా సుందరి అక్కలిద్దరినీ

[illegible]

మించింది. వారిద్దరు తమ ఐశ్వర్యం తలుచుకుని మురిసిపోతూ కన్నూ మిన్నూ కానకుండా తిరుగుతూండేవారు. ఇరుగుపొరుగు వాళ్లమ్మాయిలెవరయినా చూడడానికి వస్తే 'బొత్తిగా తీరిక లేదమ్మా' అని చెప్పి తిరగగొడుతూ ఒంటిపిల్లి రాకాసుల్లా ఉండేవారు. నగలతో తులతూగుతూన్న వాళ్లెవళ్లైనా వస్తే ఎల్లాగోల్లాగ కొంచెం కళ్లెత్తి వారికేసి చూసేవారు. పొద్దస్తమానము పేరంటాల్లోను, విందుల్లోను, వినోదాల్లోను మునిగి తేలుతూ. చెల్లెల్ని దూరదూరంగా తరిమి వేసేవారు.

సుందరి ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం పుచ్చుకుని చదువుకుంటూ ఉండేది. ఇది చూసిన కొద్దీ అక్కలిద్దరికీ బాగా గుర్రగా ఉండేది. అందుచేత ఆమెను వెక్కిరించి వెళాకోళా లాడుతూ హేళన చేస్తూండే వారు.

క్రమంగా ఈ ఆడపిల్లలందరికీ పెద్ద పెద్ద పెళ్లి సంబంధాలు వస్తూండేవి. ఎంత పెద్ద సంబంధం వచ్చినా పెద్దపిల్లలిద్దరు కొండెక్కి కూర్చుని, రాజకుమారులెవరో దిగి వచ్చేదాకా పెళ్లాడమని మూతి బిగించుకునే వారు. చిన్నపిల్ల మాత్రం పెళ్లిమాట వచ్చేసరికి సిగ్గుపడుతూ "ఇంత చిన్నతనంలో అప్పుడే పెళ్లేమిటి? నా చదువంతా పాడైపోతుంది బాబూ!" అని చెప్పి వాళ్ల మాటలు విని విననట్లుగా మాట్లాడకూరుకునేది. అస్తమానము తండ్రి వెంట వెంటనే తిరుగుతూ జాగ్రత్తగా చదువుకుంటూండేది.

ధనగుప్తుడు ఓడలమీద విదేశాలతో వర్తకం చేస్తూ క్రమంక్రమంగా కోటికి పడగెత్తాడు. కాని హఠాత్తుగా అతనికొక పెద్ద ఆపత్తు వచ్చింది. ఒకసారి, సముద్రంలో



పెద్ద తుపానువచ్చి అతని ఓడలన్నీ మునిగిపోయాయనీ, సరుకంతా సముద్రంలో మునిగిపోయిందనీ వార్త వచ్చింది. పాపం అతను గడించిన డబ్బంతా పూర్తిగా నష్టపోయాడు. అప్పులవాళ్లు వచ్చి మాఅప్పు తీర్చేదాకా గుమ్మం కదలమని గుండెలమీద కూర్చున్నారు. చివరికి ధనగుప్తుడు తన ఆస్తిఅంతా అమ్మివేసి ఎల్లాగో అల్లాగ ఆ అప్పులలోనించి ఇవతల పడ్డాడు. ఇంక అతనికి మిగిలిందల్లా ఒక పల్లెలో ఉన్న పూరిగుడిసె మాత్రమే. ధనగుప్తుడి కుటుంబం ఇక దిక్కులేక తలదాచుకోడానికి ఆపల్లెటూరు జేరుకున్నారు.

ఒకనాడు ఉదయం తండ్రి పిల్లలందరినీ దగ్గిరికి పిలిచాడు. వారందరు అతనిచుట్టు మూగారు. పాపం! ధనగుప్తుడేదో చెప్పబోయాడు గాని అతనికి నోటమ్మట మాటరాలేదు. కన్నీళ్లు అదే ధారగా ప్రవహించడం మొదలుపెట్టాయి.

చివరికి ఎల్లాగో అల్లాగ ధైర్యం చిక్కబట్టి పిల్లలకేసి చూస్తూ "మన ఓడలన్ని సముద్రంలో మునిగిపోయాయి. ఆస్తి అంతా అప్పులవాళ్ల పాలైపోయింది. ఇంక మనమే ఎల్లాగో అల్లాగ కష్టపడి ఏ వ్యవసాయమో చేసుకుంటూ ఈగుడిసెలో తల దాచుకొని బతకాలి. మనకింతకంటె వేరే ఆధారమేమీ లేదు." అన్నాడు.

మొగపిల్లలు "సరే! అల్లాగే కష్టపడదాం! ఏం జేస్తాం మరి!" అన్నారు.

ఆడపిల్లల్లో పెద్దవాళ్లిద్దరు "సరి! సరి! మేమెప్పుడైనా ఇల్లాంటి పనులు చేశామా! ఏమన్నావా! ఈ మోటుపనులు మేం చెయ్యలేం బాబూ!" అని మూతి ముడుచుకున్నారు. లోలోపల వాళ్లిద్దరు "ఏజమీందారీ సంబంధమో వస్తే హాయిగా అత్తారింటికి వెళ్ళి సుఖపడవచ్చును. దానితో ఈశని అంతా ఒక్కసారిగా విరగడైపోతుంది" అని కలలు కంటూండే వాళ్లు.

అయితే ఉన్న ఐశ్వర్యం కాస్తా హరించుకు పోయేసరికి జమీందార్లెవరూ వీళ్ల మొహాలకేసైనా చూసేవాళ్లు కారు. పైపెచ్చు పెద్దపిల్లలిద్దర్ని చూసి "తండ్రి దగ్గర కాస్త డబ్బు జేరేసరికి ఇక ఒళ్లుపైన తెలియకుండా తిరుగుతూండే వాళ్లులే! ఇక వీళ్లరోగం చప్పగా కుదిరిపోతుంది. ఇక్కడినించి పేడ తట్టలుమోస్తూ పిడక లమ్ముకుని బతకవలిసిందే!" అని చంకలు కొట్టుకున్నారు.

కాని సుందరి కష్టాలు చూస్తూంటే అందరికీ జాలిగానే

(42-ఎ పేజీ చూడండి)

ఆ రాత్రి



శ్రీ ఐ. సూర్యనారాయణ

సాయంకాలమైంది. అందరమూ ఇంటికి చేరుకొంటున్నాము. ఇంటికి చేరగానే ఇంట్లో హడావుడి జరుగుతోంది. ఏమిటా అని చూద్దును కదా - సినిమాకు పంపించమని చెల్లి గోలచేస్తోంది.

"రోజూ సినిమాల కెళ్లడానికి డబ్బు లెక్కడున్నాయే?" అని అమ్మ కసిరికొడుతూంది.

"రోజూ ఎక్కడే వెళ్తె? వెళ్ళి నెలపైగా అయింది" అంది చెల్లాయి.

"నిన్న కృష్ణుడు, మొన్న అన్నయ్యా, ఇవాళ నువ్వు! ఇంత మందికీ రోజూ ఎక్కడనుంచి డబ్బులు ఇవ్వగలను?" అంది అమ్మ.

"అయితే! వాళ్ళకెందుకిచ్చావు?" అని చెల్లాయి ఎదురు ప్రశ్న వేసింది.

"ఛా! ఊరుకో. వాళ్ళు పెద్దవాళ్లు. వాళ్లకీ నీకూ ఒకటే? ఊరుకో. లేకపోతే రెండు వేయగలను!" అనేసరికి చెల్లాయి ఊరుకొంది.

ఆ రాత్రి అది భోజనం మానేసింది. నాన్నగారు ఎంత ప్రతిమాలినా లొంగలేదు. చివరకు విసుగెత్తి నాన్నగారు కూడా రెండు దెబ్బలు వేశారు. దాంతో అన్నయ్య మండిపడి "పోతే పోయింది వెధవ డబ్బు! సినిమాకు పంపించకూడదూ-యింతలాగ ఏడిపంచకపోతే? ఇంతమంది వెళ్తుంటే దీని కొక్కర్తికే నేమిటీ వచ్చింది?" అన్నాడు.

"ఆ! కూర్చున్నాయిరా, డబ్బులు! నీకెందుకు వూరుకో!" అంది అమ్మ.


రాత్రి పన్నెండు దాటింది. చెల్లాయి ఇంకా మూలుగుతూనేవుంది. ఉన్నట్లుండి ఒక్క కేక వేసి అమ్మమీద పడిపోయింది.

"ఏమిటే" అని అమ్మ త్రుల్లిపడి లేచింది.

"అమ్మా! పామే!!" అంది చెల్లాయి

"ఏదీ? ఎక్కడే?"

"అదిగోనే; నామంచం క్రింద!"



"అమ్మో నా తల్లీ, నిజమేనే! చచ్చామురా దేవుడా. ఇదెక్కడి గొడవరా నాయనా" అంటూ కేక లేస్తోంది అమ్మ. ఆ కేకలకి మా నాన్నారు లేచిపోయి "ఏమిటే! అర్ధరాత్రయినా పడుకోక ఆ కొండ కేకలు?" అన్నారు.

"కొండ కేక లేమిటండీ; ఆ మంచం క్రింద పాము దూరేను?" అంది అమ్మ. దాంతో నాన్నారు "ఏదీ! ఎక్కడ! ఇపుడే చంపేస్తాను" అంటూ గాభరాగా మంచంమీద నుంచి లేచారు.

"మీరుండండి. అదే విషపు పామో ఏమిటో: ప్రక్కింటి బ్రహ్మయ్య గారిని లేపండి" అని అమ్మ అనేసరికి, నాన్నగారు చల్లబడి ప్రక్కింటి బ్రహ్మయ్యగారిని లేపారు.

ఈ గొడవకి మా నాయనమ్మ కూడా నిద్రలేచింది: "ఈయింట్లో ఏముహూర్తాన్న దిగామోగాని,-భగవంతుడా! - నిన్న తేలు, ఇవాళ పాము! ఇంక రేపేమిటో? రామ రామ! నేనీ యింట్లో వుండను. ఇల్లు మార్చేరా బాబూ అంటే మార్చావు కద!" అని ఇక వరస మొదలెట్టింది. దాంతో నాన్నగారికి వళ్లు మండి "నువ్వూరుకో అమ్మా" అన్నారు.

"అవును! నామాట ఎపుడు విన్నావు గనుక! వింటే యిలా గుండేదా? అంతా నా ఖర్మేగాని! నేను వెళ్ళిపోయినతర్వాత గాని తెలియదులే" అంటూ మా నాయనమ్మ సాధింపు లంకించుకుంది.

"ఇపుడెందుకండీ - అంతలేసి మాటలనడం? మీరూరుకోండి" అని మాఅమ్మ అనేసరికి ఆవిడ శాంతించింది.

ఇంతలో బ్రహ్మయ్యగారు పెద్ద కర్ర పట్టుకొచ్చారు. "ఏదీ! ఎక్కడుందండీ? పామును చూసి యింత గాభరాపడతా రేం? నల్లిని నలిపినట్లు నలిపి పారేస్తాను" అని మొదలెట్టారు.

"అయ్యయ్యో! ఖర్మ ఇంట్లోనే చంపుతా రేమిట్రా?" అని నాయనమ్మఅందుకుంది మళ్ళీ.

"ఇంట్లో కాకపోతే, పాముని వీధిలోకి పిలుచుకుపోయి చంపుతామా ఏమిటే? నువ్వూరుకో వే" అని నాన్న విసుక్కున్నారు.

ఇంతలోనే కృష్ణుడు "నాన్నోయ్! పాము విషం క్రక్కుతోంది" అన్నాడు. అందరం ఆశ్చర్య పడ్డాం. అందరి గుండెలు దడదడ కొట్టుకో సాగినై.

"వేగిరం చంపండీ; బ్రహ్మయ్యగారూ" అని నాన్న అన్నారు.

"అవునండోయ్! నిజమే విషం కక్కుతోందండోయ్!" అన్నారు బ్రహ్మయ్యగారు కొట్టకుండనే. "ఇంతసేపట్నుంచీ అది కదిలినట్లే లేదు. అసలు అది పాము కాదేమో" అన్నారు నాన్న, సందేహిస్తూ.

"అయ్యో! కాకపోవడమేమిటీ? ముసలి పామండీ! కదలకపోతే చచ్చిపోయిందని అవతల పారేస్తామని వేషాలు వేస్తోంది-వెధవ వేషాలు!! అదంతా నటన సుమండీ! మీరేమీ భయపడకండి. దీనూసు నాకు వదలేయండి" అన్నారు బ్రహ్మయ్యగారు, కర్ర గాలిలో తిప్పుతూ. మాకు గుండెలు పీచు మంటున్నై, ఏక్షణంలో అది కదుల్తుందోనని.

ఇంతలో అన్నయ్య లేచిపోయి "ఏమిట్రా ఫూల్స్! అర్ధరాత్రయినా పడుకోరు. ఇడియట్స్" అంటూ చరచరా గదిలోకి వచ్చేసి, చెల్లి మంచమెక్కి కూర్చున్నాడు.

"అయ్యో నాయనా! పామురా!! లేవురా-అక్కడ నుంచీ!" అనిఅమ్మ లబోదిబోమంది.

ఆ కేకతో "ఎక్కడే పామెక్కడే?" అని కేకేసి ఎగిరి గంతేశాడన్నయ్య. ఆ ఊపులో చెల్లాయిని ఢీకొనేసరికి అది క్రింద

"చూడు సరోజా! ఈవేళ నీపుట్టిన రోజు పండుగ అన్న విషయం నేను మరచిపోయానని అనుకొంటున్నావేమో! ఇదుగో నీకోసం యీ నెక్లేస్ కొనుక్కొచ్చాను."

"నెక్లేస్ కొనుక్కొచ్చారా?- కొత్తకారు కొనిపెట్టుతామని మాట యిచ్చారు: మరచిపోయారా?"

"ఎబ్బే లేదు! కానీ నకిలీ కారులు అమ్మే వాడెవ్వడూ కనిపించలేదు. అందుకనీ..."

ఆ రాత్రి

'డి ఏడుపు లంకించుకొంది. చూస్తారేం" అంటారు నాన్నారు.
'చంపండి బ్రహ్మయ్యగారూ! "వద్దండి బ్రహ్మయ్యగారూ"

అంటుంది నాయనమ్మ.

ఆ బ్రహ్మయ్యగారు కొట్టరు. పాము కదలదు. మమ్మల్ని భయం పీక్కుతింటున్నది. ఇంతలోకే అన్నయ్య ఫక్కున నవ్వేడు. "ఏమిట్రా వెధవా. చస్తుంటే సంధి మంత్రంలాగ నవ్వుతావేం?" అన్నారు నాన్నగారు.

"అది కాదు నాన్నారూ! అది పాము కాదు. సాయంత్రం నేనక్కడ నారపీచు పడేశాను" అంటూ దాన్ని చేతితో యివతలికి తీశాడు.

"నేననుకొన్నంతపనీ అయింది. 'తీసేయరా నాయనా! ఎవళ్లేనా పామనుకుంటారు' అని అప్పుడే అంటే తీశావు కాదు" అంది అమ్మ.

"ముందే ఎందుకు ఏడవలేదు ఈముక్క" అని నాన్నారు విసుక్కున్నారు. "ముందు చూడగానే నాకూ భయమేసిందండీ. ఆ భయంలో యీమాటే జ్ఞాపకం రాలేదు" అన్నది అమ్మ. "అయితే అది ఏమిటి - ఆ మడుగు?" అన్నారు నాన్నారు.

"అదా! అది చెల్లాయి పోసింది నాన్నా!" అన్నాడు కృష్ణుడు.

"అరె! మీ తస్సా చెక్కా! ఎంతపని చేశారురా?" అని చెమట తుడ్చుకుంటూ బైట పడ్డారు బ్రహ్మయ్యగారు.

అప్పటికి తెల్లవారుఝాము 4 గం॥ లయింది. ఎవళ్లకీ నిద్రలేదు. అందరూ కలిసి చెల్లాయిని తిట్టారు. దానికావేళ తిట్ల రోజయింది. ఆ రాత్రి తలచుకుంటే నాకిప్పటికీ నవ్వువస్తూంటుంది.

★

★ అల్లరిమాన్పించిన పెట్టె ★

(35-వ పేజీ తరువాయి)

కదూ? పైన గొళ్లెం పడిపోయిన సంగతి వేణూకు తెలియదాయె! వాడికి ఎక్కడలేని గాభరా పుట్టుకొచ్చేసింది. ముచ్చెమటలు పోసినై. "అమ్మో వ్...నాయనోవ్" అని ఆపెట్టెనుంచే అరవటం మొదలెట్టాడు. అక్కడ దగ్గర ఎవరైనా వుంటేగా వేణూగోడు వినేందుకు? షూటింగ్ సందడిలో ఎక్కడో దూరంగా వున్నవారికీ, ఇక్కడ పెట్టెలోంచి, వేణూ పెట్టే కేకలు ఎలా వినపడ్తాయ్?

కొద్దిసేపటికి అక్కడ వేణూ కనిపించక వాళ్లమ్మా, నాన్నా దిగులుపడి అక్కడంతా వెదకటం మొదలెట్టారు. అక్కడెక్కడా కూడా వేణూకనిపించకపోయేసరికి, వాళ్లకు ఎక్కడలేనిభయంవేసింది. వాళ్లు ఎవరి సలహాకూడదనో, స్టూడియో ఆఫీసువద్దకు గబగబా వెళ్లి, అక్కడి టెలిఫోన్ ద్వారా పోలీసు స్టేషనుల కన్నిటికీ రిపోర్ట్ యిచ్చారు. అక్కడ్నించే పత్రికా కార్యాలయాలకు కూడా ప్రకటనలు పంపించారు-ఇలా ఎనిమిదేళ్ల బ్బాయ్, వేణూ అనేవాడు, తప్పించుకు పోయాడనీ, ప్రింటెడ్ లినెన్ బుష్‌కోట్, పైజామా తొడుక్కొని వుంటాడనీ, కుడిబుగ్గమీద పెద్ద మచ్చవుంటుందనీ, దొరికినవారికి నూటపదహార్లు బహుమతి యిస్తామనీ!

శివరామయ్యగారు అన్ని పత్రికలకూ ప్రకటనలు పంపించిన తర్వాత ఆస్టూడియోలో అంతా వెదకటానికి బయలుదేరారు. వేణూవాళ్లమ్మ ఏడుస్తూ ఆయనతో కూడా తిరుగుతోంది.

ఇక్కడ పెట్టెలో అరిచీ అరిచీ వేణూగొంతు నొప్పెట్టుకుంది. దభదభా పెట్టెను గుద్ది శబ్దం చేద్దామనుకున్నాడు. కాని ఇరుకుగా వుంది. కాళ్ల సందులలో ముడుచుకొని వున్న చేతులను విడిపించుకోలేకపోయాడు. కాస్సేపటికి వేణూ బాగా అలిసిపోయి, ఆచీకటి పెట్టెలో వెక్కి వెక్కి ఏడుస్తూ, కొద్దిసేపటికి అలానే కళ్లు మూశాడు.

అక్కడ సెట్టులో - ఆమంత్రగాడు డ్రెస్సింగ్ టేబిల్ ముందు ముస్తాబు చేసుకునే పాటు అయిపోయింది. ఇప్పుడు ఆ మంత్రగాడు ఇక్కడ మూలనున్న [వేణూ వున్న] పెట్టెవద్దకు వచ్చి డైలాగులు చెప్పాలి.

"ఆల్ లైట్స్ ఆన్" అని అరిచాడు కామెరామెన్.

"సైలెన్స్ - ఏస్ ... టేక్" అన్నాడు డైరెక్టరు.

కామెరా స్విచ్ ఆన్ ఐంది. మంత్రగాడు మీసం తిప్పుతూ, దర్జాగా అడుగులు వేస్కుంటూ ఆపెట్టెవద్దకువచ్చి, బొంగురు గొంతుకతో "రాజకుమారీ! ఇప్పటికైనా నన్ను పెళ్లాడ్తానను...తక్షణమే నిన్ను బందిఖానానించి విడుదల చేస్తా. నన్ను పెళ్లాడి సుఖంగా వుండొచ్చు! ఏమంటావు నా బుల్ బుల్?" అన్నాడు.

ఆపెట్టెనించీ జవాబు రాకపోయేసరికి, ఆమంత్రగాడు కోపంతో "ఏయ్ ధగిడీ... నామాటకు బదులివ్వవేమే?" అని తటాలున పెట్టెను అలా తెరిచాడో లేదో, "అమ్మా" అని గావుకేకలు పెట్టుతూ పెట్టెలోనుంచీ ఊడిపడ్డాడు వేణు ఏమీ వుండదనుకొన్న పెట్టెనుంచీ అమాంతంగా ఏదో ఎగిరి దూకటం చూసి, ఆమంత్రగాడి పాత్ర వేసిన ఆయన, తనమీద దూకింది ఏభూతమో దయ్యమోనని భీతిల్లి, స్పృహతప్పి అక్కడే మూర్ఛపడిపోయాడు.

డైరెక్టర్ "కట్ కట్" అని పొలికేక పెట్టాడు. కామెరామెన్ "లైట్స్ ఆఫ్" "లైట్స్ ఆఫ్" అన్నాడు. కామెరా స్విచ్ ఆఫ్ అయింది. ఆపాటు చెడి అంతా రసాభాస అయిపోయింది. సెట్‌లో కలవరం బయలుదేరింది. కొంతమంది ఆ మాంత్రికుని పాత్రధారి వద్దకు గలగలా పరుగెత్తుకొని వచ్చి, అతని మొహం మీద నీళ్లు చల్లి శైత్యోపచారాలు చేయటం మొదలెట్టారు.

కొందరు వేణూవంక తెల్లబోతూ చూస్తున్నారు. కళ్లవెంబడి నీళ్లు కారుస్తూ అక్కడ అమ్మా నాన్నకోసం చూస్తున్న వేణూ దగ్గరికి, డైరెక్టర్‌గారు వెళ్లి "ఆపెట్టెలోకి ఎలా వెళ్లావబ్బాయ్" అని అడిగారు. "అమ్మా! అమ్మా!" అని ఏడవటం తప్పించి, ఇంకేమీ చెప్పలేక పోయాడు వేణు.

ఈసంగతి అప్పుడే ఆ స్టూడియోలో అంతటా వ్యాపించి పోయింది. ఎక్కడో ఆ స్టూడియోలో మారుమూల, ఏడుస్తూ వేణూ

★ సుందరి ★

(37-వ పేజీ తరువాయి)

ఉండేది. ఆమె ఇబ్బందులు పడుతూంటే చూసిన వాళ్లందరికీ కళ్లు చెమ్మగిలేవి. కొంతమంది జమీందారులు ముందుకువచ్చి ఆమెను వివాహం చేసుకోవాలని ఉవ్విళ్లూరారు. అయినా సుందరి ససేమిరా అని చెప్పి తండ్రికిఅన్నిపనులలోను ఆసరాగా ఉంటూండేది. పాపం సుందరి మొట్టమొదట తనకువచ్చిన కష్టాలు భరించలేక కళ్లమ్మట నీళ్లు పెట్టుకొనేది. కాని కొంత కాలానికి "కళ్లమ్మట నీళ్లు పెట్టుకుని లోలోపల కుములుతూ కూర్చుంటే ఏమి లాభం! ఎల్లాగో అల్లాగ ఉన్న దానితో తృప్తిపడి సుఖంగా కాలక్షేపం చెయ్యాలి." అని సమాధాన పడింది. అప్పటినించి తండ్రికి అనేకవిధాల సాయపడుతూ ఎంతో సంతోషంగా కాలక్షేపం చేస్తూండేది.

ఆపల్లెటూరికి మారినప్పటినించీ ధనగుప్తుడి కొడుకులు ముగ్గురు తమ ఇంటిదగ్గిర ఉన్న పొలం అంతా దున్ని అన్ని ఫలవృక్షాలు గల ఒక పెద్దతోట పెంచారు. పొద్దున్న, సాయంత్రం ఆతోటలోని ఫలవృక్షాలకన్నింటికి ఏతాంతోలి నీరు పెట్టేవారు.

సుందరి ప్రతిరోజూ తెల్లవారగట్లే లేచి ఇల్లంతా తుడిచి శుభ్రం చేసి తండ్రికి, అన్నలకు, అక్కలకు ఎంతో ఆప్యాయంగా అన్నం వండి పెట్టి, విసుక్కోకుండా పని అంతా తానొకర్తే చేస్తూండేది. అంతగా అలవాటు లేకపోవడం మూలాన్ని మొదట్లో ఆమెకిది అంతా కొంత కష్టంగానే ఉండేది గాని అలవాటయినకొద్దీ అదే హాయి అనిపించింది.

ఇల్లాగ ఇంటిపని అంతా పూర్తి చేసిన తరవాత మధ్యాహ్నం తీరికగా ఉన్నప్పుడు చదువుకుంటూ కాలక్షేపం చేసేది.

ఇంక అక్కలిద్దరికీ మరి ఆ పల్లెటూళ్లో కాలక్షేపం అయ్యేదే కాదు. అసలు లేవడమే పొద్దున్న పదిగంటలకి లేచేవారు. ఆపైన ఆవలించడం ఒక అరగంట పట్టేది! లేచి కాస్త అటూ ఇటూ తిరిగేసరికి అలిసిపోయి మళ్లీ తమ పరుపులమీదే కూలబడిపోయేవారు. మధ్యాహ్నం అంతా గుర్రుపెట్టి నిద్రపోయి, సాయంత్రం అయ్యేసరికి తోటలో ఒక చెట్టుకింద కూర్చుని తమకింక నగలు, సిలుకు చీరలు లేవుగదా అని ఆలోచిస్తూ దిగులుగా ఉండేవారు. చెల్లెలు ఉన్నవాటితోనే తృప్తిపడి సుఖంగా ఉండడంచూసి రుసరుసలాడుతూ ఆమె కంటబడేసరికి పెడమొహం పెట్టుకొని కూర్చునేవారు. అస్తమానమూ అయినదానికీ కానిదానికీ ఆమెను సాధించిపోస్తూ ఊరికే ఉత్త పుణ్యానికి శాపనార్థాలు పెడుతూండేవారు. ఇన్ని చేసినా సుందరి ఏమీ అనక నెమ్మదిగా తనపని తను చేసుకుపోతూండేది.

ఇల్లాగ ఆ పల్లెటూళ్లో ఒక సంవత్సరం గడిచిపోయింది. ఒకనాడు హఠాత్తుగా ధనగుప్తుడికి ఒక ఉత్తరం వచ్చింది. ఆఉత్తరం చదివేసరికి అతనికెంతో ఉత్సాహం కలిగింది. మునిగిపోయాయనుకున్న ఓడలు మునిగిపోలేదని అవి అన్నీ సురక్షితంగా రేవులోకి వచ్చాయనీ ఆఉత్తరంలో ఉంది. ఈసంగతి తెలియగానే అక్కలిద్దరు ఎగిరి గంతేశారు. మళ్ళీ చీరలు సింగారించుకుని కులుకుతూ సుఖంగా ఉండవచ్చుననీ హాయిగా పెళ్లిళ్లు చేసుకుని అత్తవారింటికి వెళ్లవచ్చునని ఉబలాటపడ్డారు.

ధనగుప్తుడు ఓడలు చూడడానికి బయలుదేరుతూంటే అక్కలిద్దరు అతని దగ్గిరికి వెళ్ళి వెంటనే తమకు సరికొత్త చీరలు, నగలు తీసుకు రావలిసిందని అడిగారు. సుందరి మాత్రం పుస్తకం ఏదో చదువుకుంటూ కూర్చుంది.

ధనగుప్తుడామె దగ్గిరకి వచ్చి "అమ్మా మనఓడలు చూడడానికి వెడుతున్నాను. తిరిగి వచ్చేటప్పుడు

అల్లరిమాన్పించిన పెట్టె

కోసం వెతుకుతున్న, శివరామయ్యగారికీ, ఆయన భార్యకీ పిల్లవాడు దొరికాడని తెలిసింది. వాళ్లు ఒక్క పరుగున అక్కడికొచ్చి వేణూని అమాంతంగాఎత్తుకున్నారు. వేణూ వాళ్లమ్మ ఇంకా ఏడుస్తూనే వుంది. "ఎక్కడికెళ్లావురా నాతండ్రీ?" అని ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ అడిగితే, అంతకంటె బిగ్గరగా ఏడ్చాడు వేణు.

ఇది జరిగి ఇప్పటికి చాలా రోజులైందనుకోండి - చెప్పొచ్చేదేమిటంటె ఆదెబ్బతో వేణూకు బుద్ధి వచ్చి, అల్లరి పనులు మానేశాడు. ★



ఒంటిగీత బొమ్మ:
మహారాణా ప్రతాప్.
జంధ్యాల సరోజ. (ద్రోణాచలం)

నీకేం తీసుకు రమ్మన్నావు?" అని అడిగాడు.

సుందరి కొంతసేపటిదాకా ఏమీ సమాధానం చెప్పలేదు గాని, చిట్ట చివరికి ఒక చిరునవ్వు నవ్వి "నాకు నగలు నాణాలు వద్దుగాని, ఒక చిన్న గులాబీపువ్వు తెచ్చి పెట్టండి!" అంది. నిజానికి సుందరికి గులాబిపు వ్వక్కర లేదుగాని, నగలు అవ్వీ అడిగితే అప్పగార్లిద్దరికీ ఏం కోపం వస్తుందో అనే భయంచేత అలాగడిగింది. ఒకవేళ ఏమీ అక్కర్లేదని అంటే అక్కలిద్దరు "అబ్బో ఎంత వగలాడివే: నాన్న గారిచేత పొగిడించుకోవాలని ఏమీ అక్కర్లేదని అన్నావులే! నీటక్కులు మాకు తెలియవూ?" అని ఎగ తాళి చేసేశారు. అందుకని ఏదో ఒకటి అడగకపోతే బాగుండదని గులాబీపువ్వు కావాలని మాత్రం అడిగింది. అంతే!

తరవాత ధనగుప్తుడు ఓడల దగ్గిరికి వెళ్లాడు. ఏవో కొన్ని ఓడలు ఒడ్డుకు జేరుకున్నాయి గాని, అవి ఒడ్డుకు జేరుకునేలోగా కొందరు ఓడదొంగలు ఆఓడలలో ఉన్న వస్తువులన్నీ పూర్తిగా దోచేశారు. అవన్నీ ఉత్తిఓడలే. వాటిలో ఒక్క చిల్లి గవ్వకూడా లేదు. ధనగుప్తుడికి ప్రాణం ఉసూరుమంది. ఆ ఒట్టి ఓడలన్నీ అక్కడే విడిచి పెట్టి మళ్లీ ఇంటికి ప్రయాణమైనాడు.

దోవలో పెద్ద గాలివాన వచ్చింది. ఉరుములతోను, మెరుపులతోను కుండపోతగా వర్షం కురిసింది.

ధనగుప్తుడీసమయానికొక కీకారణ్యంలోచిక్కుకున్నాడు ఆగాలిలోను, వానలోను అతనికి దారి తిన్నగా తెలియలేదు. తను ఎక్కివచ్చిన గుర్రం ఇక నడవలేక ఒక చెట్టు కింద కూలబడి పోయింది. అప్పటి కప్పుడే బాగా చీకటి పడింది. ఇంక ఆచీకటిలో అలాగే ప్రయాణం సాగిస్తే ఏ పెద్ద పులులైనా మింగేస్తాయేమోనని భయం వేసింది. చుట్టూరా పెద్దపులులు, సింహాలు గాండ్రు గాండ్రుమని అరుస్తున్న ధ్వనులు వినిపిస్తున్నాయి. ఆ [illegible] విలో ఆరాత్రి ఎక్కడైనా విశ్రమిద్దామనుకుంటే అతనికెక్కడా దారీ తెన్నూ కనిపించలేదు. భగవంతుడా! నాకిక దిక్కు లేదా!" అని దిగాలుపడి కూర్చున్నాడు. వర్షం అలాగే కురుస్తూంది. కీచురాళ్లు భయంకరంగా గీపెడుతున్నాయి. మధ్య మధ్య చెట్టుకొమ్మల్లో తల దాచుకున్న పక్షులు రెక్కలాడించినపుడల్లా అతని గుండె గుబగుబలాడేది. ఏదైనా దారి దొరకకపోతుందా అని అల్లాగే వానలో తడుస్తూ కొంత దూరం సాగించాడు. ఇంతలో దూరంగా మినుకు మినుకుమంటూ ఒక చిన్నదీపం కనబడింది. (ఇంకావుంది)



ఎక్సెల్ ప్రొడక్షన్సువారి "తండ్రి" చిత్రంలో బి. ఎస్. సరోజ.



ప్రకాష్ ప్రొడక్షన్సువారి "కన్నతల్లి"లో జి వరలక్ష్మి, ఎ నాగేశ్వరరావు

"కన్నతల్లి" సమీక్ష

ప్రకాష్ ప్రొడక్షన్సువారి "కన్నతల్లి" మొన్న 16 వ తేదీన ఆంధ్రదేశమంతటా విడుదల అయింది. పదవ తేదీన ప్రకాష్ స్టూడియోలో పత్రికా ప్రతినిధులకు ఆ చిత్రం చూపించారు. జి వరలక్ష్మి, ఎ. నాగేశ్వరరావు, ఆర్ నాగేశ్వరరావు, నంబియార్, వసంత, మిక్కిలినేని, శివరాం, సి వరలక్ష్మి మున్నగువారు నటించారు నిర్మాత, దర్శకుడు కె ఎస్. ప్రకాశరావు; ఫొటోగ్రఫీ జాగీర్దార్; సంగీతం పెండ్యాల; సంభాషణలు శ్రీశ్రీ, ఆరుద్ర, సుంకర, వాసిరెడ్డి; పాటలు పై నలుగురూ కాక తాపీ, ఆత్రేయ గార్లు

సంబరాల చలపతి అనే ఆసామీ లేని పోని గొప్పలకు పోయి, అప్పులపాలై, సంసారం మీద విరక్తిపుట్టి సన్యాసుల్లో కలిసిపోతాడు. భార్య గుండెరాయి చేసుకుని, ఇద్దరు మగపిల్లలను పెంచి పెద్దవాళ్లను చేస్తుంది పెద్దవాడు తను చదువు మానేసి, కిరాణా కొట్టు పెట్టుకొని డబ్బుసంపాదిస్తూ తమ్ముడికి పెద్ద చదువులు చెప్పిస్తాడు తమ్ముడు తుంటరి, జూదరి, జారుడు అయి డబ్బు తగలేస్తూ, ఒకానొక సందర్భంలో తను ఉంచుకున్న వేశ్యపై కోపం వచ్చి ఆమెను హత్యచేసి పారిపోతాడు. ఆ సమయానికే అతన్ని వెదుక్కుంటూ వచ్చిన తల్లి హత్యానేరం తనపై వేసుకుంటుంది కొడుకులిద్దరూ వారిస్తూన్నా వినక తనబిడ్డ క్షేమంకోసం తల్లి శిక్ష అనుభవిస్తుంది. రెండవ కొడుకు పశ్చాత్తప్తుడై సన్మార్గుడవుతాడు.

కన్నతల్లి ఏ రీతిగా తనబిడ్డల క్షేమాన్నే ఎల్లప్పుడూ కోరుతుందో, వారు తప్పులు చేసినా, ఆ తప్పులు తనపై వేసుకుని ఎలా వారిని రక్షిస్తుందో చూపెంచటం ప్రయోజనకంగా పెట్టుకొని ప్రకాశంరావుగారు ఈ చిత్రం తీశారు. ఈ ప్రయోజనం సాధించటంలో ఆయన కృతకృత్యులయ్యారు కన్నతల్లి పాత్రను [illegible] అంతా లేవి చూపించకుండా చివరవరకూ ఒకేవిధంగా పోషించుకుంటూ వచ్చారు తల్లులందరూ ఆ విధంగా ప్రవర్తించకపోవచ్చును అంత గొప్పత్యాగం చెయ్యటానికి అవకాశమిచ్చే సంఘటనలు అందరికీ రాకపోవచ్చును; దైనిక జీవితంలో తల్లిప్రేమ అంత సుస్పష్టంగా భాసించకపోవచ్చును అందుచేత ఈ చిత్రంలోని తల్లిపాత్ర ఆదర్శప్రాయమైన మాతృత్వం ఎలా వుంటుందో చూపుతుంది

ఈ పాత్ర ధరించిన జి వరలక్ష్మి వివిధములైన పాత్రలను నటించడంలో



"కన్నతల్లి" నిర్మాత, దర్శకుడు శ్రీ కె. ఎస్. ప్రకాశరావు.

"కన్నతల్లి" సమీక్ష"

తనకు నేర్పుకలదనే విషయం మరొకసారి ఋజావుచేసుకున్నది అయితే ఆమె తన పాత్రను పోషించిన విధానంచూస్తే, కథకు ఉద్దేశించినదానికి కొంత భిన్నమైన ఫలితాలు కలిగాయేమో ననిపిస్తున్నది ఆమె నటనలో పుత్రప్రేమ అనే గుణాంకంకంటె, ఎన్ని కష్టాలు వచ్చినా ఒంటరిగా నిలబడగల ధైర్యమే ఎక్కువగా భాసించింది. దీనికి కారణం ఆమె మొదటినుంచి చివరిదాకా ఒకే రకమైన హావభావప్రకటన చెయ్యటం ప్రతి సన్నివేశంలోను ఆమె ఒకే గాంభీర్యం వహించటంవల్లనో ఏమో, ఆ పాత్ర "నేనెంత గొప్పదాన్నో, ఎంత మంచిదాన్నో చూడండి" అని చెప్పుకుం టున్నట్లు కనిపించింది కాని ఆ గాంభీర్యమే కొన్నిచోట్ల, ముఖ్యంగా భర్త ఇల్లు విడిచిపోయిన సందర్భంలోను, చివరలో జైలు సన్నివేశంలోను, ఎంతో రక్తికట్టింది

ఎ. నాగేశ్వరరావు ఈచిత్రంలో సమర్థుడైన నటుడని అనిపించుకొన్నాడు. ఇది



భర్త తన్ను విడిచిపెట్టపోయినా ధైర్యంతో జీవితాన్నెదుర్కొంటు శాంత.
"కన్నతల్లి"లో జి. వరలక్ష్మి

వరకటి చిత్రాలోకంటె భిన్నగా, సాధ్యమైనంత సహజంగా, స్వేచ్ఛగా నటించాడు. ఆయన కివ్వబడిన పాత్ర నిర్దుష్టంగా లేకపోవటం ఆయన దోషం కాదు. మొదటి నుండీ ఒకరకంగాఉన్న ఆ పాత్ర మధ్యలో పల్టీ కొట్టింది. పెద్ద కొడుకు తండ్రివలె స్వతంత్ర ప్రవర్తన కలిగివుంటూ, కొంత దూరం పోయాక భార్య గయ్యాళితనానికి లొంగిపోవటం, తల్లికి దూరం కావటం, చివరికి భార్యను కసిరి తిరిగి స్వతంత్రుడవటం జరుగుతుంది. ఈమార్పు ప్రయోజన రహితంగా ప్రవేశపెట్టబడింది

కన్నతల్లి ప్రేమను చూపించటం ప్రధాన ప్రయోజనమైనప్పటికీ, సగంలో సోదర ప్రేమ అనే అంశంకూడా చొప్పించటంతో కథకు ద్వైవిధ్య మేర్పడి వసైక్యం చెడింది.

నంబియార్ ధరించిన తమ్ముడు "శంకర్" పాత్ర అనేక పాత సినిమాలధోరణిలో చేవుండటంవల్ల అది కొత్తగా సాధించింది ఏమీ లేదు పైగా నంబియార్ నటన ఎవరినీ మెప్పించలేదు. అదలా వుంచి, కాలేజీ హాస్టల్లో దృశ్యాలు, అక్కడి స్టూడెంట్ల ప్రవర్తన చాలా అసహజంగా వున్నాయి. అలాగే పల్లెటూళ్ళో నంబియార్, వసంతల దొరిబయట విహారాలు కూడా అసహజంగా వున్నాయి.

శంకర్ ధరించిన పాత్ర ఎటూ కాకుండా వదిలివేయబడింది. అతడు చేసిన



రోహిణీవారి క్రొత్త హాస్యచిత్రంలో పేకేటి శివరాం, ఎన్. టి. రామారావు.

హత్యానేరాన్ని తల్లి తనపై వేసుకుంటుంది. ఇంత దుర్భరమైన మాతృత్యాగం తర్వాత అతడు ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుని సుఖపడటం కాదుగదా, ఒక్క క్షణం కూడా జీవితం భరించలేడు. ఆత్మహత్య చేసుకోవటమో, పిచ్చెత్తిపోవటమో న్యాయంగా జరగాలి. పోనీ అతడు తను బుద్ధిపూర్వకంగా చేసిన హత్యానేరాన్ని తనపైనే వేసుకొనటానికి ఇంకా గట్టిగా ప్రయత్నించవలసింది. అలా కూడా చేయలేదు. అసలు అతనిచేత ఆ హత్య చేయించవలసినంత అవసరమే లేదు. తల్లికి త్యాగం చేసే అవకాశం కలిగించేందుకే హత్య జరిపినట్లు కనిపిస్తుంది.

కథను సూటిగా నడిపిస్తూ, మధ్యలో అన్ని అనవసర పాత్రలు, సంఘటనలు లేకుండా ఉంచినట్లయితే చిత్రం ఇంకా రక్తి కట్టేది. మొదట్లో భర్త ఇల్లువిడిచి వెళ్ళిపోవటం, పిల్లలు పెరిగి పెద్దవారవటం వరకూ చక్కని టెంపోతో సాగిన చిత్రం, పోనుపోను స్తబ్ధమై విసుగు కలిగిస్తుంది. తల్లి గొడ్లపాకలో నివాసానికి వెళ్లిపోవటం మొదలైన ఆ భాగమంతా కథకు తోడ్పడేదిగా లేదు.

సంభాషణలు మితంగా ఉంటంచేత చాలచోట్ల రక్తికట్టాయి. ఆఖరున జైలు దృశ్యం అన్నిటికంటె హృదయంగమంగా వున్నది.

పెండ్యాల నాగేశ్వరరావుగారి సంగీతం బాగున్నది. పాటల రచనకూడా బాగున్నది. శ్రీశ్రీ, ఆరుద్ర వ్రాసిన యక్షగానం, మరొక నృత్యగీతం ప్రత్యేకించి బాగున్నవి. "ఎంత మంచిదానవో అమ్మా" అనే పాట ఔచిత్యహీనంగా, ముఖస్తుతికోసం పాడినట్లున్నది. జాగీర్దార్ ఫొటోగ్రఫీ కథను రక్తి కట్టించటంలో చాలా తోడ్పడింది. ఒక్కచోట మాత్రం, జి. వరలక్ష్మి కళ్ళమీదికి ఎక్కడిదో తెలియని కాంతిని కేంద్రీకరించినప్పుడు మోతాదు మించినట్లున్నది.

నటీనటుల్లో ఆర్. నాగేశ్వరరావు, శివరాం, మిక్కిలినేని, అచ్చయ్య చౌదరి, సుధాకర్, వసంత శక్తివంచన లేకుండా నటించారు. కందా మోహన్‌ను ప్రత్యేకం ప్రశంసించాలి ★

★ సినిమా వార్తలు ★

రోహిణీవారి "బీదల ఆస్తి" (లెగసీ) చిత్రంలోకి కొత్తగా జగ్గయ్య, జానకి, చంద్రకుమారి బుక్ అయినట్లు తెలుస్తున్నది.

* * *

అజంతావారి "వయారిభామ" ఇటీవల సెన్సార్ షో ఇవ్వబడినట్లు తెలుస్తోంది

* * *

ప్రేమ్‌నజీర్, తిరుక్కురిసి, బి. ఎస్.

(51-వ పేజీ చూడండి)


ఏప్రిల్ 30-వ తేదిన ఆంధ్రదేశమంతటా
విడుదల
ఎక్సెల్ ప్రొడక్షన్స్ వారి
తండ్రి
(తెలుగు)
బి.ఎస్. సరోజ.. ప్రేమ్‌నజీర్
తిక్కురిసి నటించినది

ప్రశ్నలు..సమాధానాలు

శ్రీ బి. శ్రీనివాసరావు—గూడూరు.

అన్ని పత్రికలూ "గుమాస్తా" బాగులేదని ఘోషిస్తుంటే మీ పత్రిక మాత్రం చాలా బాగుందని మెచ్చుకొన్నది. కారణం?

—"గుమాస్తా" చిత్రం అంతా బాగున్నదని మేము అనలేదు. ప్రోత్సహించదగిన ఒక కొత్త ధోరణి అందులో కనిపిస్తోంది కనుక, ఆ విషయం మాత్రమే ఉద్ఘాటించాము.

*　　*　　*

శ్రీ గురజాపు సూర్యప్రకాశరావు—ఏలూరు.

ఒక వ్యక్తి ఏ చిత్రానికైనా డైరెక్టరుగా, హీరోగా, రచయితగా, వుండి చిత్రం తీస్తే రాణించుతుందా, రాణించదా? ఎందుచేత?

—అంత సర్వతోముఖమైన ప్రతిభ కలవారు మనలో లేరనే చెప్పవచ్చును. ప్రొడక్షను, డైరెక్షను, నటన, రచన, సంగీతం అన్నీ నిర్వహిస్తూ విజయం పొందినవాడు ఒక్క చార్లీ చాప్లిన్ మాత్రమే ఉన్నాడు.

*　　*　　*

శ్రీ కె. ఎస్. పి. శివరావు—మద్రాసు.

"క్వోవాడిస్" చూడటానికి అమృతాంజనం సీసా జేబులో వేసుకొని వెళ్ళాలని నా దృఢనిశ్చయం. మరి మీరు దానిని అంత గొప్పగా ఎందుకు పొగిడారో నాకర్థము కావటంలేదు. మీ అభిప్రాయం?

—మేము పొగిడామని మీ రెందు కనుకున్నారో మా కర్థం కావటంలేదు.

*　　*　　*

శ్రీ దేవరకొండ రామమూర్తి—మంగళూరు.

మనుష్యులనుగాని, జంతువులను గాని బాధపెట్టుట హింసించుట యగును. చెట్లకు కూడా ప్రాణం ఉంది. చెట్లను ఆహారంగా ఉపయోగించుకొనుట జీవహింస గదా? మానవుడు అహింసను ఆచరించడం ఎట్లా?

—జంతువులలోకంటె చెట్లలో ఉన్న చైతన్యం (జీవం) తక్కువ వికాసం గలది. తక్కువ తరగతిలోనిది. కనుక జంతువునకు కలిగే బాధకంటె చెట్టుకు కలిగెడి బాధ కూడా తక్కువ తరగతిలోనిది. ఆ తక్కువ కన్నా, రాళ్ళు, రప్పలు, లోహాలు మొదలైన జడ పదార్థాలకు కూడా నిద్రావస్థలు, జాగ్రదవస్థలు ఉన్నవని శాస్త్రజ్ఞులు ఋజువుచేశారు. చెట్లకంటె జడ పదార్థములలోని చైతన్యం ఇంకా ఎక్కువ మంగదతిలో ఉంది. కనుక ఎంత తక్కువ చైతన్యంగల పదార్థం మనం భక్షిస్తే అంత తక్కువ జీవహింస చేయడమగును. ఏమైనప్పటికీ, మనం ఊపిరిపీల్చి ఊపిరి విడిస్తే అనేక జీవకణాలు మన శరీర రక్తంలోనే అందుమూలంగా లయమవుతూ ఉన్నాయి. అందువల్ల ఊపిరి బంధించలేము. అన్నింటికన్న ముఖ్యంగా మన మీదనే మనకు దయ ఉండాలి. అహింసా ధర్మాన్ని మనశరీరానికే ముందుగా వర్తింపజేసి, శరీరాన్ని పోషించి రక్షించాలి. "శరీర మాద్యం ఖలు ధర్మసాధనం" దీని తర్వాతనే అహింసా ధర్మాచరణ.

*　　*　　*

శ్రీమతి అక్కల కమల—కొండపల్లి.

రామలక్ష్మణులు పుట్టక ముందే రామాయణం వ్రాయబడింది కదా! మాయలేడి వచ్చినప్పుడు రాములవారికి అప్పుడు జరుగనున్న మోసం ముందుగానే తెలిసియుండవలెనుగదా? రాముడు ఆ మాయలేడికొరకై ఎందుకు పరుగెత్తినాడు?

—రామాయణ కథాబీజములు వేదములలోనే ఉన్నాయని ఋజువుచేశారు కొందరు పండితులు. రాముడు అనే అవతారము యొక్క గాథ సూర్యుని విషమైన ఒక వర్ణనా విశేషమని నిర్ణయించారు. రాముడు సూర్యవంశపు రాజు అనే మాటకు సూర్యుడే "రాముడు" అని అన్వయించారు. కాబట్టి ఇక్ష్వాకు వంశంలో పుట్టిన రాముడు ఒకడు ఉండవచ్చు. అంతకు పూర్వమే "రాముడు" అనే శబ్దం ప్రయోగింపబడి సూర్యుని పరంగా అన్వయించదగిన అతిప్రాచీన వేద గాథలు కూడా ఉండవచ్చు. ఈ రెండింటినీ కలగాపులగం చేసి చర్చించడంవల్ల ఆ రాముడెవరో, యీ రాము డెవరో తెలియక సందేహ సందోహములు కలుగుతూ ఉంటాయి. జగమంతా రామమయం అనినట్లయితే, రాముడే మాయలేడి, మాయలేడియే రాముడు.

★



"రాసలీలా" నృత్యంలో ప్రఖ్యాత నాట్యకారుడు ఉదయశంకర్.

★ మద్రాసులో ఉదయశంకర్ ★



"అశ్రుపూజ" నృత్యంలో ఉదయశంకర్, అతని భార్య అమలాశంకర్.

ప్రసిద్ధ నాట్యకారుడు ఉదయశంకర్ ఈ నెల 17 నుంచీ మద్రాసు, న్యూగ్లోబ్‌లో నాట్యప్రదర్శనా లిస్తున్నాడు ఈ ప్రదర్శనాల్లో ముఖ్యమైనవీ, పెద్దవీ రెండు బృందనృత్యా లున్నాయి ఒకటి, బుద్ధుని జీవితం; రెండు, కార్మికులు - యంత్రాలు

14 వ తేదీన ఉదయశంకర్, ఆయన భార్య అమలాశంకర్ పత్రికాప్రతినిధులకు అల్పాహార విందుచేశారు విందు అనంతరం మాట్లాడుతూ ఉదయశంకర్ ఇలా అన్నాడు:

"ప్రస్తుతం భారతీయసంస్కృతి ఆందోళనకరమైన పరిస్థితిలో పడింది. పాశ్చాత్య వ్యామోహంలోపడి మన పూర్వసంస్కృతీ వైభవాన్ని విస్మరిస్తున్నాము. నేను గడచిన ఇరవై ఏళ్ళనుంచీ భారతీయ సంస్కృతిని మనవారికీ, ఇతరులకు కూడా చాటిచెప్పాలని చేతనైనంతవరకూ ప్రయత్నిస్తున్నాను అయితే నన్నూ, నాలాగా కళకోసం కృషి చేస్తున్న మరికొద్దిమందినీ ఎదుర్కొంటున్న జటిల సమస్య ఒకటున్నది. మన ప్రాచీన సంస్కృతి నిస్సందేహంగా గొప్పదే. కాని ఆ సంస్కృతికి కారణమైన పరిస్థితులు ఇప్పుడు లేవు. కొత్త పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి ఈ పరిస్థితులకు అనుగుణంగా మన ప్రాచీన సంస్కృతిని ఏ విధంగా మలచాలి? ఇదే నా సమస్య కథాకళి, భరతనాట్యం, మణిపురి మొదలైన నాట్య సంప్రదాయాలను ఆధునిక పరిస్థితులతో ఏవిధంగా సమన్వయించాలి? నశించిపోతున్న ఆ సాంప్రదాయాలకు ఏ కొత్తరూపం ఇచ్చి ప్రజాసామాన్యానికి సన్నిహితంగా తీసుకురావాలి? ఇదే నా సమస్య. దానికోసమే నేనింతకాలంనుండీ ప్రయత్నిస్తున్నాను. మాత్రప్రాయంగా చెప్పాలంటే, ప్రాచీన సంప్రదాయాలను ఆధారంగా చేసుకొని, అవసరమైతే పాశ్చాత్య సాంప్రదాయాలను కూడా మేళవించుకుని నూతన సాంప్రదాయాలను సృష్టించుకోవాలి"

ఉదయశంకర్ ఈ నగరంలో కొత్తగా ప్రదర్శించిన బుద్ధుని సన్యాస స్వీకారం" మొదట న్యూయార్కులో ప్రదర్శించబడినది. ఉదయశంకర్ నృత్యాలన్నిటిలోకీ ఇది ఉత్తమమైనదని అంతా ప్రశంసించారు

ఉదయశంకర్ ప్రస్తుతం ఒకటిన్నర లక్షలు సేకరించి తిరిగి విదేశాలకు ప్రయాణమయ్యే ఆలోచనలో వున్నాడు. జూన్‌లో తూర్పు ఆఫ్రికా, అక్టోబరులో యూరపుదేశాలు, ఆ తర్వాత అమెరికా పర్యటించ దలిచానని ఆయన అన్నాడు భారతప్రభుత్వం ఇటీవల స్థాపించిన సంగీత, నృత్య, నాటక 'ఎకాడమీ'లో ఆయనకు సభ్యత్వం వున్నది ప్రభుత్వం ఇప్పటివరకూ అశ్రద్ధచేసినా ఇక ముందు కళాభివృద్ధికి కొంత నికరమైన పని చెయ్యనున్నదనీ, మరొక ఆరేడు నెలల్లో ఎకాడమీవారి కృషి ప్రారంభమౌతుందనీ ఆయన చెప్పాడు.

ఉదయశంకర్‌కు ప్రస్తుతం 53 ఏళ్లు 80 ఏళ్ళ వయస్సువరకూ నృత్యం చేస్తూనే గడపదలిచానని ఆయన అన్నాడు. "ఆంధ్రదేశంలో కూడా మీరు ప్రదర్శనా లివ్వరాదా?" అని సూచించగా, తన విదేశ పర్యటనానంతరం తప్పక రాగలననీ, ఆంధ్రప్రేక్షకులు మంచి అభిరుచి కలవారని తను విన్నాననీ ఆయన అన్నాడు.

ఇష్టాగోష్ఠి తరువాత ఉదయశంకర్ నృత్యాల్లో వాలేనే ఆర్కెస్ట్రావారు వివిధ వాద్యాలతో నృత్యసంగీతం వినిపించారు. కమలేష్ మైత్రా అనే యువకుడు ఒకసారి 13 తబలాలు మోగిస్తూ శ్రోతలను ఆనందింపజేశాడు అన్ని తబలాలను వాయిస్తూ కేవలం తాళమే కాకుండా స్వరాలుకూడా పలికేటట్లు చేసి ప్రశంసనీయమైన ప్రతిభ కనబరిచాడు. ★



"శివపార్వతి" నృత్యంలో ఉదయశంకర్, అమలా శంకర్.

★ సినిమా వార్తలు ★

(-47వ పేజీ తరువాయి)

సరోజ మున్నగువారు నటించిన "తండ్రి" తెలుగుచిత్రం ఈ నెలాఖరుకు విడుదల అవుతుందని వినికిడి డిస్ట్రిబ్యూటర్లు వాహినీ పిక్చర్సువారు.

* * *

గడచిన నెల 27 వ తేదీన హైదరాబాదులో భారత పిక్చర్స్ లిమిటెడ్ అనే ఫిలిం నిర్మాణసంస్థ స్థాపించబడింది. సంస్థ ప్రారంభోత్సవానికి హైదరాబాదు ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణ రావుగారు, నటుడు శ్రీ వి నాగయ్యగారు, హైదరాబాదు పురప్రముఖులు, కళాకారులు, నటీనటులు, పత్రికా రచయితలు, తదితరులు హాజరయ్యారు భారత పిక్చర్స్ కార్యదర్శి శ్రీ కొండా లక్ష్మణ్ గారు హైదరాబాదు రాష్ట్రంలో ఒక చిత్ర నిర్మాణసంస్థ నెలకొల్పాలనే చిరకాల వాంఛ నేటికి నెరవేరిందని అన్నారు. అడ్‌హాక్ కమిటీ అధ్యక్షులు రాజా బదరీ విశాల్ పిట్టీ. సభ్యులు శ్రీ యుద్ధవీర్, కర్నన్ బాబు, ఎర్రం సత్యనారాయణ, జి రంగారెడ్డి, కొత్తూరు సీతయ్య, ఎ. బి ఓమర్, గిడుతూరి సూర్యం, ఎమ్. నరసింహారావుగార్లు.

* * *

భారత ప్రభుత్వంవారి ఫిలిమ్స్ డివిజన్ తన కార్యకలాపాలను విస్తృతంచేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది యూనిట్ల సంఖ్యను హెచ్చించటమే గాక చాలా అధునాతన సామగ్రిని సేకరించుకొన్నట్లు తెలుస్తోంది.

బొంబాయిలో ఫూలావాబాద్ లో వారు ఒక ఫ్లోర్ నకూడా నిర్మించుకొంటున్నారట

* * *

బొంబాయి నిర్మాత రమేష్ వ్యాస్ నిర్మిస్తున్న "రామీధోబన్" చిత్రంలో అభిభట్టాచార్య, కామిని కౌశల్, లీలా చిట్నిస్, వనమాల, మున్నగువారు నటిస్తున్నారు ప్రాచీన బెంగాలీకవి చండీదాసు జీవితకథ ఈ చిత్రంలో వస్తువు. హీరేన్ బోస్ దర్శకత్వం, సంగీతం రెండూ నిర్వహిస్తున్నాడు. చండీదాసు కథ న్యూథియేటర్సు వారు సైగల్ నాయకుడుగా ఇదివరకొకసారి నిర్మించారు.

* * *

బెంగాల్ లో వైష్ణవ మత ప్రచారం జరిపిన కృష్ణచైతన్యుని గాథను విజయ భట్ "చైతన్య మహాప్రభు" అనే పేరుతో చిత్రీకరిస్తున్నాడు. భారత్ భూషణ్ చైతన్యుడుగా నటిస్తాడు ప్రసిద్ధ సంగీత దర్శకుడు ఆర్ సి. బోరల్ సంగీతమూ, కనూదేశాయ్ కళ నిర్వహిస్తున్నారు.

★ కాలక్షేపం ★

(౮-వ పేజీ తరువాయి)

స్తోంది" అని భావించవలసి ఉంటుంది. ప్రకృతియందున్న అందమైనరంగులు ఆనందం కలుగజేయుచున్నవా? లేక, నేత్రములకు అట్టి గ్రహణశక్తి ఉండడంవల్ల ఆనందం కలుగుచున్నదా? నేత్రదృష్టి లేనియెడల పూవుల రంగులన్నీ బూడిదలో పోసిన పన్నీరు. కనుక మన నేత్రములకుగల అద్భుతశక్తిని గూర్చి శ్రద్ధగా శోధించి ఆత్మానందం కూడా పొందవచ్చు. ఎంతటి యమధర్మరాజువంటి అధికారి అయినా, ఎంతటి నియమనిష్ఠాగరిష్ఠుడైనా, ఈకాలంలో మామిడి పండ్లమీది మమకారంవల్ల నోరూరని నరుడు గాని, మనసు మెత్తపడని కఠిన చిత్తుడు గాని ఉండడు. ఇదే చూతఫల మాహాత్మ్యం.

ఈమధ్య నొక పెద్దమనిషి యింట్లో ఆయనతండ్రిగారి ఆబ్దికం వచ్చింది. ఆయన పేరు కొల్లాపూరు రాఘవేంద్రరావుగారు. ఆ పూళ్ళో ఉండే పెద్ద పోలీసుఠాణా ఆఫీసులో ఆయన సర్కిలు ఇనస్పెక్టరు. మంచి పలుకుబడి గలవాడు. నిదానస్థుడు - సరసుడు. తండ్రిగారి శ్రాద్ధం శ్రద్ధగా మధ్యాహ్నం 12 గంటలకే ప్రారంభించేవాడు. ఆనాటి శ్రాద్ధమునకు భోక్తలుగా ఇద్దరు బ్రాహ్మణులను ఆయన నిర్ణయించి నిమంత్రించి ముందుగానే క్రిందటి దినమే వారిద్దరికి చెప్పిఉంచాడు. వీ రిద్దరిని క్రిందటి రాత్రి తనయింటికి పిలిపించి ఆరాత్రి వారు భోజనం చేయకుండా తేలికగా ఫలహారంచేసి తన యింట్లోనే శయనించడానికి ఏర్పాట్లు చేశాడు. తానుకూడా క్రిందటి రాత్రి భోజనం చేయకుండా దీక్షతో ఉన్నాడు. ఆయనకు ప్రతిసంవత్సరమూ మామూలుగా సుబ్బావధానులుగారు భోక్తగా వచ్చేవాడు. కాని యీ సంవత్సరము ఆబ్దికానికి ఆయన వంట్లో సుస్తీగా ఉండడంచేత, ఆయన కుమారుడైన సుదర్శనమును పంపించాడు. ఇతడు కూడా కొద్ది కొద్దిగా స్మార్తకర్మ తంత్రమంత్ర భాగములను తండ్రివద్ద పాఠం చెప్పుకుంటున్నాడు. సుమారు పదహారేళ్ళవాడు. ఉదయం మడిబట్టలు వగైరా ఉతికి ఆరవేసి ఇంట్లో రాఘవేంద్రరావుగారి భార్య స్వయంగా వంట ప్రారంభించింది. ఉదయము సుమారు 10 గంటలైంది. వీరి ఇంట్లో 12 గంటలైతేనే గాని శ్రాద్ధమంత్రం ప్రారంభించరని సుదర్శనానికి తెలుసు. ఈలోగా కాలువ గట్టుమీదకు బాహ్యానికి వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి, పెద్ద యిత్తడి చెంబు ఒకటి ఆయింటి ఆమెను అడిగిపుచ్చుకొని, తన యజ్ఞోపవీతం చెవికి మెలియబెట్టి తలకొక కొల్లాయిగుడ్డ చుట్ట కుదురువలెచుట్టి, కాలువగట్టు వెంట బయలుదేరి వెళ్ళాడు. అది వైశాఖమాసం - కాలువగట్టుమీద చక్కగా గుమ్మటముల వలె ఎదిగిన పెద్ద పెద్ద మామిడి చెట్లు ఉన్నాయి. కాలువవైపుకు కొమ్మలువాలి చేతికందుతున్నాయి- కొమ్మలనిండా ముదిరి పక్వానికివస్తూ ఉన్న మామిడి కాయలు సైజువారీగా గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతున్నాయి. సుదర్శనానికి ఈ మామామిడి చెట్లు చాలా మానసానందకరమై ఉల్లముపల్లవించి నట్లయింది. కొంతదూరం వెళ్లి తన కాలోచిత కృత్యములను నిర్వర్తించుకొని, ఆ సమీపంగా కాల్వలో ఉన్న దొరువులో ఆచమనంచేసి తిరిగి యింటిముఖంగా బయలుదేరాడు. ఇతడికి రసము పిండెడి చీకుడు పండ్లకంటె, ముక్కలు కోసి తినుటకు అక్కరకు వచ్చెడి కోతపండ్లకంటె, ఆవకాయ ఊరగాయకు అక్కరకు వచ్చేటటువంటి మంచి పిండికండగల పుల్లని పెద్ద సైజు కాయలమీద మోజు ఎక్కువ. అటువంటి కాయలను సుదర్శనం చూచీ చూడగానే మోహదృష్టిమీదనే జాతినిర్ణయం చేసిచెప్పగలడు. అది ఒక చూతసాముద్రిక విద్య. ఆ విద్యలో సుదర్శనం సిద్ధహస్తుడు. ఆ చూతవృక్షముల వంకను, కొమ్మల వంకను, కాయలవంకను చూస్తూ నడుస్తున్నాడు. ఇంతలో ఒక చెట్టు కాయలను చూచి ఇది సరియైన ఆవకాయ కాయజాతి యని లొట్టలు వేస్తూ నిలువబడ్డాడు. ఆ కాలువ గట్టుమీద అతనికి కనుచూపు మేరలో నరమానవుడైనవాడెవ్వడూ కన్పించలేదు.-

ఎవ్వడూ లేని ఏకాంతములో తన మనఃకాంతుడు లభించినట్లుగా సుదర్శనానికి ఆ చూత ఫలములు లభించేసరికి, ఇందమని యందిచ్చినట్లుగా, చేతి కందుతూ ఉన్న ఆ మామిడి కాయలను రెండు తెంపి తన పెద్ద యిత్తడి చెంబులో వేసికొన్నాడో లేదో ఆ కాలువయొక్క అవలిగట్టునుంచి "కోన్ హైరే!" అంటూ కేకలేస్తూ ఒక వయసు ముదిరిన బూబు పరుగెత్తుకుంటూ వచ్చింది. ఆ కాలువ గట్టుమీది చెట్లకాయల నన్నింటిని ఆ ఏడు ఖాసిం సాహెబు ఏలం పాట పాడినాడు.

అతడు అవలిగట్టున ఒక పాకవేసికొని అందులో కాపురముంటున్నాడు. అతను పనిమీద ఊళ్ళోకి [illegible]. అతని బదులు అతని భార్య మోతీబీబీ కాపలా కాస్తోంది.

> విద్యార్థి:- (వాచర్‌తో)- మాస్టార్ గారూ! మీరు ఇది వరకు ఎన్నడూ ఇక్కడకు వాచర్‌గా రానట్లుంది?
>
> వాచర్:-[నవ్వుతూ] అబ్బాయీ! నీవు ఎన్ని సంవత్సరాలుగా యీ పరీక్షకు కూర్చుంటున్నావేమిటీ!
>
> —శ్రీ లక్ష్మీపతి; విశాఖపట్నం.

ఈసంగతి అంతా సుదర్శనానికి సూచనగా కూడా తెలియదు. దారిమార్గంగాపోయే తనబోటి పాంధులు కోసికొని తినుటకు ఆ తరువులు ఫలభారంచేత వంగి వాయన మిస్తున్నాయని భావించాడు. కనుక సృష్టిలో సహజంగా ఉన్నటువంటి ఫలసంపత్తిని మానవుడైనవాడు యథేచ్ఛగా తిని అనుభవించడంకోసమే భగవంతుడు కల్పించాడనే భావం ఆ కాలువగట్టుమీద ఉన్న పబ్లికు ఫలవృక్షాలను చూచేసరికి సుదర్శనంయొక్క సూక్ష్మబుద్ధికిస్ఫురించింది. కాని అతనికంటె అతి సూక్ష్మదృష్టిగల మోతీబీబీ ఆ సుదర్శనముయొక్క మనస్సు యీ చూత ఫల సందర్శనమాత్రముచేత ఏవిధంగా చలించినదో కనిపెట్టింది. వెంటనే పరుగెత్తుకొనివచ్చి సుదర్శనాన్ని "చెంబు క్రిందపెట్టు" అని దబాయించింది. అతడు వట్టి అర్భకుడు - గజగజలాడుతూ రెండు కాయలతో నిండిన పెద్దయిత్తడి చెంబును క్రిందపెట్టి "బుద్ధిజాడ్య జనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్ అని ప్రవరుడు లెంపలు వేసికొన్నట్లుగా, "తప్పు"క్షమించాలి! తెలియకకోశాను" అన్నాడు. అతని గుండె బెదరు ఎక్కువైన కొద్దీ మోతీబీబీయొక్క జబర్దస్తీ ఎక్కువైంది. అతని చెయ్యిపట్టుకొని పాకవద్దకు బలాత్కారంగా లాగుకొనిపోయింది. ఆవువెంట దూడ లాగున చేతులు జోడించుకొని వెంట నడిచాడు. ఆ పాకవద్ద అతనిని నిలువబెట్టి "ఎక్కడికీ పోతావ్! మామిడీకాయలునీకీ కోసీయిస్తాం! ఇక్కడా ఉండు - చాలామంచి మనిషీగా ఉండావ్" అని కదలకుండా కూర్చుండబెట్టింది. ఇంతలో ఖాసింసాహెబుకూడా వచ్చాడు. జరిగిన సంగతి అంతా చెప్పింది. "ఈ మనిషిచేసిన తప్పుపనికి యీ చేతులూ కాళ్ళూ కట్టివేయివాలా!" అని ఖాసిం సాహెబు ఒక త్రాడు తెచ్చి అతని రెండు

చేతులకూ కాళ్లకూ కట్టి, "ఉండు ఇక్కడా! పోలీసు ఠాణాకు ఇద్దరం పోదాం! నేను లోపలికిపోయి నాస్తా చేసీవస్తా" అని పాక లోపలికి పోయినాడు. మోతీబీబీని బయట అతనివద్ద కాపలా ఉంచాడు. సుదర్శనం అక్కడ కళ్లనీళ్ళు పెట్టుకొని, ఏడ్వడం ప్రారంభించాడు. "తద్దినం వేళ అయింది వెళ్ళాలి. నా తప్పు క్షమించి విడిపించు నన్ను" అని ఆ చెట్టుక్రింద కూర్చుండి బాబును ప్రతిమాలుతున్నాడు. మిట్ట మధ్యాహ్నమైంది. 12 గంటలు దాటింది. ఒంటిగంటకూడా అయింది. సుదర్శనం కోసం కొల్లాపూరు రాఘవేంద్రరావుగారు యింటివద్ద ఎదురుచూస్తున్నారు.

అపరాహ్ణం అయింది. ఇంకా ఆబ్దిక మంత్రం ఆరంభించలేదు. అప్పుడు ఆ మండిపోతున్న ఎండలో సుదర్శనుడియొక్క ఆచూకీ ఎక్కడైనా చిక్కునేమో అని ఆ సర్కిలుఇనస్పెక్టరు బయలుదేరాడు. కొంత దూరం కాలువగట్టు వెంటవెళ్లేసరికి మనుష్య సంభాషణ కొంత వినిపించి, ఎండిపోయిన ఆ కాలువను అవలీలగా దాటి, అవలిగట్టుకు వెళ్లిచూచేసరికి సుదర్శనం కరచరణబంధితుడై ఆ చెట్టుక్రింద విలపిస్తున్నాడు "ఏమిటోయ్ యీ అవస్థ?" అని, అశోక వృక్షంక్రింద విలపించిన సీతా అమ్మవారివలెనున్న సుదర్శనమును చూచి. రాఘవేంద్రరావుగారు కేక వేస్తూ దగ్గరకువచ్చేసరికి, ఆయన సందర్శనం సుదర్శనానికి సుదర్శనం అయింది. జరిగిన సంగతిఅంతా చెప్పాడు. అప్పుడు ఖాసిం సాహెబును పాకలోనుంచి బయటకు రమ్మని సర్కిల్ ఇనస్పెక్టరు కేకవేశాడు. "ఎందుకు ఇతనిని యిట్లా కట్టివుంచావు?అని ప్రశ్నించాడు "పోలీసు యినస్పెక్టరుగారి వద్దకు తీసికొని వెళ్లి అప్పగించడానికి యిలా కట్టివేశాను" అన్నాడు. "అలాగయితే నేనే పోలీసు సర్కిలు ఇనస్పెక్టరు రాఘవేంద్రరావును. కనుక, నాకుయితనిని ఒప్పగించు. నా వెంట తీసికొని పోతాను. నీవు రా నక్కరలేదు ఖాసిం!" అన్నాడు. "ఇతడు చేసిన నేరం విచారణచేస్తాం. అతడు ఏ చెట్టునుంచి కాయలు కోసినాడో, ఆ చెట్టు కాయలు మంచివి ఒక డజను కోసి ఒక బుట్టలో పెట్టి మాయింటికి పంపించు. 12 కాయలు అయినా అతను కోసినట్లుగా నీవు బుజావు చేస్తేనే తప్ప, అతనిమీద కేసు బలంగా ఉండదు. కనుక, పెద్దసైజు కాయలు ఇటువంటివే మరికొన్ని కోసి పంపించు" అన్నాడు. "12 కాయలు కాదండీ. 50 కాయలు కోసి పంపిస్తాను సాబ్! శిక్ష దిట్టంగా వెయ్యాలి మీరు" అని ఖాసిం గర్జించాడు. రాఘవేంద్రరావుగారు వెంటనే సుదర్శనాన్ని వెంటబెట్టుకొని యింటికివెళ్లి అతనిచే సర్వాప్రమ ఫలాపహారణ పాపపరిహారంగా అఘమర్షణ స్నానం చేయించి, శ్రాద్ధకర్మ మధ్యాహ్నము 2 గంటలకు ప్రారంభించారు. మరి కొంతసేపటికి ఖాసింసాహెబు పెద్ద గంపనిండా రమారమి 75 భారీసైజు అవకాయ మామిడికాయలు ఆ చెట్టువే కోయించి రాఘవేంద్రరావుగారింటికి స్వయంగా తెచ్చి ఖుద్దున దాఖలుచేశాడు. "ఇనస్పెక్టరుగారు లోపల పనిమీద ఉన్నారు. ఖాసింసాహెబు తెచ్చియిచ్చాడని చెప్పి నేను ఒప్పగిస్తానులే" అని వాకిట్లో ఉన్న పోలీసుజవాను ఆ కాయలను గంపతో సహా తీసికొని లోపల భద్రంగా పెట్టించి, శ్రాద్ధకర్మ అంతా సాంతమైన అనంతరం ఇనస్పెక్టరుగారికి ఒప్పగించాడు. ఆ కాయలను ఆయన సుదర్శనానికి ఒప్పగించి "యిటువంటి పనులు ఇంకెప్పుడూ చేయకు"అని చీవాట్లుపెట్టి"ఇంటికి తీసికొని వెళ్లి మీ నాన్నగారికి యియ్యి"అన్నాడు. ఖాసిం సాహెబుకు ఆ కాయల కిమ్మతు యివ్వాలని సర్కిలుయినస్పెక్టరుగారు జవానుతో అన్నారు. కాని ఖాసింసాహెబుకు అసలు సంగతి అంతా జవానుద్వారా అవగాహన అయింది. "యినస్పెక్టరు సొంత మనిషీ అని నాకీ తెల్వాలేదు" అన్నాడు. ఎన్నిసార్లు కబురు చేసినా ఆ కాయల కిమ్మతు యిస్తానంటే నిరాకరిస్తాడు. సుదర్శనానికి జరిమానా వేయించడానికి బదులు నజరానా యిచ్చాడు. ఖాసింఖాను తనకు 75 కాయలు తగ్గితే వచ్చిన లోటు ఏమీ లేదన్నాడు. కాలువ ఒడ్డున ఉన్న ఆ చెట్లన్నీ భారీప్రమాణంగా అతడే ఆ ఏడు యిజారా పాడినాడు. చెట్లన్నీ విరివిగా కాయలుకాచినవి. కాని,అతనికి అందువల్ల గర్వం ఏమీ లేదు.

"ఉద్ధతులుగారు బుధులు సమృద్ధిచేత" మామిడిచెట్టు మొదలైన ఫలవృక్షములు విరివిగా కాయలుకాసి యివిగోమీరు ఆరగించండి అన్నట్టుగా ఎంతో వినయంగా క్రిందికి వంగినట్లు మనకు కన్పిస్తాయి. కాని,యివన్నీ మనం అనుభవించుటకొరకే యీవిధంగా మనచేతి కందుతున్నాయని భ్రమించడం వివేకంకాదు. ఈప్రకృతిలోని భాగమే మానంకూడా - కనుక 'ఈశ్వరార్పణ కాదె - యీ జన్మ ఫలము" అని గ్రహించి జీవితఫలము ఎందుకొరకో తెలిసికోవాలి. అప్పుడు "జగతి నుపకర్తల కిది సహజగుణము" అనేమాట మానవుని విషయంలో సార్థకమవుతుంది. సుదర్శనానికి మాత్రం ఈ మాత ఫల మాహాత్మ్యంవల్ల చాలా వివేకం కలిగింది. ★

ఒకసారి ఏమీ తోచక బజారు వెంట తిరుగుతున్నాను. జనసమ్మర్దం తక్కువగా వున్న ప్రాంతానికి పోయే సరికి, అక్కడ ఒక అంగడిలో నుంచీ పెద్దగా ఎవరో వాదించుకోవటం వినిపించింది. ఒక్కక్షణం అక్కడే నిలుచుండిపోయి, పరీక్షగా విన్నాను. ఆ వాదన లేమిటో వుధృతంగానే వున్నట్లు తోచి, వుండబట్టలేక అంగడి లోకి వెళ్ళాను.

తీరా చూస్తే, ఆ అంగడి యజమాని ఒక్కడే వున్నాడు. నాకు ఆశ్చర్యం వేసింది.

"ఎవరితో మాట్లాడుతున్నారు?" అని అడిగాను.

"అఁ! ఏమిటో నండీ! అంగడి మారుమూలనైపోవటంతో జనమే ఎక్కటంలేదు. ప్రొద్దస్తమానం ఒంటరిగా కూర్చో లేక నాతో నేనే వాదించుకొంటున్నాను." అన్నాడు అంగడిమనిషి.

"మీతోమీరు మాట్లాడుకొంటే మాట్లాడుకొన్నారు కానీ అంత బిగ్గరగా అరవటం దేనికీ?"

"ఇటు చూడండీ! నేను ఏదైనా సహిస్తాను కానీ, అబద్ధాలు ఆడే వాళ్లను మాత్రం ఛస్తే సహించలేనండీ! అందుకే అరుస్తున్నాను" అన్నాడు ఆ అంగడివాడు.

★ దత్తత ★

(19-వ పేజీ తరువాయి)

రవికేసి చూసి, "లా" అని తల పంకించాడు.

గంగాధరం జమిందారు శాంతమ్మకేసి ఏదో చెప్పాలనే ప్రయత్నంలో అరనిముషంనించి చూస్తున్నాడు. కాని శాంతమ్మ అశ్రునయనాలతో బిడ్డను కరువుతీరా చూస్తూంది.

"అమ్మా"

శాంతమ్మ గంగాధరం కేసి చూసింది.

"చిన్న మాట సంతోషార్థం ... ఒక వేయి రూపాయలు... ఇంకా ఏదో చెప్పడానికి సంశయిస్తున్నాడు.

"బిడ్డను అమ్ముకునేదాన్ని కాను, ఆ వుద్దేశమే మీకుంటే నాబిడ్డను తీసుకవెళ్ళవద్దు" ఈ మాట కోపంగా అంది. అసలు ఆమె మనస్సు ఇప్పుడు స్థిమితంగా లేదు. ఈ పరిస్థితిలో ఏ తల్లిగుండె స్థిమితంగా ఉండదు.

"సరే మీకు కష్టం గలిగేపని నేనెందుకు చేయాలి" అని కారులో ఎక్కి కూర్చున్నాడు గంగాధరం. వెంకమ్మకేసి చూస్తూ "వెంకమ్మగారూ మీమేలు మరువలేను" అని కారు స్టార్ట్‌చేసే ప్రయత్నంలో ఉన్నాడు.

"అంతా భగవంతుని కృప" అని మాత్రం ఆకాశంకేసి చేతులెత్తి చూచింది వెంకమ్మ.

బహదూర్ వారి కుటుంబమంతా, మిద్దెమీద నిలబడి యీ దృశ్యాన్ని వినోదంగా చూస్తున్నారు. ఇరుగుపొరుగు అమ్మలక్కలంతా గుమ్మాల్లో నిలబడి రాము అదృష్టాన్ని పొగుడుకుంటున్నారు.

కారు కదలింది.

"రామూ" అని పిలచింది శాంతమ్మ.

కారు కదిలే విధానంగురించి ఆలోచించే రాము పరధ్యాన్నంగా చూడ్డమే గాని సమాధానం యివ్వలేదు.

ఆ వీధిలో కారు తొందరగా వెళ్ళేసరికి వల్ల లేచిన దుమ్ము చూస్తున్నవాళ్ళ కళ్లు కప్పేసింది. శాంతమ్మ ఆ దూళినే అలా నిలబడి ఎంతసేపు చూసిందో ఆమెకే తెలీదు. వెంకమ్మ పిలుపువిని కళ్ళు తుడుచుకుంటూ లోపలకు వెళ్ళిపోయింది.

గంగాధరం వెళ్ళేముందు "మీమేలు మరువలేను వెంకమ్మగారూ" అనడంలో ఒక విశేషం లేకుండా పోలేదు. ఆరు సంవత్సరాలుగా గంగాధరం ఒక సలక్షణమైన బిడ్డను పెంచుకోవాలనే ప్రయత్నం యీనాటికి ఫలించింది. సంతానవిహీనుడైన గంగాధరం ఉద్దేశాన్ని గ్రహించిన బంధుకోటిలో కొందరు ఉదారంగా తమ బిడ్డల నివ్వడానికి ఆహ్వానాలు పంపించారు కూడా. వాళ్ళు ఏలాంటి స్వార్థంతో, ఈలాంటి స్వార్థత్యాగాన్ని చేయడానికి సంసిద్ధత పడ్డారో గంగాధరంకి తెలిసినా - ఆ అంచనాని పునర్విమర్శన చేయదలచలేదు: ప్రతివాళ్ళ యింటికి వెళ్ళి ఆయా బిడ్డలను చూశాడు. కాని ఒక్కళ్ళూ అతనికి నచ్చలేదు.

అతని కుండిన జ్యోతిష సాముద్రశాస్త్ర పరిచయమే ఈ తిరస్కృతికి కారణమైంది. రాములో కనిపించిన లక్షణాలు గంగాధరాన్ని పూర్తిగా ఆకర్షించాయి అనడంలో సందేహంలేదు. ఏతల్లీ తాను చేయిచాస్తే బిడ్డ నివ్వననే సమాధానం యిస్తుందని గంగాధరం కలలోకూడా అనుకోలేదు. తన ఉన్నతస్థితి గురించి ప్రక్కవారు చెబుతున్నా - ఆమెకు మరోబిడ్డ ఉండికూడా - తనకు బిడ్డ నివ్వడానికి ఇష్టంలేదని శాంతమ్మ చెప్పడంలో గంగాధరం మానసికంగా చాలా బాధే పడ్డాడు. కార్యదీక్షాపరులకు కోపం నిషేధవస్తువుగా ఏనాడో గుర్తించిన గంగాధరం ఇక్కడ తప్పటడుగు వేయలేదు. కాని తల్లికి చూపవలసిన కృతజ్ఞత వెంకమ్మకు అందజేశాడంటే, ఈ కార్య నిర్వహణ విజయానికి కారకు లెవరో అతనికి బాగా తెలుసు. శాంతమ్మ తనపట్ల ప్రవర్తించిన విధానం మాత్రం గంగాధరానికి ఆమెమీద వ్యతిరేకభావం కలగడానికి కారణమైంది.

సుమారు యిరవైమైళ్ళ దూరంలో ఉన్న గుంటూరు చేరుకోడానికి కారు ఆట్టే ఆలస్యం చేయలేదు - జమీందారు భవంతి ముందు కారు ఆగేసరికి నౌకర్లూ-చాకర్లూ ఆశగా చూస్తూ కారుకి కొస్త దూరంలో నిలబడ్డారు. ఆ రోజు యిల్లంతా కళకళ్ళాడుతూ అలంకరింపబడింది.

గంగాధరంభార్య సుందరమ్మ నవ్వుముఖంతో కారు దగ్గరగా వచ్చింది.

"మీ అమ్మ" గంగాధరం భార్యను వేలుతో చూపుతూ అన్నాడు.

"అమ్మ" ఏదో ఆలోచిస్తూ ప్రశ్నార్థకంగానే అన్నాడు.

ఆఒక్కమాటే సుందరమ్మ హృదయానికి అమృతప్రాయంలా పనిచేసింది. అలాంటి పదాన్ని పసిపిల్లల నోటినుండి వినాలని కుతూహలపడే సంతానవిహీన హృదయం చిరుగంతులేసింది. ఆనంద బాష్పాలతో కళ్లు నిండిపోయాయి. ఒక్కసారి రాముని ఎత్తుకొని హృదయానికి హత్తుకుంది. అర్ధనిమీలిత నేత్రాల్తో కాస్సేపు లోకాన్నే మరచింది. ఆ తల్లినీ, బిడ్డనూ చూసిన గంగాధరం బరువుగా నిట్టూర్చి కారుదిగాడు. దిష్టితీసిన తర్వాత రాముని భవంతిలోనకు తీసుకపోయారు.

6

బిడ్డను తీసుకువెళ్ళిన రెండురోజులవరకూ శాంతమ్మ పచ్చి మంచినీళ్ళుకూడా ముట్టలేదు. రవి మధ్య మధ్య 'అన్న' 'అన్న' అంటూ ఏడవడం మాననూలేదు. ఈరభస చూసిన వెంకమ్మ మనసు భయంతో నిండిపోయింది. ఈ మాతృ పుత్రవియోగానికి కారణం పూర్తిగా తాను అనే భావం ఎప్పుడైతే ఏర్పడిందో శాంతమ్మమనస్సు స్వస్థత చేకూర్చటమనే బాధ్యత తనదే ననే ఉద్దేశం కూడా కలిగింది వెంకమ్మకు. అందుకే మూడవరోజు ఉదయాన్నే ఆయాసం దగ్గూ ఎక్కువగా ఉన్నా, శాంతమ్మ పడుకున్న మంచం మీద కూర్చొని కదల దలచలేదు.

"శాంతా" అని పిలచింది వెంకమ్మ.

గోడవైపుగా మొహం పెట్టుకున్న శాంతమ్మ పలుకలేదు.

"నువ్వులేవకపోతే నన్ను చంపుకు తిన్నంతవట్టు" ఈ కంఠస్వరం వెంకమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నట్లు ఊహింపచేసింది.

శాంతమ్మ వెంకమ్మ వైపు తిరిగింది. అప్పటికే శాంతమ్మ మొగం ఆరిన కన్నీళ్ల చారలతో మలినమైవుంది.

"అత్తా" శుష్కస్వరంతో పిలచింది.

శాంతమ్మ పలికిందనే సంతోషాన్ని మొగంలోకి చూపుతూ "ఏంఅమ్మా" అంది వెంకమ్మ.

"నువ్వు చేసినపని మంచిదేనా ?"

"కడుపుతీపి మూలాన్న నీకలా అనిపిస్తుందికాని ఈ పని మంచిది కాదని ఏ ఒక్కరూ అనలేరు" ఈ మాట అని కొత్త దగ్గింది. దగ్గుమాత్రం తీవ్రంకాలేదు:

"మామరదికేం సమాధానం చెప్పుకోను?"

"ఎందుకు చెప్పుకోవాలి?"

ఈసారి నీరసంగా ఉన్న శాంతమ్మ మెల్లగాలేచి మంచంమీద కూర్చుంది.

"నీకు తెలీదత్తా. పోయి ఎక్కడున్నారో వారికి రాము రవి అంటే పంచప్రాణాలూను. పోయేముందు కూడా తమ్ముణ్ని చూస్తూ, 'బిడ్డల బాధ్యత నీది. దీనికి వ్యతిరేకంగా వాళ్లను విడదీస్తే పరలోకంలో ఉన్నా నా ఆత్మవ్యధపడుతుంది' అన్నారు. 'అలా గెప్పుడూ జరగదు' అని మరది వాగ్దానం కూడా యిచ్చాడు."

ఈసారి శాంతమ్మ పొంగివచ్చే దుః

ఖాన్ని ఆపుకోలేక పమిటకొంగులో మొగం దాచుకొని ఏడుస్తోంది.

వెంకమ్మ "శాంతా! చూడమ్మా! నీకింత బాధ కలుగుతుందంటే నేనుమాత్రం యీపని చేస్తానమ్మా" అంది.

కాస్సేపు ఇద్దరూ నిశ్శబ్దంగా ఉన్నారు. "ఈ తప్పు చేసినదానికి ఎవరిచ్చే శిక్షయినా నేనే అనుభవిస్తాలేమ్మా! భగవంతుడికూడా నేనే సమాధానం చెప్పుకుంటాను...ఈ పాపం చాలు తల్లీ... నువ్వు తిండికి మాడి యింకా పాపాన్ని నాకు చుట్టుకోనివ్వకు" అంది.

వెంకమ్మ మొగంకేసి శాంతమ్మ చూసింది. ఎంత బాధలో అయినా ఆమె కళ్ళనీళ్ళు శాంతమ్మ చూడలేదు. కాని ఇప్పుడు ఆమె కళ్ళల్లో మెదిలే నీళ్ళు, ఆమె మానసికంగా పడే క్షోభను శాంతమ్మ గుర్తించేటట్లు చేశాయి.

శాంతమ్మ మెల్లగా లేచింది. వెంకమ్మ కర్ర ఆధారంతో వెనకాలనే లేచింది. ఇద్దరూ కలసి వంటగదివైపు వెళ్ళారు.

మనుష్యుల మనస్సులు గుర్తించకుండా - అర్థం చేసుకున్నామనే అపోహతో, తాము చెప్పేదే శ్రేయోదాయకమని ఉచిత సలహాలివ్వడమే గాక, అది మంచిమార్గమని వేలెట్టి చూపుతూ నిర్బంధంగా ఆ దారిని పొమ్మంటారు కొందరు పెద్దలు. ఆచరణలో ఆ గమనం ఎంత బాధాపూరితమో; ఎంత కంటకమయమో - నడచేవాళ్లు క్షోభిస్తేంటే, అప్పుడు గ్రహిస్తారు. అప్పటికయినా ఆత్మాభిమానంతో పడి చచ్చే వాళ్ళు తమ తప్పును ఒప్పుకోలేరు. కాని హృదయమున్న వెంకమ్మలాంటి ఏ కొందరో నిజాన్ని ఒప్పుకొని పశ్చాత్తాప పడచ్చు. అయినా చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకొనే ఫలితమెంతో ఈ పశ్చాత్తాపానికి కూడా ఫలితమంతే.

ఈ విషాదపూరిత పుత్రవియోగ బాణాఘాతం శాంతమ్మహృదయాన్ని గాయ[illegible]చ్చిన తర్వాత నెల్లాళ్ళకుగాని, ఆ గాయం [illegible] మొగం పట్టలేదు. ఇప్పుడిప్పుడే రవి[illegible]నే రాముని కూడా చూసుకుంటూ తృప్తిపడుతోంది శాంతమ్మ. సాయంసమయాన రవిని ప్రక్కను కూర్చోబెట్టుకొని, చేటలో బియ్యం ఏరుతున్న శాంతమ్మకు అడుగుల చప్పుడు వినిపించి తలెత్తిచూసింది.

చంద్రయ్య వచ్చి నిలబడ్డాడు.

అతన్ని చూడ్డంతోనే, శాంతమ్మ గుండెలొక్కసారి ఝల్లుమన్నాయి. కాని ఆ అదురు మొగంలో కనిపించనీయకుండా మెల్లగా లేచి, వాకిట్లో వాలు కుర్చీ వేసింది. చంద్రయ్య కుర్చీమీద కూర్చున్నాడు. శాంతమ్మ మొదట్లో అంత కంపితురాలు కావడానికి కారణం తాను చేసిన నేరమే కాదు. చంద్రయ్య మొగం కూడా క్రోధరేఖలతో నిండిపోయి ఉంది.

శాంతమ్మ మెల్లగా వెళ్ళి చెంబుతో నీళ్ళు తీసుకవచ్చి మరదిదగ్గర పెట్టింది. రవి అంత చనువుగా చంద్రయ్యదగ్గరకు రాలేదు. బహుశా ఈ రెండు మాసాల్లో కొద్దిగా అలవాటు తప్పివుండవచ్చును.

చంద్రయ్య రవిని మొదట్లో చూసినా అతని మీద దృష్టి నిలుపలేదు. శాంతమ్మకేసే చూస్తున్నాడు.

శాంతమ్మ ఏదో పలకరిద్దామని ఒకసారి చంద్రయ్యకేసి చూసింది. కాని ఆ వెంటనే తల వంచుకువెళ్ళి బియ్యం చేట దగ్గర కూర్చుంది.

ఒదినగారంటే, చంద్రయ్యకు భక్తి ఉన్నా, చంద్రయ్య అంటేమాత్రం ఆకుటుంబానికంతటికీ ఒక భయం మాత్రం ఉండేది. దానికి కారణం చంద్రయ్య కష్టాన్నిగాని, సంతోషాన్నిగాని తొందరగా జీర్ణించుకోలేడు. ఉన్నమాటఏదన్నా మొగంమీదనే అడిగేసేలక్షణం......దాని గురించే శాంతమ్మ ఆలోచిస్తోంది.

"రాము ఏడి" చంద్రయ్య అడిగాడు. ఆప్రశ్నలో ఉన్న బాధాపూరిత భావం వల్ల శాంతమ్మ సమాధానమివ్వలేక పోవడమే కాదు తలెత్తలేకపోయింది.

"ఏం వొదినా?"

ఇప్పుడు తలెత్తి చూసింది.

"దత్తత వెళ్ళేడా ?"

"నాకు తెలీదు"

"తెలుసుకోకుండా పిల్లవాణ్ని ఎలా యిచ్చావ్ ?"

ఈమాటకు శాంతమ్మ సమాధానం యివ్వలేదు.

"డబ్బేమన్నా ముట్టిం దేమిటి" ఈమాట చాలా మెల్లగా అన్నాడు. అది ఎంత ధ్వని తక్కువలో శాంతమ్మకు వినిపించిందో, అంత వడిగా చెవినించి దాటి హృదయాన్ని తూటుపరచింది. ఒక్కసారి శాంతమ్మ మరదికేసి చూసింది. ఆమె కళ్ళలో ఉబికిన రక్తపునాళాలు చంద్రయ్య చూశాడు.

"ఏ ప్రతిఫలం లేకుండా ఆ బిడ్డను పరుల చేతిలో పెట్టవని నాకు తెలుసు."

ఈ మాటతో శాంతమ్మ లేచింది. "ఔను తీసుకున్నాను" చాలా ,చింతగానూ - నిర్లక్ష్యంగానూ - బాధగానూ ధ్వనించిందా కంఠం.

"హోటలుకు పెట్టుబడి లేదా ?"

"నాకు సమాధానం యివ్వవలసిన పని లేదు. చచ్చినతర్వాత సమాధానం చెప్పుకోవాలంటే వారిదగ్గరే చెప్పుకుంటా."

తొందరగా తలుపు వెనక్కి వెళ్ళిపోయింది.

"నేనిస్తాను బాబూ ఆ సమాధానం."

చంద్రయ్య తల యిటు త్రిప్పిచూశాడు. వెంకమ్మ ఎప్పుడొచ్చి నిలబడిందో, అతనికి తెలీదు. వెంకమ్మ ఈలా చెప్పడమారంభించింది.

"నువ్వెళ్ళిన మరునాటినుంచే శాంతమ్మ హోటలు మూసివేయించింది. జమిందారు గంగాధరానికి పిల్లవాణ్ని యిచ్చింది నేను. వాళ్ళు దత్తత చేసుకుంటారని నాతో చెప్పారు. డబ్బు కాసించి పిల్లవాణ్ని అమ్మకుండనే నేరం నువ్వేస్తే; చాలా పాపం తగులుతుంది బాబూ!..." ఈ ఆఖరి మాటలు కోపంగా అనడంతోనే వెంకమ్మకు దగ్గువచ్చింది. ఆ దగ్గుసందడిలో, చంద్రయ్య నిట్టూర్పు ధ్వనికూడా ఎవరికీ వినిపించలేదు.

దగ్గు తగ్గింది మళ్లీ వెంకమ్మ యిలా అంది.

"రాము జమిందారు కావడం నీ కిష్టం లేదా బాబూ! అలాంటి కష్టమేదన్నా ఉంటే; నన్ను దూషించు కాని శాంతమ్మను ఏమీ అనమాకు...నీకు ఏవిధంగా సమాధానం చెప్పుకోవా అని యీ రోజు వరకూ ఏడుస్తూనే వుంది."

ఈమాటలువిన్న చంద్రయ్యకోపం కొన్త తగ్గ నారంభించింది. వచ్చినప్పుడున్న ఆవేశాన్నీ, ఒదినగారు హోటలు కట్టివేసిందనీ, తనకు సమాధానం చెప్పుకోడానికి బాధపడుతోందనే మాటలు-చల్లని వాన జల్లులా హృదయానికి తాకాయి.

"కాదు పెద్దమ్మా! ఆమెను బాధపెట్టాలని నా ఉద్దేశంకాదు. కాని ఆ రాముని నాదగ్గరే ఉంచాలనుకున్నాను. అయితే ఒదినకు జడిసి ఆ మాటనే నడగలేకపోయాను. పైగా మా అన్న యిద్దర్నీ విడదీయవద్దని చెప్పాడారా...ఇవన్నీ ఆమెకు తెలుసు, తెలిసుండికూడా ఈపని చేసిందంటే; నాకెంత కష్టంగా వుంటుందో చెప్పు...అన్నగారు చచ్చిపోయినా మరది చావలేదని తెలుసుగా - నా ఆలోచనకూడా అక్కర్లేని పాపం నేనేం చేశానో నాకర్థం కావడల్లేదు" మెల్లగా కుర్చీమీదనించి లేచి—"ఒదినా" అని పిలచాడు.

తలుపుప్రక్కనించి వచ్చి నిలబడింది. ఆమె కళ్ళు అప్పుడే తుడుచుకున్నట్లుగా చంద్రయ్య గుర్తించాడు.

"ఎవరో డబ్బు తీసుకుని పిల్లవాణ్ని యిచ్చినట్లుగా చెప్పారు...నిజమే; నువ్వన్నట్లుగా నాకేం సంబంధముంది? ఏనాడైతే అన్న పోయాడో - ఆనాడే నాకు

★ దత్తత ★

ఒదినకూడా దూరమైంది..." ఇక మాట్లాడలేకపోయాడు. కంఠం గద్గదికమైంది.

శాంతమ్మ ఆశ్చర్యంగా దగ్గరకొచ్చి నిలబడింది.

ఆ వాలుకుర్చీలో చంద్రయ్య కూలబడి ముఖం చేతులతో కప్పుకొన్నాడు.

"అజేంపని బాబూ"

ఈ మాటలు శాంతమ్మ అంది.

ఈ విషయాన్నంతా గమనిస్తున్న రవి గుక్కపెట్టి ఏడుస్తున్నాడు.

వెంకమ్మ అంత నీర్సం తో నూ - క్రచేతిలో ఉండగానే రవిని చంకనేసుకుని ఊరడిస్తూ దొడ్డివైపునకు తీసుకపోయింది. ఆరోజు చంద్రయ్యలో మార్పు శాంతమ్మను విస్మితురాలుగా చేసింది.

భోజనానికని పిలిచిన ఒదినగారి ఆహ్వానాన్ని కూడా తిరస్కరించకుండా వెళ్ళి ఆకుదగ్గర కూర్చున్నాడు. అతను భోజనం చేస్తున్నంతసేపూ శాంతమ్మ కాస్త దూరంగా ఎదురుగానే కూర్చుంది.

తనపై చంద్రయ్య హృదయంలో ఏలాంటి ప్రేమాభిమానాలున్నాయో శాంతమ్మ ఈరోజు ఎక్కువగా అర్థం చేసుకుంది. ఆ మధురభావనే, అవిరామ గతితో ఆమె హృదయంలో ప్రవహిస్తోంది. భోజనమైన తర్వాత చంద్రయ్య లేచి, చేతులు కడుక్కొని, కండువా పైన వేసుకుంటూ "వెళతా ఒదినా" అన్నాడు.

"కాస్సేపు తాళి వెళుదువుగాని యిప్పుడేగా భోజనం చేసింది."

"అయినా పరవాలేదు..." రెండు అడుగులు వేసి "ఇక రాను - ఏదన్నా కష్టం వచ్చినప్పుడు నన్ను మర్చిపోకు...తప్పులుంటే క్షమించు" గుమ్మందాటి వెళ్ళిపోయాడు.

శాంతమ్మ స్తబ్ధురాలై అలాగే నిలబడిపోయింది. ఈ ఆఖరిమాటలు అతని హృదయంలోఉన్న తీరని వ్యధను వ్యక్తం చేసేయి. తానే ఆ క్షమాపణ కోరుకోవాలనుకుంది శాంతమ్మ. . ఆ అవకాశాన్ని అతనే తీసుకొని చేయని నేరానికి క్షమాపణ కోరి వెళ్ళిపోయాడు.

(ఇంకావుంది)

పంతులు:- అబ్బాయిలూ! కాలం వ్యర్థం చేయక పరీక్షకు అన్ని పాఠాలూ చదవండి.

విద్యార్థి:- "అన్ని" పాఠాలూ చదవడంవల్ల కాలం వ్యర్థమండీ. దయుంచి పరీక్షకిచ్చిన వేవో చెప్పండి.

శ్రీ అరిగెల రామారావు,
రాజమండ్రి.

(11-వ పేజీ తరువాయి)

ఇంటికివచ్చి, కిటికీలోనుండి లోపలికి ప్రవేశించారు. వాళ్ళ ఆనవాళ్ళు ఉండనేవున్నాయి. గుమ్మందగ్గిర జోళ్ళని విడచి, పడకగదిలోకి వెళ్ళేరు. లోపలికి వెళ్ళేటప్పుడు మీరు తలుపుమీద గట్టిగా గీచేరు. అది మీరివాల్వరుతో అయివుంటుంది. నీటిగొట్టంమీద, పక్కదుప్పటిమీద, బురదచేతి ముద్దరలు అంటాయి. పైగా రాజావారిచొక్కామీదకూడాను."

"ఆయన పక్కమీద లేడు. పక్క ఖాళీగానే వుంది. కిటికీలోనుండి ఇదివరకే క్రిందపడివున్నాడు. నేను భగవంతుని సాక్షిగా చెపుతున్నా" కుర్చీలోనుండి లేచి గట్టిగా అరిచేడు.

"కంగారు పడకండి, నెమ్మది. రాజావారు ప్రక్కమీద వుండగానే మీరు గుండెల్ని మూచారనడంలేదు. ఆయన ఎలా చచ్చేరో మాకు తెలుసు."

"మీకు తెలుసా ?" నిజంగా అది ఒక పెద్దపాలికేకే.

ఆ కిటికీ పరిసరాలుగల ఫోటోని తీస్తూ "మాచేరూ, గోడకు అంటించిన రంగు కాగితంముక్కల లోపమే మమ్మల్ని కారణం గ్రహించేటట్టు చేసింది. వాళ్ళ నౌకరు చెప్పేడు - అప్పుడప్పుడు రాజావారు ఊపిరితీసుకోడంలో బాధపడేవారని. చూచారా, ఆ చిన్న చిన్న రక్తపు చుక్కలు, అవి ముక్కులోనుండి పడ్డవే. ఊపిరితీయడం కష్టం అయ్యిందికనుకనే ప్రక్కనుండిలేచి, కిటికీ తెరిచారు ; గాలి వస్తుందని. పైగా ఆరాత్రి ఎక్కువగా తాగివున్నారేమో తూలడంవల్ల క్రింద పడిపోయారు."

"అయితే, నన్ను అనుమానించటంలేదన్నమాట" నాయనిమాటలు, కాళ్ళు చేతులు కట్టివదలినవాడి కదలికలాగే, ఒక్కుమ్మడి వచ్చాయి.

"మిమ్మల్నా...ఖూనీకా - లేదు. అయినా మీరు నిజం చెప్పండి. మనం అందరంకూడా—"

"నిజంగా నేను అతన్ని" గొంతులోనుండి వచ్చింది.

"చంపాలనే వెళ్ళేరు" సుదర్శన్ అందించాడు. నాయని తలూపి కుర్చీకి ఆనుకుపొయ్యాడు.

"శ్రమకి కృతజ్ఞత. దాన్నిగురించి ఇక మీరు వినరు...చెప్పి మననంచేసుకోకండి. నా అభిప్రాయంలో ఖూనీచేయాలన్న అభిప్రాయమే చాలు, చేసినంత ఫలము ఇస్తుంది. నిజంగా, మీ రెంత బాధపడ్డారో తెలుస్తోంది." సుదర్శన్ శెలవు పుచ్చుకొని వెళ్ళేడు.

కుర్చీలో "వెంకటేశ్వరస్వామీ ! నమస్కారాలు" అంటూ కుప్పకూలిపోయాడు, దివాన్ బహదూర్ నరసింగనాయనింగారు.


("ఆంగ్లకథ ఆధారంతో") ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu ChettySt, Madras



పాలరాతి గుట్టలనడుమ నర్మదానది నడకలు

ఫోటో —శ్రీ ఎ భాస్కరరావు (వాల్తేరు)



ప్రతాపగడ్ కోట

ఫోటో —శ్రీ వి ఆర్. సబ్నవీసు (బొంబాయి)